17-8Pg1exHMNWJQE_17-8Pg1exHMNWJQE.qxd 8/17/2025 12:34 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 197 పేజీలు: 12వెల: 8.00


పద్మశ్రీ అవార్డు గ్రహీత పతకాలు చోరీ
భారత్‌పై సుంకాలపట్ల మెత్తబడిన ట్రంప్ 9లో

# సంక్షేమానికి రాబడులే కీలకం

**సొంత ఆదాయ వనరుల పెంపుపై దృష్టి పెట్టాలి**

**2026 ఫిబ్రవరికి స్వామిత్వ సర్వే ద్వారా గ్రామకంఠాల గుర్తింపు పూర్తి**

**ఆదాయంలో లీకేజీలను అరికట్టేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం: సీఎం చంద్రబాబు**



**విజయవాడ ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆదాయార్జనపై ఏపీ సీఎం చంద్రబాబు మార్గకదర్శకాలకు అనుగుణంగా అధికార అధికార యంత్రాంగం పూర్తి దృష్టిని కేంద్రీకరించింది. సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో ఆ దిశలో అధికార యంత్రాంగ సన్నద్ధమవుతుంది,కీలకంగా ఏపీ ప్రభుత్వం "స్త్రీశక్తి" మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ఈపథకంపై ప్రభుత్వానికి రూ. రెండు వేల కోట్లపైగా ఆర్థిక భారం పడుతుంది. దీంతో పాటు సంక్షే పథకాలన్ని ఎటువంటి అడ్డంకులు లేకుండా అభివృద్ధి చెందాలంటే ఆదాయం వృద్ధి కావాలన్నది సీఎం చంద్రబాబు ఉద్దేశం, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆదా యంలో 8 శాతం వృద్ధి నమోదు కానుందనే అంచనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా పరిశీలించారు. ఆదాయార్జనలో మరింత శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర నిధులు, టాక్స్ డెవల్యూ షన్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఏపీ టాక్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా పన్ను వసూళ్లను పర్యవేక్షించాలన్నారు. సేవల రంగం ద్వారా ఎక్కువ పన్ను ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. సొంత ఆదాయ వనరులు పెంచుకునేందుకు అన్ని మార్గాలపైన దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో చేపట్టే కాంట్రాక్టు పనులకు వినియోగించే వాహనాల పెట్రోలు, డీజిల్ ఉత్పత్తులను రాష్ట్రంలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని కాంట్రాక్టు సంస్థలు పొరుగు రాష్ట్రాల్లో పెట్రోలియం ఉత్పత్తులు కొనుగోలు చేయటంవల్ల రాష్ట్ర ఆదాయం కోల్పోతున్నామని, దీనిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి ఎక్సైజ్ ఆదాయం కంటే ప్రజారోగ్యమే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు, ఆర్థిక లావాదేవీలకు అనుగుణంగానే భూ రిజిస్ట్రేషన్ విలువలు ఉండాలని నిర్దేశించారు. క్రయ విక్రయాలును శాస్త్రీయంగా విశ్లేషించాలన్నారు. భూమి విలువలు పెంచుకుంటూ పోవటం సరికాదని అన్నారు. మార్కెట్ విలువలు, ప్రాపర్టీ డేటా కోసం డేటా అనలటిక్స్ వినియోగించాలని అన్నారు. పన్ను ఎగవేతలను గుర్తించడానికి, ప్రభుత్వ ఆదాయంలో లీకేజీలను అరికట్టేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు చేయడంతో పాటు సాంకేతిక వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. భూమి వివరాలను జీఐఎస్ ద్వారా ల్యాండ్ మ్యాపింగ్ చేయాలని, ఈరిజిస్ట్రేషన్లు, బౌండరీలను జీఐఎస్ సహాయంతో మ్యాప్ చేయాలని సూచించారు. వాహనాల పన్ను చెల్లింపులు సక్రమంగా జరిగేలా ఆర్టీజీఎస్, సీసీ కెమెరాలను ఉపయోగించాలని సీఎం స్పష్టంచేశారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రస్తుతం ఇస్తున్న రాయితీని కొనసాగించాలని >>2




# కాల్పుల విరమణ అవకాశాలు తక్కువే

**నేరుగా ఒప్పందంచేసుకోడమే మేలు**

**అసంపూర్తిగా ముగిసిన అలాస్కా చర్చలు**

**తదుపరి ట్రంప్, పుతిన్ భేటీ మాస్కోలో..**

**అలాస్కా, ఆగస్టు 16:** ఉక్రెయిన్ యుద్ధం నివారించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ నిర్వహించిన ముఖాముఖీ భేటీ ఎలాంటి ఫలితం లేకుండానే ముగిసింది. అలాస్కాలో జరిగిన ఈచర్చలు నాలుగు గంటలపాటు సాగినా ఎలాంటి ఫలితాలు ఒనగూరలేదు. ఈ చర్చలపై ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్‌మీడియాలో చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనంగా మారాయి. ఉక్రెయిన్, రష్యాలునేరుగా శాంతి ఒప్పందం చేసుకోవడమే ఈ యుద్ధాన్ని ముగించేందుకు మేలైన మార్గమని అన్నారు. అయితే కాల్పుల విరమణకు నిలబడే అవకాశాలు కూడా చాలా తక్కువేనన్నారు. ఐరోపాదేశాలనేతలు, జెలెన్‌స్కీతో కూడా మాట్లాడానని దీన్నిబట్టి చూస్తే పుతిన్, జెలెన్‌స్కీలు నేరుగా ఒప్పందం చేసుకోవడమే మేలని తన పోస్టులో వివరించారు. ఇదిలా ఉంటే అలాస్కాలో భేటీ అనంతరం ఇరువురునేతలు >>2

## యుపిక్స్ మోసం కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

**మీడియా సమావేశంలో వెల్లడించిన విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు**

**విజయవాడ,ఆగస్టు 16,ప్రభాతవార్త ప్రతినిధి:** యుపిక్స్ మోసం కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే సందర్భంలో సినిమాలకు యానిమేషన్ పేరుతో జరిగిన భారీ మోసంలో యూపిక్స్ గ్రూప్స్‌లో పెట్టుబడులు పెట్టిన వారి సంఖ్య 344 మందిగా విజయవాడ పోలీసులు లెక్క తేల్చారు. 183 మందికి ఆర్థికంగా నష్టం వాటిల్లితే, 136 మంది అయాచిత ఆర్థిక ప్రయోజనం పొందినట్లు గుర్తించారు. మరో 25 మందికి కనీస లబ్ధి కూడా చేకూరలేదని కనుగొన్నారు. మొత్తంగా 592.72 కోట్ల రూపాయల వరకు యూపిక్స్‌లో పెట్టుబడులు పెట్టారని, రూ. 201.55 కోట్లవరకు నష్టపోయినట్లు పూర్తి సాంకేతికంగా నిర్వహించిన దర్యాప్తులో బయటపెట్టారు. ఈ కేసులో మొత్తం నలుగురు కీలక నిందితులుగా విజయవాడ నగర పోలీసుకమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. విజయవాడ సత్యనారాయణ పురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదిశేషయ్య వీధిలో యూపిక్స్ >>2

# ధర్మవరంలో ఉగ్రకలకలం

**నిషేధిత ఉగ్రవాద సంస్థలతో నూర్ మహమ్మద్‌కు లింకులు, విచారణ తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తాం: ఇన్‌చార్జి డిఎస్పీ నరసింగప్ప**




కొత్వాల్ నూర్ మహమ్మద్(ఫైల్), ఓటరు కార్డు

**ధర్మవరం,ఆగస్టు16 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకుని దేశభక్తి భావంతో నిండి ఉన్న నేపథ్యంలో శనివారం ఉగ్రవాద కదలికలతో ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. శ్రీసత్యసాయి జిల్లాలో ఉగ్రవాద కదలికలు బయటపడడంతో స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చెప్పాలంటే ధర్మవరంలో ఉగ్రవాద మూలాలు వెలువడడం శ్రీ సత్యసాయి జిల్లాలోనే తీవ్రకలకలం రేపింది. నిషేధిత ఉగ్రవాద సంస్థలతో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తికి సంబంధాలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అందుకు సంబంధించి పక్కాసమాచారంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దాదాపు ఐదు నిషేధిత ఉగ్రవాద సంస్థలతో ముస్లీం యువకుడు వాట్సాప్ గ్రూపులలో ఉంటూ ముస్లీం యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించేలా పనిచేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ వ్యక్తిని నాలుగు రోజుల క్రితం ఐబీ, ఎన్ఐఏ పోలీసులు అదుపులోకి తీసుకుని లోతుగా విచారణ చేస్తున్నారు. ఏఏ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయో తెలుసుకోవడంతో పాటు,స్థానికంగా యువతను ఆ ఉచ్చులోకి లాగే ప్రయత్నాలు జరిగాయా అన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలను ధర్మవరం ఇన్చార్జ్ డీఎస్పీ నరసింగప్ప పలు వివరాలను శనివారం వెల్లడించారు. ధర్మవరం పట్టణంలోని లోనికోటకు చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్(45) నివాసముంటున్నారు. నూర్ మహమ్మద్ స్థానిక మార్కెట్ వీధిలోని ఓ ముస్లిం బిరియాని సెంటర్లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అయితే నూర్ మహమ్మద్ వ్యవహారశైలితో పాటు నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాల గురించి కొద్ది రోజులకు సమాచారం అందింది. దీంతో రహస్యంగా పోలీసులు అతని >>2

## విద్యుత్తు శాఖలో ఖాళీల భర్తీకి ఆమోదం

**విజయవాడ,ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ శాఖలో ఖాళీల భర్తీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దశాబ్ద కాలం తర్వాత విద్యుత్ సంస్థల్లో ఉద్యోగాల నియామకాలు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్న 9,849 పోస్టుల్లో దిశలో ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. వీలైనంత త్వరగా ఖాళీలున్న పోస్టుల్లో కనీసం 75శాతం భర్తీ చేయాలన్నది ప్రభుత్వ భావిస్తుంది. టెక్నికల్ కేడర్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ , అసిస్టెంట్ ఇంజినీర్లు సివిల్, ఎలక్ట్రికల్, టెలికాం, ఐటీ, జూనియర్ ఇంజినీర్లు, నాన్ టెక్నికల్ కేడర్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆపరేషన్, నిర్వహణ (ఓ అండ్ ఎం) కేటగిరీలో జూనియర్ లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీల్లో 75 పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. పదోన్నతులు, పదవీ విరమణలతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయి. వివిధ కేడర్లలో 40శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యను ఉద్యోగసంఘాలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాయి. కూటమి ప్రభుత్వం మళ్లీ నియామకాలకు అనుమతించింది. డిస్కంలు, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల >>2

## నాలుగు రోజులు భారీ వర్షాలు


**విజయవాడ,ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో అల్పపీడనం ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో మత్స్యకారులను మంగళవారం వరకు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, గంగవరం, కళింగపట్నం ఓడరేవులకు మూడో నంబరు హెచ్చరికలు కొనసాగిస్తున్నారు. విశాఖపట్నం, కర్నూలు, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు ఇప్పటికే హెచ్చరించారు.
సాయంత్రం 6 గంటల వరకు విశాఖ జిల్లాలోని పెందుర్తిలో అత్యధికంగా 8.6 సెం.మీ. వర్షం కురిసింది. మరోవైపు వాయవ్య బంగాళాఖాతంలో సోమవారం తర్వాత మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కొన్ని నమూనాలు సూచిస్తున్నాయి. ఈ నెలాఖరు వరకు రుతుపవనాలు చురుగ్గా కదులుతాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. వీటి ప్రభావం కారణంగా >>2

## చెరువులో పడి ఎద్దులతో సహా రైతు మృతి

**ఆలమూరులో విషాదఛాయలు**

**రుద్రవరం, ఆగస్టు 16, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామ సమీపంలోని శీలబోయిన చెరువులో శనివారం ప్రమాదవశాత్తూ పడి రెండు ఎద్దులు, రైతు గోవిందిన్నె హుసేన్‌బాష(42) మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాలమేరకు హుసేన్‌బాష గ్రామసమీపంలో ఉన్న పంట పొలాల్లో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో దారి పక్కనే ఉన్న శీలబోయిన చెరువులో ఎద్దులను శుభ్రం చేసేందుకు బండితో సహా చెరువులోకి వెళ్లి ఎద్దులను శుభ్రం చేస్తుండగా నీటిలో శబ్దం రావడంతో ఎద్దులు ఒక్కసారిగా బెదిరి చెరువులోపల ఉన్న పెద్ద గుంతలోకి బండితో సహా >>2

## జైలు నుంచి నేరస్థుడు పరార్



మహ్మద్ రఫీ(ఫైల్)

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ప్రొద్దుటూరు సబ్ జైలు నుంచి శనివారం ఓ చోరీ కేసులో నిందితుడైన కరుడు గట్టిన నేరస్థుడు మహ్మద్ రఫీ (27) ఉదయం 6 గంటలకు జైలు నుంచి పరారయ్యాడు. జైలు గోడ ఎక్కి ట్రాఫిక్ పీఎస్ సమీపంలో గల కరెంటు తీగలు తొలగించి పరారయ్యాడు. దీంతో జైలు సిబ్బంది నేరస్థుడి కోసం వేట ప్రారంభించారు. డీఐజీ రవికిరణ్ అతనిపై విచారణకు ఆదేశించారు. దువ్వూరు మండలం జిల్లెల్ల పంచాయతీ పెద్ద బాకరాపేటకు చెందిన దూదేకుల తిమ్మారెడ్డి మహ్మద్‌రఫీ రాష్ట్ర వ్యాప్తంగా 40 పోలీసు స్టేషన్లలో >>2

## 'శ్రీవాణి' కోసం గందరగోళం

**పెరిగిన రద్దీతో అర్ధరాత్రి దర్శన టిక్కెట్లు**

**బారులుతీరి నిరసన తెలిపిన భక్తులు**



**తిరుమల, ఆగస్టు 16ప్రభాతవార్తప్రతినిధి:** వరుససెలవులు, వారాంతం రద్దీతో జనసంద్రంగా మారిన తిరుమలకొండపై >>2





శనివారం నాగార్జున సాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

# ముగ్గురు నిందితుల అరెస్ట్

>> కంపెనీని ప్రారంభించి, ఎక్కువ లాభాలు ఇస్తామని చెప్పి పెట్టుబడులు ఆకర్షించారు. కంపెనీ డైరెక్టరు, ప్రధాన సూత్రధారి నిడమోలు వెంకట సత్యలక్ష్మీకిరణ్‌తోపాటు గుంటూరుకు చెందిన తండ్రీకుమారులు మిట్టపల్లి రాజేంద్రబాబు, మిట్టపల్లి రాజీవ్‌కృష్ణను అరెస్టు చేశామన్నారు. బైపాస్ సర్జరీ కావడంతో మరో నిందితుడి నుంచి వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీన నరసరావుపేటకు చెందిన త్రిపురమల్లు శ్రీనివాసరావు, కలవకొల్లు దిలీప్ కుమార్ సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో తాము మోసపోయినట్లు ఫిర్యాదు చేశారు. హాలీవుడ్ సినిమాలకు యానిమేషన్ వర్క్ జరుగుతున్నాయని, తమది అంతర్జాతీయ కంపెనీ అంటూ పెట్టుబడులు ఆకర్షించారు. తమ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన వారికి రెట్టింపు లాభాలు వస్తాయంటూ ఆశ చూపించారు. నరసరావుపేటకు చెందిన ఇద్దరు బాధితులు తమతో 20 కోట్ల రూపాయలు వరకు పెట్టుబడి పెట్టించి మోసం చేశారంటూ సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు సమగ్ర దర్యాప్తును ఆదేశించారు. డీసీపీ కె.తిరుమలేశ్వర రెడ్డి, నార్త్ ఏసీపీ డా॥ స్రవంతి రాయ్ ఆధ్వర్యంలో నలుగురు ఇన్స్పెక్టర్లు, ఇతర సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, మొత్తం యానిక్స్‌లో ఎందరు పెట్టుబడులు పెట్టారనేది వెలుగులోకి తీసుకొచ్చారు. ఈ కేసులో అరెస్టు చేసిన ముగ్గురి నుంచి సుమారు 90 లక్షల రూపాయల విలువైన 354 గ్రాముల బంగారు ఆభరణాలు, 21 కేజీల వెండి ఆభరణాలు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంక్ ఖాతాలను నిలిపివేయించారు. వీటితోపాటు మరో 23 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వానికి లేఖ రాస్తున్నట్లు సీపీ తెలిపారు.నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. 2014లో నిడమోలు వెంకట సత్యలక్ష్మీ కిరణ్ విజయవాడలో యానిక్స్ అనే యానిమేషన్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఇందులో 70 మంది వరకు పని చేసేవారు. కిరణ్‌కి పేరం మాల్యాద్రి, అతని కొడుకు పేరం మహేశ్వర రెడ్డి, కొత్తూరి వేణుగోపాల్ రావు, మిట్టపల్లి రాజేంద్ర బాబు, అతని కుమారుడు మిట్టపల్లి రాజీవ్ కృష్ణ తదితరులు పరిచయమయ్యారు. ఏ విధంగానైనా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో 2018లో వీళ్లంతా ఒక గ్రూప్ గా ఏర్పడి పన్నెండు నెలలకు పదికి పది లక్షలు, పన్నెండు నెలలకు కోటికి కోటి రూపాయలు ఇస్తామని చెప్పుకొచ్చారు. డిపాజిట్ చేసేవారికి అధిక డబ్బులు ఇస్తామంటూ తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మబలికారు. కొందరు వ్యక్తులు ముందుగా పెట్టుబడి పెట్టి లాభాలు సంపాదించినట్లు చూపిస్తూ ఎరవేశారు. ఈ క్రమంలో కొందరు పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు తీసుకున్నారు. అలాగే వీరి బంధువులు, స్నేహితులతో డిపాజిట్ లు చేయించి పెట్టుబడులు చేసేందుకు కమీషన్ ఇచ్చేవారు. పెట్టుబడి ద్వారా వచ్చిన డబ్బులను నిర్వాహకులు వారి సొంత ఖాతాలలో మళ్లించుకున్నారు. ఇందులో మోసపోయిన వారిలో నరసరావుపేట, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా ఉన్నట్లు సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని నగదు రివార్డులతో సీపీ సత్కరించి అభినందించారు.

## చెరువులో పడి ఎద్దులతో సహా రైతుమృతి

>> వెళ్లాయి. దీంతో రైతు హుసేన్‌బాషతో సహా ఎద్దులను ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఇది గమనించిన పంట పొలాల్లోని రైతులు అక్కడికి చేరుకుని చెరువులో చిక్కుకుని మృతిచెందిన ఎద్దులను, హుసేన్‌బాష మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య పర్వీన్, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.


**సంఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ:** శీలబోయిన చెరువులో ప్రమాదవశాత్తూ పడి రెండు ఎద్దులతో సహా రైతు మృతిచెందడంతో రుద్రవరం ఎస్ఐ మహమ్మద్‌రఫీ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాద తీరును అక్కడ ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జైలు నుంచి నేరస్థుడు పరార్

>> కేసులున్నాయి. ఇందులో భాగంగా వెలుగోడు, గోనిగట్ల, ఓర్వకల్లు, ఉదండకొండ, చాగలమర్రి, ఆళ్లగడ్డ, నందలూరు,నందవరం, జమ్మలమడుగు, ముద్దనూరు, రాప్తాడు, గార్లదిన్నె, పెద్దమడుగూరు, సింగనమల, నంద్యాల, డోన్, దువ్వూరు, ఖాజీపేట, కలమల్ల, మైదుకూరు, రాజుపాలెం తదితర పీఎస్ పరిధిల్లో చోరీ కేసులు నమోదయ్యాయి. రాప్తాడు కేసులో మే 3న విడుదలై వరుసగా 4 దొంగతనాలు చేసి 5వచోరీ టంగుటూరులో చేస్తూ నంద్యాల వెంకట సుబ్బయ్య ఇంట్లో పట్టుకున్నారు. మహ్మద్ రఫీ యజమానిని కొట్టడంతో తలకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో ఈనెల 13న కోర్టుకు హాజరుపరచగా వారు రిమాండ్ విధించారు. శనివారం ఉదయం 6 గంటలకు జైలు నుంచి పరారయ్యాడు. ఇతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. దొంగతనాలకు పాల్పడుతున్న మహ్మద్ రఫీ ప్రస్తుతం హైదరాబాదు శంషాబాద్ రాళ్లగూడలో నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది.

## విద్యుత్తు శాఖలో ఖాళీల భర్తీకి ఆమోదం

>> అవసరాల మేరకు వెంటనే భర్తీ చేయాల్సిన కేడర్ పోస్టులను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. టెక్నికల్ విభాగంలో 1,982 ఖాళీలున్నాయి. నాన్‌టెక్నికల్ విభాగంలో 1,875 పోస్టులు, ఓ అండ్ ఎంలో 5,992 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మూడు కేటగిరీల్లో 24,489 పోస్టులు మంజూరు కాగా 9,849పోస్టులు ఖాళీలున్నాయి. సిబ్బందికి పదోన్నతుల వల్ల కేడర్ మారినా సీటు మారట్లేదు. కిందిస్థాయిలో ఏఈఈ, ఏఈ పోస్టుల భర్తీ దశాబ్దకాలంగా నిలిచిపోవడంతో నిబంధనల మేరకు సిబ్బందికి పదోన్నతులు కల్పించినా అక్కడే కొనసాగించాల్సి వస్తోంది. రెండు పోస్టుల విధులతో వారిపై పని ఒత్తిడి పెరిగింది. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా వేగంగా పునరుద్ధరించలేకపోతున్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలో ఎలాగోలా నెట్టుకొస్తున్నా, డిస్కంలో సమస్య ఎక్కువగా ఉంది. దీంతో నియామకాలు చేపట్టక తప్పదని అధికారులు గుర్తించారు. ఈ మూడు కేటగిరీల్లో 24,489 పోస్టులు మంజూరు కాగా 9,849పోస్టులు ఖాళీలున్నాయి. సిబ్బందికి పదోన్నతుల వల్ల కేడర్ మారినా సీటు మారట్లేదు. కిందిస్థాయిలో ఏఈఈ, ఏఈ పోస్టుల భర్తీ దశాబ్దకాలంగా నిలిచిపోవడంతో నిబంధనల మేరకు సిబ్బందికి పదోన్నతులు కల్పించినా అక్కడే కొనసాగించాల్సి వస్తోంది. రెండు పోస్టుల విధులతో వారిపై పని ఒత్తిడి పెరిగింది. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా వేగంగా పునరుద్ధరించలేకపోతున్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలో ఎలాగోలా నెట్టుకొస్తున్నా, డిస్కంలో సమస్య ఎక్కువగా ఉంది. దీంతో నియామకాలు చేపట్టక తప్పదని అధికారులు గుర్తించారు. గత ఐదేళ్లలో వీటీపీఎస్, కృష్ణపట్నంలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల చొప్పున రెండు కొత్త ప్రాజెక్టులు ఉత్పత్తిలోకి వచ్చాయి. వాటి అవసరాల మేరకు నియామకాలు చేపట్టకుండా, ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేశారు. సిబ్బంది కొరతవల్ల, థర్మల్ ప్లాంట్లలోసాంకేతిక ఇబ్బందులు తలెత్తి వెంటనే సరిదిద్దడానికి ఇబ్బందిగా మారింది. ఫలితంగా సంస్థలో అంతర్గత శిక్షణ, బయటి ప్రాంతాలకు శిక్షణ కోసం పంపే ప్రక్రియ నిలిచింది. ఈ పరిస్థితిలో మార్పుతెచ్చి విద్యుత్ సంస్థలకు పునరుజ్జీవం పోసేందుకే నియామకాలకు కూటమి ప్రభుత్వం చేపట్టింది.


విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న శ్రీశైలం డ్యామ్

# సంక్షేమానికి రాబడులే కీలకం

>> ఆదేశించారు. స్క్రాప్ వాహనాల పాలసీని కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేయాలని సీఎం సూచించారు. డ్రోన్, శాటిలైట్ టెక్నాలజీతో గనుల తవ్వకాలను గుర్తించి డేటా అనలటిక్స్ ద్వారా ఆదాయాన్ని పర్యవేక్షించాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే వివరాలతో పాటు టెక్నాలజీ ఆధారంగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పోరేషన్లలో ఆటో మ్యూటేషన్ జరగాలని ముఖ్య మంత్రి స్పష్టం చేశారు. మున్సిపల్ రికార్డుల్లో తప్పులు సవరించి జియో ట్యాగింగ్ చేయాలని సీఎం సూచించారు. ఆధార్, మొబైల్, ఎలక్ట్రిసిటీ డేటాను కూడా అనుసంధానించి పన్ను వసూళ్ల ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. స్వామిత్వ సర్వే ద్వారా గ్రామకంఠాల గుర్తింపు ప్రక్రియ 2026 ఫిబ్రవరికి పూర్తి అవుతుందని అధికారులు తెలిపారు. పంచాయితీల్లో నిర్వహించే ఖాతాలను ఆడిట్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అటవీశాఖ వద్ద ఉన్న ఎర్రచందనం నిల్వలతో రూ.1,500 కోట్ల మేర ఆదాయం వచ్చే అవకాశముందన్నారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలపై దృష్టి పెట్టాలన్నారు. వెదురు ఉత్పత్తుల ద్వారా ఆదాయం ఆర్జించే మార్గాలను కూడా చూడాలన్నారు.సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఆయా శాఖల్లో ఆదాయార్జన మార్గాలను అన్వేషించే దిశలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

# ధర్మవరంలో ఉగ్రకలకలం

>> వ్యవహారశైలిపై నిఘావేసి పక్కా సమాచారంతో గత నాలుగు రోజులక్రితం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తమ విచారణలో వాట్సాప్ చాట్ నూర్ మహమ్మద్ యాక్టివ్‌గా ఉన్నట్టు గుర్తించామన్నారు. అంతేకాకుండా ధర్మవరంలో నూర్ మొహమ్మద్ ఆయన కుటుంబ సభ్యులు ఎంతకాలంగా నివాసముంటున్నారు, గతంలో ఎక్కడ ఉండేవారు ఆయన సన్నిహితులు తదితర విషయాలపైనే కాకుండా గతంలో ఏం చేస్తుండే వాడో పోలీసుల విచారణలో తేలాల్సిఉంది. ఏదిఏమైన అన్నికోణాల్లో సంపూర్ణ విచారణ కొనసాగించిన తరువాత వివరాలు అందజేస్తామన్నారు.
**స్థానిక యువతలో ఉగ్రవాద సానుభూతిపరులు:** ధర్మవరం కు చెందిన నూర్ మహమ్మద్ తోపాటు మరి కొంతమంది యువకులు ఈ ఉగ్రవాద కరికాల పాలకు ఆకర్షితులైనట్టుగా తెలుస్తోంది. తాజాగా ఇదే ధర్మవరంలోని ఎర్రగుంటప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ రియాజ్ శుక్రవారం రాత్రి నో ఇండియా...ఐలవ్ పాకిస్తాన్ అంటూ వాట్సాప్ స్టేటస్ లో పోస్ట్ చేయడం. ఈ వాట్స్‌అప్ స్టేటస్ వీడియో ధర్మవరం సోషియల్ మీడియాలో హల్చల్ కావడంతో సమాచారం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నూర్ మహమ్మద్‌తో పాటు పట్టణానికి చెందిన మరి కొంతమంది ముస్లింయువకులు ఈ ఉగ్రవాద సంస్థలకు సానుభూతి పరులుగా మారినట్టు స్పష్టం అవుతోందని ఆటో డ్రైవర్ రియాజ్ తో పాటు మరికొంతమంది యువకులను అనుమానితులుగా విచారించాల్సి ఉంటుందని అంతేకాకుండా ఎన్ ఐ ఏ అధికారులు విచారణ మరింత లోతుగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. **ధర్మవరంలో అధికంగా ఇతర దేశాల వలస ముస్లిం కార్మికులు:** ధర్మవరం ప్రాంతంలో చేనేత రంగాన్ని నమ్ముకుని అనేకమంది ఇతర ప్రాంతాల నుండి వచ్చి చేనేత వృత్తిలో స్థిరపడిపోయారు. చేనేత కార్మికులతో పాటు పట్టు చీరల డిజైనర్ వృత్తిని ఆధారంగా చేసుకుని బంగ్లాదేశ్ కలకత్తా ముంబై వంటి ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ముస్లిం కుటుంభాలు ధర్మవరంలో నివాసాలు ఏర్పరచుకున్నారు. అధిక సంఖ్యలో ముస్లిం యువకులు ధర్మవరంలో నివాసం ఉండడంతో పాటు వారి కార్యకలాపాలు ఎలా ఉంటాయో ఎవరికీ తెలియదు. ప్రస్తుతం ఉగ్రవాద సంస్థల మూలాలు బయటపడడంతో ధర్మవరం ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ ప్రాంతానికి చెందిన రోహింగ్యాలు ధర్మవరం ప్రాంతంలో అధిక శాతం ఉన్నట్టు ధర్మవరం ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో నివాసం ఉండాలంటే ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నాలుగు రోజులు భారీ వర్షాలు

>> ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయి. ఇప్పటికే కురిసిన వానలకు రాష్ట్రంలో పలు గ్రామాల్లో పంటల పొలాలను వరద ముంచెత్తింది. పంట నష్టంతో రైతుల ఆవేదన చెందుతున్నారు ఈ సంవత్సరం నైరుత్తి సాధారణం కంటే ముందుగానే వచ్చాయి. కానీ జూన్, జులై నెలల్లో చాలా జిల్లాల్లో లోటు వర్షపాతం తక్కువగా నమోదైంది. వైఎస్సార్ కడప, పల్నాడు, గుంటూరు, అన్నమయ్య, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు బాపట్ల, నెల్లూరు, శ్రీసత్యసాయి, తిరుపతి, జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి.బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో గుంటూరు, ప్రకాశం, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, కృష్ణా జిల్లాలు లోటు వర్షపాతం నుంచి అధిక వర్షపాతం నమోదైన జాబితాలోకి చేరాయి. జూన్ నెల తర్వాత ఇప్పటివరకు గుంటూరులో అత్యధికంగా సగటున 40.6 శాతం అధిక వర్షపాతం నమోదైంది.

## కాల్పుల విరమణ అవకాశాలు తక్కువే

>> మాత్రం ఫలప్రదంగా ముగిసాయని ప్రకటించారు. 2022లో అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఉంటే ఉక్రెయిన్‌పై యుద్ధం జరిగేదే కాదని ఈసందర్భంగా పుతిన్ ప్రకటించడంచూస్తుంటే ఒకరినొకరు ప్రస్తుతించుకున్నట్లే కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన ఈ భేటీ ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ప్రపంచవ్యాప్తంగా అంచనాలు వెలువడ్డాయి. కానీ ఈ భేటీ ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగియడంతో ఉక్రెయిన్ ప్రజలు, ఆ దేశ పాలకులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. అయినప్పటికీ భవిష్యత్తులో చర్చలు కొనసాగే అవకాశం ఉందని ఇరు పక్షాలు సంకేతాలు ఇచ్చాయి. తదుపరి రౌండ్ చర్చలు మాస్కోలో జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉక్రెయిన్ సంక్షోభంపైనే చర్చ జరిగింది. ఈ యుద్ధాన్ని త్వరితగతిన ముగించడం గురించి ఇద్దరు నాయకులు మాట్లాడుకున్నారని అధికారులు వెల్లడించారు. తమ మధ్య జరిగిన సంభాషణ చాలా ఉత్పాదకంగా సాగిందని ట్రంప్, పుతిన్ ఇద్దరూ అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు దారితీసే ఏ ఒక్క నిర్దిష్ట ఒప్పందంపై కూడా వారు ఒక అంగీకారానికి రాలేకపోయారు. ఈ భేటీ ఒక పరిష్కారానికి మార్గం వేస్తుందని ఆశించిన వారికి ఇది కొంత నిరాశ కలిగించింది. అయినప్పటికీ భవిష్యత్ చర్చలకు ఈ సమావేశం ఒక వేదికను ఏర్పాటు చేసిందని చెప్పవచ్చు. ప్రస్తుత సమావేశం ముగిసిన తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తదుపరి రౌండ్ చర్చలను మాస్కోలో నిర్వహించాలని ట్రంప్‌కు ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనపై ట్రంప్ సానుకూలంగా స్పందించారు. ఈ పరిణామం ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడానికి రష్యా సిద్ధంగా ఉందనే సంకేతాలను పంపింది. అయితే మాస్కోలో జరిగే తదుపరి చర్చలు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కి, ఐరోపా దేశాల సహకారంపై ఆధారపడి ఉంటుందని పుతిన్ వ్యాఖ్యానించారు. ట్రంప్ కూడా ఉక్రెయిన్‌పైనే బాధ్యతను మోపుతూ జెలెన్స్కి ఒక పరిష్కారాన్ని కనుగొనాలని సూచించారు. ముఖ్యంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఒప్పందం చేసుకోవాలని జెలెన్స్కీకి సూచిస్తానన్నారు. అయితే వాళ్లు అందుకు నిరాకరించే అవకాశం ఉందని.. కానీ కచ్చితంగా పుతిన్‌జెలెన్స్కీల సమావేశం జరుగుతుందని తాను ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో తాను కూడా చేరే అవకాశం ఉందన్నారు. అయితే పుతిన్‌తో ఏయే అంశాల గురించి మాట్లాడారు, ఇంకా దేని గురించి మాట్లాడాల్సి ఉందని అడగ్గా ట్రంప్ సమాధానం చెప్పేందుకు నిరాకరించారు. కానీ అంతకుముందే పుతిన్ మీడియాతో మాట్లాడుతూ జెలెన్స్కీతో భేటీ అయ్యేందుకు తాను వ్యతిరేకం కాదని, కొన్ని షరతులకు తప్పనిసరిగా అంగీకరించాలన్నారు. సంతకాలు చేయడానికి శాంతి ఒప్పందం సిద్ధంగా ఉన్నప్పుడే భేటీ ఉంటుందని చెప్పుకొచ్చారు. రష్యా ఆక్రమించిన భూభాగాలనుంచి వైదొలగాలని, భవిష్యత్తులో యుద్ధం జరిగితే రక్షణ కల్పించాలని, నాటో సభ్యత్వానికి అడ్డంకులు సృష్టించకూడదన్న జెలెన్స్కీ డిమాండ్లను ఈ భేటీలోప్రస్తావనకు రాలేదనే తెలుస్తోంది. అందువల్లనే జెలెన్స్కీ మాట్లాడుతూ ఈ చర్చలవల్ల పుతిన్ లాభపడినట్లుగా ఉందని, యుద్ధం ముగింపు పుతిన్‌కు సుతరాము ఇష్టంలేనట్లుగా ఉందని ఆరోపించారు.
**పుతిన్‌కు ఆయుధ సత్తా ప్రదర్శన:** చర్చల సందర్భంగా అలాస్కా ఎయిర్‌బేస్‌లో బీ2 బాంబర్లు పుతిన్ ట్రంప్‌లు ఇరువురు నడిచి వస్తున్న సందర్భంలోనే చక్కర్లు కొట్టాయి. వీటితోపాటే కొన్ని బీ2 బాంబర్లను ఎయిర్‌బేస్‌లో మోహరించడాన్ని చూస్తుంటే ట్రంప్ తమవద్ద ఉన్న ఆయుధ సామర్థ్యాన్ని పుతిన్‌కు ప్రదర్శించారని తెలుస్తోంది. ఎలాగైనా పుతిన్‌ను యుద్ధ విరమణకు ఒప్పిస్తామని చెప్పిన ట్రంప్ సమావేశం ఫలితం లేకుండానే ముగియడంతో కొంతమే నిస్పృహ అసహనం ఉన్నట్లు కూడా ట్రంప్ వైఖరిలో కనిపించింది. పుతిన్ చెప్పిన డిమాండ్లు ఇటు ట్రంప్‌కు సైతం ఆమోదయోగ్యంగా లేనట్లుగా తెలుస్తోంది. తొలివిడత టర్కీలోను, మలివిడత రియాద్‌లోను జరిగిన చర్చల తర్వాతనే ఉక్రెయిన్ యుద్ధంపై శాంతి ఒప్పందానికి ట్రంప్ అహరహం కృషిచేసారు. అయితే ఏడేళ్ల తర్వాత పాశ్చాత్య దేశం భూభాగంలో తొలిసారి అడుగుపెట్టిన పుతిన్‌కు రెడ్‌కార్పెట్ స్వాగతం లభించినా చర్చల సారాంశం మాత్రం లీక్ కాలేదు. సరికదా అర్థాంతరంగానే ముగిసినట్లయింది.

## సర్పంచ్ ఎన్నిక తారుమారు: సుప్రీం కోర్టులో ఓట్ల లెక్కింపుతో న్యాయం

**పానిపట్, ఆగస్టు 16:** ఏళ్లతరబడి న్యాయంకోసం పోరాడినా ఫలితం దక్కని ఒక సర్పంచ్ అభ్యర్థికి సుప్రీం జోక్యంతో న్యాయం జరిగింది. హర్యానాలోని పానిపట్‌జిల్లాలో సుదీర్ఘ వివాదంలో నడుస్తున్న సర్పంచ్‌పదవిలో నిజాయితీగా తానేనెగ్గినట్లు విజేత నిరూపించుకున్నాడు. దేశ చరిత్రలో మొట్టమొదటి సరిగా సుప్రీం కోర్టు లోపల జడ్జి ముందు కోర్టు హాలులో ఒక సర్పంచ్ ఎన్నిక ఓట్ల లెక్కింపు జరిగింది. అతని పోరాటం ఫలించింది. 51 ఓట్ల మెజారిటీ వచ్చిందని తెలింది. గతంలో జరిగిన లెక్కింపులో లోపం జరిగిందని వెల్లడి అయ్యింది. కోర్టును ఆశ్రయించిన అభ్యర్థి విజేతగా ప్రకటించారు. ఈ ఆశ్చర్యకర ఘటన హర్యానాలోని పానిపట్ జిల్లాలో జరిగింది.జిల్లాలోని బువానా లఖు గ్రామంలో సర్పంచ్ పదవిపై ఎప్పటి నుంచో వివాదం ఉంది. మూడేళ్ల క్రితం 2022 నవంబర్ 2వ తేదీన సర్పంచ్ ఎన్నికలు జరగాయి. ఆ సమయంలో అభ్యర్థి మోహిత్ మాలిక్ విజయం సాధిస్తారని అంతా అనుకున్నారు. కానీ కౌంటింగ్ జరగ్గా, మరో అభ్యర్థి కుల్దీప్ గెలిచారు. అయితే ఓట్ల లెక్కింపులో ఏదో పొరపాటు జరిగిందని అప్పుడే మోహిత్ అనుమానించారు. వెంటనే అధికారులతో వాదించినా, లాభం లేకుండా పోయింది. బూత్ నంబర్ 69లో ఫలితాన్ని పొరపాటుగా మార్చారని మోహిత్ అన్నారు.



'శ్రీవాణి' టిక్కెట్ల కోసం బారులు తీరిన భక్తులు

# 'శ్రీవాణి' కోసం గందరగోళం

>> భక్తుల ప్రభావం 10,500 రూపాయలు శ్రీవాణి బ్రేక్ దర్శనాలపై చూపింది. ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్ల కోసం బారులుతీరిన విధంగానే శ్రీవాణి దర్శన టిక్కెట్లకు శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంటనుండే కౌంటర్‌ప్రాంతంలో భారీగా భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. ఆఫ్‌లైన్‌లో 800 టిక్కెట్లకోసం రెండువేలమంది వరకు భక్తులు నిలబడటంతో అంతా గందరగోళంగా మారింది. దీంతో ఉన్నఫళంగా వేకువజామున రెండుగంటల ప్రాంతంలోనే శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు జారీని టిటిడి మొదలుపెట్టింది. అయితే నిర్ణీత సమయం ఉదయం 10గంటలకు జారీచేసే టిక్కెట్లను అర్ధరాత్రి వేళ జారీచేయడంతో కొంతవరకు భక్తుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గంటసమయంలోనే 800 టిక్కెట్లు శనివారం దర్శనానికి పూర్తిగా జారీ అయ్యాయి. ఇక చేసేదిలేక కౌంటర్ల ప్రాంతంలో క్యూలైన్లలో నిలబడి నిరీక్షిస్తున్న భక్తులు దర్శన టిక్కెట్లు అందకపోవడంతో అన్నమయ్యభవనం ఎదుట నిరసనకు దిగారు. రోడ్డుపైకి రావడంతో ఆందోళన చేయడంతో టిటిడి విజిలెన్స్ సిబ్బంది, తిరుమల పోలీసులు భక్తులకు సర్దిచెప్పే ప్రయత్నాలు చేశారు. అయినా అధికశాతమంది భక్తులు తమకు దర్శన టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్‌తో నినాదాలు చేశారు. ఆ సమయంలో తిరుమలలో భక్తులు ఆందోళన చేస్తే కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించడంతో భక్తులు వెనక్కి తగ్గారు. ఇదే సమయంలో శ్రీవాణి దర్శన టిక్కెట్లకు డిమాండ్ ఏర్పడుతుండటంతో ఆఫ్‌లైన్‌లో దర్శన టిక్కెట్ల కోటాను మరో 500వరకు పెంచాలంటూ టిటిడి ఛైర్మన్‌కు పలువురు భక్తులు తమ వినతిపత్రాన్ని అందించారు. కాగా తిరుమలలోని శ్రీవాణి దర్శన టిక్కెట్లు జారీచేసే కౌంటర్‌ల వద్దభక్తులు శుక్రవారం రాత్రి రద్దీ ఎక్కువగా ఉండటంతో టిక్కెట్లు దొరకని భక్తులు తమ అసహనం, ఆందోళన వ్యక్తం చేయడంతో గందరగోళంగా మారింది. అయినా శ్రీవాణి దర్శనానికి రెండురోజులు సమయం తిరుమలలో ఓపిక లేని భక్తులు నిరసనలకు దిగుతున్నారు. వారాంతం,వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో శ్రీవాణి టిక్కెట్లకు భారీగా డిమాండ్ పెరిగింది. ఏదో ఒక దర్శనంలో శనివారం శ్రీకృష్ణాష్టమి కావడంతో త్వరగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకువెళదామని భక్తులు తాపత్రయం పడుతున్నారు. సాధారణరోజుల్లోనే 10,500 రూపాయల దర్శనాలకు విపరీతమైన భక్తుల రద్దీ ఉంటుంది. ఇక ప్రత్యేక రోజుల్లో,వరుససెలవులతో మరింతగా డిమాండ్ పెరిగింది. రోజువారీగా సరాసరి 1,500వరకు శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు జారీచేయాలనేది సామాన్యభక్తుల నుండి వినిపిస్తున్న వాదనలు.
రోజుకు సుమారుగా లక్షమంది వరకు భక్తులు ...30వేలమంది వరకు ఎటువంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకుండా సాధారణ సర్వదర్శనంలో సామాన్యభక్తులు తిరుమలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో కొండపై ఆఫ్‌లైన్‌లో జారీచేసే శ్రీవాణి 800దర్శనం టిక్కెట్లు కోసం భక్తుల నుండి పెద్దగా డిమాండ్ ఉంది. వేంకటేశ్వరస్వామిని ఆనందనిలయంలో మొదటిగడప కులశేఖరపడివద్ద నిలబడి వీక్షించే అవకాశం ఉండటంతో ఈ దర్శనాలకోసం విపరీతమైన డిమాండ్ కనిపిస్తోంది.
ఎటువంటి సిఫార్సులు లేకుండా..ఎవరీ ప్రమేయం అవసరం లేకుండా నేరుగా శ్రీవాణి కౌంటర్‌ల క్యూలైన్‌కు చేరుకుంటే ముందు వచ్చినవారికి ముందుగా టిక్కెట్లు జారీ చేస్తారు. ఇందుకు వరుస నంబర్లతో టోకెన్ జారీచేసే విధానం ఉంది. సాధారణరోజుల్లోనే తిరుమలలో 800 శ్రీవాణి బ్రేక్ దర్శనాల టిక్కెట్ల కోసం వెయ్యిమంది నుండి 1200మంది భక్తులు వరకు బారులుతీరి ఉంటున్నారు. అంత డిమాండ్ ఉండటంతో ప్రస్తుతం శ్రీవాణి టిక్కెట్లు మరో 500 వరకు ఆఫ్‌లైన్‌లో జారీ చేయాలనే విజ్ఞప్తులు భక్తుల నుండి వ్యక్తమవుతోంది. ఈ టిక్కెట్లు పొందిన భక్తులకు ఏరోజుకారోజు సాయంత్రం 4.30గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌ద్వారా శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. డిమాండ్‌తో తిరుమలలో శ్రీవాణి టిక్కెట్లు పెంచాలనేది అధికశాతంమంది భక్తుల నుండి వ్యక్తమవుతున్న అభిప్రాయం. మరీ టిటిడి అధికారులు ఆ దిశగా కసరత్తుచేస్తారనేది భక్తులు కూడా కోరుతున్నారు.

## సిద్ధమవుతున్న సచివాలయ సౌధాలు

### 900 మీటర్ల గాజు వంతెన ఐకానిక్ టవర్లతో అనుసంధానం

**విజయవాడ.ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:**రాజధాని అమరావతిలో నిర్మితమవుతున్న సచివాలయ సౌదాలకు సంబంధించిన సవివరణాత్మక డిజైన్లను త్వరలో అందుబాటులోకి రానున్నాయి. లండన్‌కు చెందిన ఫోస్టర్స్ సంస్థ రూపొందిస్తున్న నమూనాలు తుది దశకు చేరుకున్నాయి. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ సముదాయంలో వేర్వేరుగా నిర్మిస్తున్న ఐదు టవర్లను వంతెనతో ఒకదానితో ఒకటి అనుసంధానించనున్నారు. ఉక్కుతో నిర్మించే డయాగ్రిడ్ ఆకృతులను అమరావతి లోనే బిగించనున్నారు. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ మొత్తాన్ని ఒకే గోడుగు కిందకు తెచ్చేలా అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. టవర్లను మొత్తం 68 లక్షల 88వేల 64 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. జీఏడీ టవర్‌ని బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌కాకుండా 47 అంతస్తులుగా నిర్మించనున్నారు. ఇందులోనే సీఎం కార్యాలయం రానుంది. దీని టెర్రస్‌పై హెలిప్యాడ్‌ను నిర్మిస్తారు. మిగిలిన నాలుగు హెచ్‌వోడీ టవర్లు 39 అంతస్తులతో నిర్మించనున్నారు.ఒక టవర్ నుంచి మరో టవర్‌లోకి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సందర్శకులు సులువుగా వెళ్లేందుకు వీలుగా వంతెనను నిర్మిస్తారు. దీనిని ఆకర్షణీయంగా గ్లాస్‌తో 900 మీటర్ల పొడవుతో రూపొందించనున్నారు. ఇది మూడో అంతస్తులో రానుంది. ఇందులో శీతలీకరణ యంత్రాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. టవర్లకు అనుబంధంగా ఎనిమిది ఎమినిటీస్ బ్లాక్‌లు ఒక్కొక్కటి గ్రౌండ్‌ఫ్లోర్ కాకుండా మూడు అంతస్తులతో నిర్మిస్తారు. వీటిల్లో సమావేశ మందిరాలు, డిస్పెన్సరీలు, క్రెచ్‌లు, క్యాంటీన్‌లు, గ్రంథాలయాలు, తదితర వసతులు ఉంటాయి. ఎత్తైన ఈ భవనాల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎదుర్కొనేందుకు వీలుగా భారీ అగ్నిమాపక శకటాలతో ప్రత్యేక ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం వివిధ దేశాల్లోని నమూనాలను ఇప్పటికే పరిశీలించారు. ప్రతి టవర్ వద్ద 50 మీటర్లు పొడవు, వెడల్పుతో పెద్ద పోర్టికోలు కూడా నిర్మిస్తారు. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు నీటిలోనే ఉన్న టవర్ల వద్ద నేల సామర్థ్యాన్ని గుత్తేదారు సంస్థలు పరీక్షించాయి. 1000 టన్నుల బరువును వేసి పరీక్షించగా సానుకూల ఫలితాలు వచ్చాయి. ఐకానిక్ టవర్ల ఆకృతులు డయాగ్రిడ్ విధానంలో రూపొందించారు. ప్రతి టవర్‌కు సగటున 15 నుంచి 20వేల టన్నుల మేర ఉక్కును వినియోగించనున్నారు. ఇప్పటికే సీఆర్డీఏ అధికారులు పలు రాష్ట్రాల్లోని ఉక్కు కర్మాగారాలను సందర్శించారు. టవర్ల పనులను దక్కించుకున్న మూడు గుత్తేదారు సంస్థలు అమరావతిలోనే వర్క్‌షాపులను ఏర్పాటు చేసేందుకు సీఆర్డీఏ అధికారులను అనుమతి కోరారు. దీనికి 10 ఎకరాల స్థలం కేటాయించమని అడిగాయి. భారీ పరిమాణంలో డయాగ్రిడ్ ఆకృతులను ఇతర ప్రాంతాల్లో ఫ్యాబ్రికేట్ చేసి ఇక్కడకు తీసుకురావాలంటే సమయం వృథా కానుంది. ఇటువంటి సమస్యలేమీ లేకుండా సైట్‌లోనే యూనిట్‌ను ఏర్పాటు చేస్తే రవాణా పరమైన ఇబ్బందులు ఉండవంటున్నారు.

### వారం - వర్జ్యం

17-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
నవమి రా.7.26
రోహిణి రా.3.18
వర్జ్యం : ఉ.8.37-10.08
దు.సా.4.47-5.38
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం :** వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. వస్తువులు కొనుగోలుచేస్తారు.

**వృషభం :** కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**మిథునం:** సన్నిహితులు మిత్రులనుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వాహన సౌఖ్యం.

**సింహం:** వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**కన్య :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. స్థలాలు కొనుగోలుచేస్తారు.

**తుల :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఇంటాబయటా అనుకూల స్థితి.

**వృశ్చికం:**జీవితభాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** ఆర్థిక పరిస్థితి సానుకూలంగా ఉండదు. ఖర్చులు అదుపు చేసుకోవడానికి ఎంతగానో కృషిచేస్తారు.

**మకరం:** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. చాకచక్యంగా వ్యవహరించి ముందుకుసాగుతారు.

**కుంభం:** వృత్తి వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**మీనం :** కొన్ని పనులు అప్రయత్నంగా పూర్తికాగలవు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

17-08Pg3exHMNWJQE 3rd_17-08Pg3exHMNWJQE.qxd 8/16/2025 11:31 PM Page 1



# వైఎస్ భారతి కూడా జీరో చార్జితో పులివెందుల నుంచి అమరావతికి బస్సులో రావొచ్చు

## ఎపిడబ్ల్యుజెఎఫ్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత

విజయవాడ,ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి: వైఎస్ భారతి కూడా జీరో ఛార్జీతో పులివెందుల నుంచి అమరావతికి బస్సులో రావొచ్చని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఛైర్ పర్సన్, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ప్రతి మహిళ సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. దివంగత ఎన్టీఆర్ మహిళల హక్కుల కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ద్వాక్రా అనే విత్తనం వేసారన్నారు,ఇప్పుడు ఆ పథకం ద్వారా కోటి మంది మహిళలు వాళ్ల కుటుంబాలకు ఆసరగా నిలిచేలా చేశారని ఆమె కొనియాడారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే ఏదైనా చేస్తారని, అద్భుతాలు సృష్టిస్తారని పీతల సుజాత ధీమా వ్యక్తం చేశారు. మహిళల కోసం స్త్రీ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు రాష్ట్ర మహిళల తరఫున ధన్య వాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి మహిళలకు ఇచ్చిన కానుక స్త్రీ శక్తి పథకమని పేర్కొన్నారు. రాఖీ పండుగలా ఈ స్త్రీ శక్తి పథకాన్ని కూడా మహిళలంతా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఇలాంటి మంచి పథకాన్ని ప్రవేశపెడితే వైసీపీ పేటీఎం బ్యాచ్ వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకంపై విమర్శలు చేయడం వైసీపీ నాయకుల దిగ జారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు. ఆడబిడ్డలను వృద్ధిలోకి తీసుకు రావాలన్న సిద్ధాంతమే తెలుగుదేశం పార్టీ విధానమన్నా రు.అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే చంద్ర బాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నా మన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అందజేశామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి.. ఒక్కరికే పరిమితం చేశారని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి, పోలవరం నిర్మాణం, రహదారుల విస్తరణ వంటి అనేక కార్యక్రమా లను రూ.వేల కోట్లతో చేపడు తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే నాలుగేళ్లలో మరిన్ని పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తామని సుజాత స్పష్టం చేశారు.



# అమరావతిలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

## న్యాయవాది కునుకు రవిశంకర్

**విజయవాడ, ఆగస్టు 16, ప్రభాతవార్త :** నూతన రాజధాని అమరావతిలో రీజనల్ సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మెంబర్, సుప్రీంకోర్టు న్యాయవాది కునుకు రవిశంకర్ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దక్షిణ భారత ప్రజలకు సుప్రీంకోర్టుకు వెళ్లాలంటే అధిక వ్యయ ప్రయాసలున్నాయని, దానికోసం దక్షిణాధి ప్రజలకు సుప్రీంకోర్టు సేవలందు బాటులో వుండేలా అమరావతిలో శాశ్వత సుప్రీంకోర్టు బెంచ్ వుండాలన్నారు. కార్యక్రమం లో అడ్వకేట్ ఎం రాజశేఖర్, విబి శంకర్‌రావు, టిఎస్ విజయ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే జోన్ ఆశావహులను నిరాశపరిచిన కేంద్రం

## - సిబ్బంది లేకుండా అధికారులను నియామకం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 16,ప్రభాతవార్త** విశాఖ కేంద్రంగా భారతీయ రైల్వేలో కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై ఆశలు పెట్టుకున్న ఆశావాహుల ఆశలను కేంద్రం మరోమారు నిరాశ పరిచింది. ఈ ఏడాది జనవరిలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేసి వెళ్లారు. అనంతరం కేంద్రం దాదాపు ఆరు నెలలకు జూన్‌లో సందీప్ మాధూర్‌ను దక్షిణ కోస్తా రైల్వే జోన్ తొలి జనరల్ సెక్రటరీగా నియమించింది. అడపాదడపా ఆయా విభాగాలకు సంబంధించి జోనల్ ప్రిన్సిపల్ అధికారులను నియమిస్తోంది తప్పిస్తే, వాస్తవానికి జోన్ ఎప్పటి నుంచి విధులు నిర్వర్తించేది ఇంతవరకు తెలుపలేదు. రైల్వే జోన్ అధికారికంగా పనిచేయాలంటే కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయాలి. అయితే కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీచేయడంలో అలసత్వంతో ఎందుకు వ్యవహరిస్తోందనేది ఎవరికి అంతుబట్టడం లేదు. ఈ విషయమై స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తోందనే ఆశతో ఎదురు చూసిన రాష్ట్ర ప్రజలకు కేంద్రం మరోమారు నిరాశ పరిచింది. ఈ విషయమై కేంద్రప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో ప్రజలకు చివరికి నిరాశే మిగిలింది. కంటితుడుపు చర్యగా అడపాదడపా అధికారులను నియమిస్తే ఫలితం లేదు. ఆయా విభాగాలకు సంబంధించిన అధికారిక కార్యకలాపాలను, విధులను నిర్వర్తించాలంటే సిబ్బంది పాత్ర అత్యంత కీలకం. సిబ్బంది లేకుండా అధికారులను నియమిస్తే ప్రయోజనం శూన్యం. విశాఖ కేంద్రంగా కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆచరణలో ఎప్పటి నుంచి కార్యరూపం దాలుస్తుందో పేర్కొంటూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తేనే స్పష్టత వస్తుంది, అంతవరకు సందిగ్ధమే.

# వెంకన్న దర్శనానికి 40గంటలు

## - అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి వెనుదిరుగుతున్న సామాన్యభక్తులు



**తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో కలియుగవైకుంఠం తిరుమల భక్తజనసంద్రంగా మారింది. శనివారం వేకువజామునకే తిరుమలలో వైకుంఠమ్ 1,2, క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లన్నీ భక్తులతో నిండిపోయి గోగర్భమ్‌డ్యామ్ వరకు ఐదుకిలోమీటర్లు ఆలయం వెలుపలకు చేరాయి. దీంతో సాధారణ సర్వదర్శనానికి 40గంటలు సమయంపైగానే భక్తులు దర్శనానికి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.భారీగా పెరిగిన భక్తులతో కొండంతా గందరగోళంగా మారింది.చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు క్యూలైన్లలో నిలబడే ఓపికలేక ఆలయం ముందు అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని వెనుదిరుగుతున్నారు. లడ్డూవితరణశాలలో భక్తులు బారులుతీరి నిలబడినా ఒక్కో భక్తునికి 2లడ్డూలు విక్రయిస్తున్నారు. వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు 18గంటలు దర్శనానికి పడుతుండగా వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులు కంపార్టుమెంట్లకు చేరుకునేందుకు మరో 18గంటలుసమయంపైగానే పట్టే సూచనలు ఉన్నాయి. భక్తులు క్యూలైన్లలో గోవిందా...గోవింద నామస్మరణ చేస్తున్నారు. ముందుగానే రద్దీని ఊహించిన టిటిడి అధికారులు భక్తులకు నిరంతరాయంగా శ్రీవారి సేవకులతో పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, కాఫీ పంపిణీ చేస్తున్నారు. భక్తులు కూడా సంయమనం పాటించాలని, తమ దర్శన సమయం వచ్చేవరకు ఓపికతో క్యూలైన్లలో సకల సౌకర్యాలు అందుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్ ,ఆల్లం సురేంద్ర పర్యవేక్షిస్తున్నారు. పూర్తిగా విజిలెన్స్ సిబ్బంది, తిరుమల పోలీసులు సేవాభావంతో భక్తులకు సేవలందిస్తున్నారు. శనివారం సాయంత్రానికి 47 వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. వెంగమాంబ అన్నదానభవనంలో 90 వేలమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తిరుమల నుండి తిరుగుప్రయాణమయ్యే భక్తులు బస్సులకోసం బస్టాండ్లలో తోపులాట తప్పడంలేదు. బస్సులకోసం పరుగులుతీస్తున్నారు. ట్యాక్సీలు 150 రూపాయలు భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు.

# శ్రీకృష్ణుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

## మంత్రి నారా లోకేష్

**విజయవాడ,ఆగస్టు 16,ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీకృష్ణుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని మంత్రి నారా లోకేష్ పిలుపు నిచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ దుష్ట శిక్షణ,శిష్ట రక్షణకు శ్రీకృష్ణుడు అవతరించిన పర్వదినమని, గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని ఆనందంగా తీర్చిదిద్దుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మరోవైపు మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా లోకేష్ ఘన నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు కట్టుబడిన వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడారు. కష్టాలను ఓర్పులో అద్భుతమైన దార్శనికత ప్రదరి ్శంచాలన్నారు. ఆర్థిక,మౌలిక సంస్కరణల తో దేశ రూపురుఖలు మార్చారు. తనదైన ప్రసంగాలతో అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసే వారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు స్మరించుకుందాం' అంటూ పోస్టు

# గోమాతలను పరిరక్షించుకోవాలి

## గోపూజ నిర్వహించిన టిటిడి ఇఒ జె.శ్యామలరావు



**తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ సనాతన ధర్మంలో గోమాతలను పరిరక్షించుకోవడంతోబాటు గోపూజ ద్వారా విశిష్టతను తెలియజేస్తున్నామని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అన్నారు. తిరుపతిలోని ఎస్వీగోశాలలో పిండమార్పిడి విధానం ద్వారా మేలురకమైన దేశవాళీ గోజాతిని అభివృద్ధి చేయడానికి టిటిడి,ఎస్వీ పశువైద్యవిశ్వవిద్యాలయంతో పరస్పరం ఒప్పందం చేసుకున్నామన్నారు. పిండమార్పిడి విధానంలో ఇప్పటివరకు 47 మేలురకాల "సాహివాల్"జాతి దూడలు జన్మించినట్లు తెలిపారు. గోకులాష్టమి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం ఎస్వీగోశాలలో గోవులకు పూజలు చేసి వాటికి దాణా,పచ్చిగడ్డి తినిపించారు. ఈ సందర్భంగా ఇఒ శ్యామలరావు మాట్లాడుతూ భక్తుల భాగస్వామ్యంతో గోవులను రక్షించుకుందామని, సంస్కృతిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. వేదాలు,పురాణాల్లో సకలదేవతా స్వరూపాలైన గోవులను భక్తుల భాగస్వామ్యంతో రక్షించుకోవడం ద్వారా భారతీయ హైందవ సంస్కృతిని కాపాడుకుందామని అన్నారు. ఎస్వీగోశాలలో 2,789 గోవులు ఉన్నాయని, 1,827 ఆవులు, 962 ఎద్దులు, 7 ఏనుగులు, ఐదు గుర్రాలు ఉన్నాయన్నారు. ప్రతిరోజూ తిరుమల,తిరుపతి,తిరుచానూరు గోశాలలతోబాటు అలిపిరి వద్ద గోప్రదక్షిణశాలలో గోపూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు ఇతర అనుబంధ ఆలయాల్లో పూజాకైంకర్యాలకోసం, తిరుమలలో భక్తులకు పంపిణీ కోసం పాలు పంపిణీచేస్తున్నామన్నారు.

దేశవాళీ గోసంరక్షణలో భాగంగా ఇప్పటి వరకు 539 దేశవాళీ గోవులను దాతల సహకారంతో తీసుకుని రావడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 195 ఆలయాలకు ఉచితంగా ఆవు,దూడలను గుడికోగోమాత పథకం ద్వారా అందించామన్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కళాకారులు సంకీర్తనల ఆలాపన, డిపిపి కళాకారులు భజనలు, కోలాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుడ ఛైర్మన్, టిటిడి బోర్డు సభ్యుడు సి.దివాకర్‌రెడ్డి, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, గోశాల ఇన్‌ఛార్జి సంచాలకుడు శ్రీనివాసులు,భక్తులు పాల్గొన్నారు.

# సూపర్ స్టార్ రజనీకాంత్‌కు సిఎం చంద్రబాబు అభినందన

**విజయవాడ.ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** చిత్ర పరిశ్రమలో 50 అద్భుతమైన సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు సూపర్ స్టార్ రజనీకాంత్‌కు సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. తన అద్భుతమైన కెరీర్‌లో, ఆయన తన ఐకానిక్ నటనతో లక్షలాది మందిని అలరించడమే కాకుండా, సామాజిక అవగాహన పెంచడానికి తన చిత్రాలను ఒక మాధ్యమంగా ఉపయోగించుకున్నారని చంద్ర బాబు తెలిపారు. ఆయన మాటలు సామాజిక సమస్యలపై ప్రతిబింబించడానికి ప్రేరణనిచ్చా యన్నారు. ఆయన సందేశాలు లెక్కలేనన్ని జీవితాలను తాకాయని చెప్పుకొచ్చారు. ఆయన నడకలో, సంభాషణలు పలకడంలో, హావభావ విన్యాసంలో ప్రత్యేకతను చూపిస్తారని తెలిపారు. ఈ మేరకు "ఎక్స్"వేదికగా రజనీకాంత్‌కు తన హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేస్తు న్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు ట్వీట్‌కు సూపర్ స్టార్ రజనీకాంత్ స్పం దించారు. చంద్రబాబు మాటలు, హృదయ పూర్వక శుభాకాంక్షలు తనను నిజంగా కదిలిం చాయని ఎక్స్ వేదికగా చెప్పుకొచ్చారు. మీ దయగల సందేశం చాలా అర్థం అయిందని తెలిపారు. మీలాంటి వ్యక్తుల ప్రేమ, స్నే హంతో.. సినిమా ద్వారా తన ఉత్తమమైన సందేశాలను అందిస్తానని రజినీ పేర్కొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపినందుకు సీఎం చంద్రబాబుకు రజనీకాంత్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఎపి కేడర్-2023 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారులకు పోస్టింగులిచ్చిన ప్రభుత్వం

**విజయవాడ,ఆగస్టు 16,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ కేడర్-2023 బ్యాచ్‌కు చెందిన యువ ఐఎఫ్ఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగులిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. కొల్లూరు వెంకట శ్రీకాంత్‌ను సబ్ డిఎఫ్ఓ,వెంకటగిరికి,కొప్పుల బాలరాజును లక్కవరం సబ్ డిఎఫ్ఓగాను,నీరజ్ హన్స్‌ను డోర్నాల సబ్ డిఎఫ్ఓగాను,గరుడ్ సంకేత్ సునీల్‌ను ప్రొద్దుటూరు సబ్ డిఎఫ్ఓగాను,బబిత కుమారిని గిద్దలూరు సబ్ డిఎఫ్ఓగాను పోస్టింగ్‌లు ఇచ్చారు.

# ఇక రాష్ట్రంలో వాల్మీకి విప్లవం

## - రాష్ట్ర నాయకుడు కనుమకుంట సుకుమార్ బాబు

**పుంగనూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త** రాష్ట్రంలో మరోసారి వాల్మీకుల విప్లవం మొదలవుతుందని చిత్తూరు జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర వాల్మీకి సంఘ నాయకుడు కనుమ కుంట సుకుమార్ బాబు అన్నారు. శనివారం ఉదయం ఉమ్మడి చిత్తూరు జిల్లాల వాల్మీకి సంఘాల నాయకుల సమావేశం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా సుకుమార్ బాబు మాట్లాడుతూ బోయ,వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదని అన్నారు. అంతరించిపోయే దశలో ఉన్న వాల్మీకులను తక్షణమే ఎస్టీలుగా ప్రకటించాలని వాల్మీకి కులస్తులకు పునర్జీవనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో అంతరించిపోయే దశలో ఉన్న వాల్మీకి కులస్తులు కనిపించాలంటే ఆంధ్రప్రదేశ్లో మళ్లీ వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని సూచించారు. ఇందుకోసం తాము దశాబ్దాలు తరబడి పోరాటం చేస్తున్నా, ప్రభుత్వాలు విస్మరించాయని, ఇదే నిర్లక్ష్యం కొనసాగితే వాల్మీకి విప్లవం తప్పదని హెచ్చరించారు. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో కార్యాచరణకు సిద్ధపడతామని అన్నారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ పై జిల్లాస్థాయి ప్రతినిధుల సమావేశంలో కుప్పం సురేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లోని వాల్మీకి, బోయ కులస్తులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. వాల్మీకులను ఎస్టీలుగా చేరుస్తామని మాట తప్పిన గత ప్రభుత్వం మట్టిలో కలిసిపోయిందని పేర్కొన్నారు. చిత్తశుద్ధి కలిగిన కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల నుంచి తీరుకున్న తర్వాతనే, ఇప్పుడు తాము తమ డిమాండ్ నెరవేర్చాలని, ఎన్నికలలో తమ ఇచ్చిన హామీ వెంటనే అమల్లోకి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. ఈ ప్రభుత్వం కూడా పట్టించుకోని పక్షంలో వాల్మీకి విప్లవం తప్పదన్నారు.ఈ సమావేశంలో సీనియర్ వాల్మీకి సంఘ నాయకులు కుప్పం సురేష్, రిటైర్డ్ డిఎస్పి సుకుమార్ బాబు, అద్దాల నాగరాజు, న్యాయవాది ఎల్. భాస్కర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, మాడి శంకరప్ప, వి కోట జయ చంద్ర, రెంటకుంట్ల నరసింహులు, బొమ్మనపల మునిస్వామి, కొలిమి శ్రీనివాసులు, టైలర్ శ్రీనివాసులు, పెద్ద పంజాని గంగప్ప, ఏ. కొత్తకోట చిన్న, కే. రెడ్డప్ప, సోమల శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.



# - స్త్రీ శక్తి పథకం మహిళలకు సిఎం చంద్రబాబు వరం!

నర్సాపురం డిపోలో తనిఖీలు చేస్తున్న ఆర్టీసి వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

**కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త** రాష్ట్రంలో ఉన్న ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ఎపిఎస్ ఆర్టీసీ లక్ష్యమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఆర్టీసీ డిపోను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిపో నిర్వహణ, అధికారులు, సిబ్బందిపై వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులో రానున్నాయన్నారు. తద్వారా ఆర్టీసీ నష్టాల బాట నుంచి లాభాల బాటలో పయనిస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం స్త్రీ శక్తి పథకం సిఎం చంద్రబాబునాయుడు మహిళలకు అందించిన వరం అన్నారు. సుమారు 8వేల దాకా బస్సులు స్త్రీ శక్తి పథకంకు కేటాయించడం జరిగిందన్నారు. అనం తరం ఆర్టీసీ బస్సు ఎక్కి ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళలతో ఆయన మాట్లాడారు.

ఉచిత ప్రయాణం పట్ల మహిళలు, యువతులు, వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తూ ఈ పథకం తమకు ఎంతో ఉపయుక్తకరంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య,

మౌలిక వసతుల కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, కుప్పం గంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

# బంగారువాకిలిలో శాస్త్రోక్తంగా కృష్ణాష్టమి

## కాళీయమర్ధనుడికి అభిషేకాలు



**తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీకృష్ణాష్టమి జన్మదినం పురస్కరించుకుని బంగారు వాకిలిలోని ముఖమండపంలో గోకులాష్టమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం పాల్గొన్నారు. ఆలయంలోపల బంగారు వాకిలిలో గరుడాళ్వార్‌సన్నిధికి ఎదురుగా సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని, ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవిభూదేవి అమ్మ వార్లను కొలువుదీర్చారు. అక్కడ అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీకృష్ణస్వామికి పాలు,పెరుగు, తేనె, నెయ్యి, చందనం, కొబ్బరిజలంతో ఏకాంత తిరుమంజనం నిర్వ హించారు. అనంతరం ప్రత్యేక నివేదినలు చేశారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో అష్టమితిథిన ఈ పర్వదినం జరుగుతుంది. శనివారం గోకులాష్టమి కావడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సాక్షాత్తు ద్వాపరయుగంలో శ్రీకృష్ణపరమ్మాతుడే కలియుగంలో శ్రీవేంక టేశ్వరస్వామిగా ఆవిర్భవించారని భావించి ఈ వేడుకలు జరుగుతాయి. అంతకుముందు శనివారం ఉదయం గోగర్భమ్‌డ్యామ్ ఉద్యానవనంలో కాళీయమర్ధనుడికి ఉద్యానవనవిభాగం ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ప్రసాద నివేదిన ,స్థానిక యువకులు ఉట్టి కొట్టి భక్తులకు అన్నదానం చేపట్టారు.కాగా ఆదివారం మధ్యాహ్నం తిరుమలలో ఉట్లోత్సవం వేడుకగా జరగనుంది.

# తిరుత్తణి సుబ్రమణ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పణ



**తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడులోని తిరుత్తణిలో వెలసిన శ్రీవల్లీదేవసమేత సుబ్రమణ్యస్వామికి ఆడికృత్తిక పర్వ దినాన పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యం కలగడం ఆనందదాయక మని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. చిత్తూరు,తిరుపతిజిల్లాలు ,కర్నాటక, తమిళనాడు సరిహద్దుల నుండి లక్షలాదిమంది భక్తులు తిరుత్తణికి చేరుకుంటున్నారని, వారందరికీ స్వామివారి అనుగ్రహం కలగాలని కోరుకున్నారు. ఆడికృత్తిక సందర్భంగా శనివారం ఉదయం టిటిడి తరపున ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పిఎస్ ప్రసన్నకుమార్‌తో కలసి తిరుత్తణికి వెళ్ళారు. అక్కడ ఉదయం ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ రమణి, తిరుత్తణి ఆలయ ఛైర్మన్ శ్రీదర్ ,ఆలయ అర్చకులకు టిటిడి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలోనికి చేరుకున్న బిఆర్‌నాయుడుకు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన నాయుడుకు తిరుత్తణి ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# గోవిందుని సేవలో న్యాయమూర్తులు




**తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:** గోకులాష్టమి పర్వదినాన శనివారం ఉదయం ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. అందరికి మంచి జరగాలని, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. శనివారం ఉదయం గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీత్‌అగర్వాల్, చెన్నై హైకోర్టున్యాయమూర్తి జస్టిస్ జ్యోతిరామన్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దామా శేషాద్రినాయుడు కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చార. సినీనిర్మాత దగ్గుబాటి సురేశ్‌బాబు ఉదయం తిరుమలకు చేరుకుని ఆలయంలోనికి వెళ్ళారు. అందరూ వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు .ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గుండెపోటు వచ్చిన భక్తుడికి సిపిఆర్ చేసి ప్రాణాలుకాపాడిన పోలీస్ కానిస్టేబుల్!



**తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:** అసలే తిరుమల భక్తజనసంద్రంగా మారిన సమయంలో ఓ భక్తుడు తీవ్రమైన గుండెపోటుకు గురై క్రిందపడిపోయాడు. ఈ ఘటన ఆలయానికి పడమరమాఢవీధిలో చోటుచేసుకుంది. అక్కడే విధుల్లో ఉన్న తిరుమల 1టౌన్ పోలీస్ కానిస్టేబుల్ గుర్రప్ప సమయస్ఫూర్తితో వెంటనే ఆ భక్తునికి సిపిఆర్ చేయడంతో ప్రాణాలు కాపాడగలిగాడు.తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డిజిల్లా కందిమండలం మామిడిపల్లికి చెందిన మేడం శ్రీనివాసులు(61) కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. శుక్రవారం రాత్రి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కుటుంబసభ్యులతో పాటు రాత్రి 9.30గంటలకు లడ్డూ వితరణశాలలో లడ్డూలను తీసుకున్నారు. లడ్డూ కౌంటర్ల నుండి వెలుపలకు వచ్చిన అతను పడమరమాఢవీధిలో వెళ్తుండగా ఒక్కసారిగా క్రిందపడ్డాడు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గుర్రప్ప వెంటనే అతని వద్దకు చేరుకుని సమయస్ఫూర్తితో సిపిఆర్ చేసాడు. వెంటనే అక్కడ నుండి అతనిని అంబులెన్స్‌లో అశ్వినీ ఆస్పత్రికి తరలించాడు. ప్రథమచికిత్సచేయడంవల్ల భక్తుడి ప్రాణాలు కాపాడగలిగారని వైద్యులు తెలిపారు. అనంతరం శ్రీనివాసులును మెరుగైన వైద్యంకోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం స్విమ్స్‌లో కోలుకోవడంతో అతనిని శనివారం మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరి వెళ్ళారు. అయితే భక్తుల రద్దీవేళ తనకెందుకులే అన్నట్లు గాక మానవతాదృక్పదంతో వ్యవహరించి సమయస్ఫూర్తితో భక్తుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ గుర్రప్పను ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. తిరుమల 1టౌన్ సిఐ విజయకుమార్, స్టేషన్ రైటర్ ఏఎస్ఐ మోహన్‌నాయుడు, సిబ్బంది కానిస్టేబుల్‌ను అభినందించారు.

# కపిలేశ్వరుని ఆలయంలో ఆడికృత్తిక పూజలు



**తిరుపతి,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో ఉన్న శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో కొలువైన వళ్లీ దేవయాని సమేత సుబ్రమణ్యస్వామికి ఆడికృత్తిక పూజలు వేడుకగా జరిపించారు. ఆలయ అర్చకులు ఉదయం సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లకు పాలు, పెరుగు,తేనె,విబూది, చందనం, కొబ్బరిజలంతో స్నపనతిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం మూలవర్లకు అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయ తిరువీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆడికృత్తిక ఉత్సవాన కపిలేశ్వరుని ఆలయంలో ఈ పూజలు జరిపించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ సుబ్బరాజు, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. హరోంహర మురుగా నామంతో కపిలతీర్థం ప్రతిధ్వనించింది.

# మనిషి కారణంగా మర్లబడుతున్న ప్రకృతి

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

చిటపట చినుకులు పడుతూ ఉంటే.. చెప్పలేని ఆహాయి అంటూ ఉత్సాహంగా పాడుకొనే రోజులు పోయి కారుమబ్బులు కమ్ముతు ఉంటే ప్రజలు భయాందోళన చెందాల్సిన పాడురోజులు వచ్చిపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి పేరుతో ప్రకృతి విధ్వంసం చేస్తుండటంతో ఉష్ణోగ్రత పెరిగిపోయి వాతావరణ మార్పులతో ధృవాలవద్ద మంచు కరిగిపోతుంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతినడంతో భూకంపాలు, కుంభవృష్టి, తుఫానులు, వరదలు వంటివి తరుచూ తలెత్తుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారత దేశంలో ఏటా 70వేల కోట్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. గడచిన రెండు దశాబ్దాలలో 12లక్షల కోట్ల రూపాయలమేరకు భారత్‌లో సంపద ప్రకృతి కన్నెర చేయడంతో కోల్పోయాం. నైరుతి రుతుపవనాలతో ఆగస్టు 15వరకు దేశంలో సగటు వర్షపాతం 579.11 ఎం.ఎం నమోదు కావాల్సి ఉండగా, 581.66 ఎం.ఎం. వర్షం కురిసింది. దేశంలో అనేక ప్రాంతాల్లో ఒకేతీరుగా వర్షాలు పడలేదు. దేశరాజధాని ఢిల్లీలో భారీ వర్షాలు పడుతున్నాయి. సంవత్సరంలో పడాల్సిన వర్షం కొద్ది గంటల్లో కురిసి ప్రజా జీవనం అతలాకుతలం చేస్తోన్నది. వార్షిక సగటు వర్షపాతాన్ని గురువారం నాటికే ఢిల్లీలో అధిగమించి 818.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది వార్షిక సగటు 774.4 మిల్లీమీటర్ల కంటే అధికం. ఇంకా నాలుగు నెలలు వర్షాలు కురువాల్సి ఉంది. అదే క్రమంలో దేశంలో 13 రాష్ట్రాలలో దుర్భిక్ష పరిస్థితులున్నాయి. అత్యధిక భారీ వర్షపాతం నమోదైన రాష్ట్రాల్లో కూడా అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాలు ఉన్నాయి. జమ్ము కాశ్మీర్‌లో సాధారణ వర్షపాతం నమోదైనా కొద్ది క్షణాలలో జమ్మూ కశ్మీర్ కొండల్లో క్లౌడ్ బరస్ట్ బీభత్సం సృష్టించింది. మచైల్ మాతా దేవి దర్శనానికి వెళ్తున్న యాత్రికులపై విరుచుకుపడింది. ఒక్కసారిగా వచ్చిపడిన ఆకస్మిక వరదతో 46 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది గల్లంతయ్యారు. చనిపోయిన వారిలో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నారు. 167 మందిని సహాయక బృందాలు రక్షించాయి. అయితే వారిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉంది. మరణాల సంఖ్య పన్నెండు వందలకుపైగా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. ఎగువ ప్రదేశాల్లో అకస్మాత్తుగా కుంభవృష్టి కురవడంతో వరద వెల్లువెత్తి పలు భవనాలు, దుకాణాలు తుడిచిపెట్టుకుపోయాయి. వరదల కారణంగా తీవ్ర విషాదం నెలకొనడంతో మచైల్ మాతా దేవి యాత్రను నిలిపేశారు. కిస్త్వాడ్‌లో సహాయక చర్యలు ఆపరేషన్ ముమ్మరం చేయడంలో భాగంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకోవడానికి ప్రతికూల



వాతావరణం అడ్డుపడుతూనే ఉంది. హెలికాప్టర్లు వెళ్లడం లేదని అధికారులు వెల్లడించారు. దీంతో సహాయక బృందాలు రోడ్డు మార్గాన్ని ఎంచుకున్నాయన్నారు. పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, స్థానిక స్వచ్ఛంద సంస్థలతోపాటు దాదాపు 300మంది సైనిక బృందం రెస్క్యూ ఆపరేషన్ కోసం అతి కష్టంగా ప్రమాద స్థలం వరకు చేరుకోగలిగారు. హిమాచల్ ప్రదేశ్‌లోను భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. అక్కడ బుధవారంఅతిభారీ వర్షాలు చోటుచేసుకున్నాయి. సిమ్లా, లాహోల్‌స్పితి ప్రాంతాల్లో పలు నిర్మాణాలు కొట్టుకుపోయాయి. వరద కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో 472 రహదారులను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దక్షిణభారత దేశంలో కూడా పరిస్థితి ఇంచుమించు అలాగే ఉంది. తెలుగు రాష్ట్రాలలో గతవారం రోజులుగా కురుస్తున్న వర్షం కొన్ని జిల్లాలకు మోదం కలిగిస్తే మరికొన్ని జిల్లాలకు ఖేదం కలిగిస్తోంది. తెలంగాణలో నిజామాబాద్ కరీంనగర్, ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్, కర్నూల్, ప్రకాశం జిల్లా రైతాంగానికి ఆనందం కలిగిస్తే, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లా రైతాంగాన్ని, తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం, ములుగు, నల్లగొండ జిల్లాలో రైతాంగానికి పంటలు మునిగి ఖేదం కలిగించింది. భారీ వర్షాల కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లా చాలావరకు పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. పంటవేసి 30నుంచి 40 రోజులే కావడంతో లేత దశలో ఉండగానే వరద ముంచెత్తింది. పశ్చిమ డెల్టాలో వరి చేల నుంచి నీరు లాగకపోతే నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెద పద్ధతిలో సాగు చేసిన వరికి ఎకరాకు రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇటీవలే తొలిదశ ఎరువులు చల్లారు. ప్రస్తుతం చేలల్లో ఉన్న నీటిని బయటకు పం పేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండడంతో పొలాల నుంచి నీరు నెమ్మదిగా కదులుతోంది. మరోవైపు ఎగువ నుంచి వర్షపునీరు పోటెత్తుతోంది. జిల్లావ్యాప్తంగా 24వేల హెక్టార్లలో వరి ముంపునకు గురైంది. నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా. వర్షాలు పూర్తిగా తగ్గాక వ్యవసాయశాఖ పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుంది. వాగులు వరద నీటితో పోటెత్తుతున్నాయి. ఇవి చాలా చోట్ల కుచించుకుపోవడంతో ప్రవాహం వేగంగా ముందుకు సాగడం లేదు. కొన్ని చోట్ల నీరు వెనక్కి తన్ని పొలాల మీదకొస్తోంది. మెట్ట ప్రాంతంలో పత్తి, మినుము దెబ్బతిన్నాయి. మేడికొండూరు, పిరంగిపురం, ప్రత్తిపాడు, పెదనందిపాడు, తాడికొండ మండలాల్లో వాగుల వెంబడి ఉన్న పత్తిమొక్కలు కొట్టుకుపోయాయి. వర్షం ఇంతటితో ఆగితే కొంత నష్టంతో బయటపడతామని, లేకుంటే పంట చాలావరకు దెబ్బతింటుందని రైతులు వాపో తున్నారు. అల్పపీడన ప్రభావంతో కురిసిన కుండపోత వర్షా నికి ఉభయ గోదావరి జిల్లాలోని పల్లపుప్రాంతాల్లో వరిచేలు జలదిగ్బంధంలో చిక్కాయి. మట్టిపూడికతో పాటు తూడుగుర్రపుడెక్క ఇతర వ్యర్థాలతో నిండిపోయిన డ్రెయిన్లల్లో మురు గునీరు సాఫీగా ముందుకెళ్లని పరిస్థితులున్నాయి. పంటలపై ఈ ప్రభావం ఎక్కువగా పడింది. గురువారం ఉదయం పొడి వాతావరణం ఏర్పడటంతో రైతులు పొలం బాట పట్టారు. అత్తిలి మండలం తిరుపతిపురం, వరిమేడు ప్రాంతాల్లో వరి చేలు నీటమునిగినాయి. వర్షంపడితే తెలుగు రాష్ట్రాలలో నగరాలు, పట్టణాలు నదులను తలపిస్తున్నాయి. హైదరాబాద్‌లో చినుకపడితే చాలు నగరం నదిగా మారుతోంది. గతవారం రోజులుగా నగరప్రజలు నరకం చూస్తున్నారు. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజా మాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షం కురుస్తుండటంతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. తెలంగాణలో నైరుతి రుతుపవనకాలంలో 42 సగటు వర్షపురోజులు నమోదైనాయి. మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, జగిత్యాల జిల్లాలో ఇంకా లోటు వర్షపాతంతో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. హిమాయత్ సాగర్‌గేట్లు ఎత్తడంతో మూసీనది ఉగ్రరూపం దాల్చుతోంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రానికి నదిలో రెండు నుంచిమూడు అడుగుల మేరప్రవాహం పెరిగింది. నది పొడ వునా ఉన్న కిస్మత్‌పురా, మూసారాంబాగ్ తదితర కాజ్వేలు నీట మునిగాయి. ఉధృతి పెరుగుతుండటంతో కాజ్వేలను మూసేశారు. చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ మధ్య మూసీకి పక్కనున్న బస్తీలనూ వరద ముంచెత్తింది. చాదర్ ఘాట్ వంతెన పక్కనున్న దేవాలయంలోకి నీరు చేరింది. హైదర్‌నగర్ బ్రిడ్జి మునిగింది. పక్కనున్న రసూల్పుర, శంకర్నగర్, మూసానగర్ తదితర బస్తీల్లో రోడ్లపై అడుగు ఎత్తున వరద నిలిచింది. ముందస్తు చర్యల్లో భాగంగా స్థానికులందరినీ ఇళ్లు ఖాళీ చేయించారు. సమీప కాలనీల్లో పునరావాస కేంద్రాలను సిద్ధంచేశారు. 307 మందిని తరలించారు. ఇతరత్రా ప్రాంతాల్లోనూ ముంపుసమస్య మొదలవుతుండటంతో నదికి ఇరువైపులా ఉన్న చార్మినార్, ఖైరతాబాద్, ఎల్బీనగర్ జోన్లలో అప్రమత్తం చేశారు. ●

కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రాజెక్టులు జళకళను సంతరించుకొన్నాయి. శ్రీశైలంకు 721 టిఎంసిల వరద నీరు వచ్చి చేరింది. గోదావరి నదిపరివాహక ప్రాంతంలో ఎగువన ప్రాజెక్టులు నీరు అరకొరగా చేరుతుండటంతో వెలవెలపోతున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు 40.61 టిఎంసిలు శ్రీపాద ఎల్లంపల్లికి 11.02 టిఎంసిలు ఎగువ నుంచి వరద వచ్చింది. గత ఏడాది ఆలమట్టి ప్రాజెక్టు ఆలస్యంగా నిండినా ప్రస్తుతం గరిష్ఠ నీటి నిల్వసామర్థ్యంకంటే రెండు టిఎంసిలు మాత్రమే తక్కువగా ఉన్నాయి. 127.84టిఎంసిల నీరు అందులో ఉంది. జూరాల నుంచి ఈ యేడు 486 టిఎంసిల నీరు వరద రూపంలో కిందికి పోయింది. జూరాలలో ప్రస్తుతం 7.69



టిఎంసిల నీరు ఉంది. తుంగభద్రలో 80 టిఎంసిల నీరు నిల్వఉంది. శ్రీశైలంలో 199.27 టిఎంసిలు నీరు నిలిచి ఉంది. నాగార్జున సాగర్‌లో 307టిఎంసిల నీరు ప్రస్తుతం ఉంది. వార్షకాలం ఆరంభం నుంచి ఎస్ఎస్‌పి జలాశయంలోకి 397 టిఎంసిల నీరు వరద రూపంలో వచ్చిచేరింది. ఎస్సారెస్పీలో 45 టిఎంసిలు, ఎల్ఎండిలో 7.08టిఎంసిలు, మిడ్‌మానేరు లో 8టిఎంసిలు, కడెంలో 3.5 టిఎంసిలు, శ్రీపాద ఎల్లంపల్లిలో 15 టిఎంసిలునీరు ఉంది. ప్రాణహితకు దిగువ నుంచి గోదావరి ఉప్పొంగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి జలకళ సంతరించుకొంది.

---

రాష్ట్రం

తమిళనాడు

# అందరిదీ ఒక దారి..

**ఎ.వి.వి ప్రసాద్**

సమయానుకూలంగా సొంత గొంతుక వినిపించడం, మిగిలినవారికంటె తాము అధికులుగా భావించడం తమిళులకు అలవాటే. ముఖ్యంగా ద్రవిడ పదానికి, ద్రవిడ వాదానికి తామే హక్కుదారుల మనుకుంటూ ఉంటారు కూడా. కేంద్రంతోను, అక్కడ అధికారంలో ఉన్న బిజెపి కూటమి ప్రభుత్వంతోను పొసగని ముఖ్యమంత్రి స్టాలిన్ గతవారం 'సొంత విద్యావిధానం' ప్రకటించడం దానిలోని భాగమే. కేంద్రం 2020లో ప్రకటించిన కొత్త విద్యావిధానాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న స్టాలిన్ తాజాగా ప్రకటించిన విధానాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే హిందీకి వ్యతిరేకంగా ఒక విధానం రూపొందించినట్లు కనిపిస్తుంది కానీ ఎటువంటి ప్రత్యేకతా దానిలో లేదనే అనిపిస్తుంది. నిజానికి హిందీ వ్యతిరేకత తమిళనాడుకు కొత్త విధానమేమీ కాదు. కొన్ని దశాబ్దాలుగా నడుస్తోంది. కేంద్రం ప్రకటించిన జాతీయ విద్యావిధానాన్ని (ఎన్ ఇపి) వ్యతిరేకించడమే స్టాలిన్ విధానంగా కనిపిస్తుంది గాని దానిలో ఎలాంటి కొత్తదనమూ లేదని కూడా అనిపిస్తుంది. త్రిభాషా విధానం తాము అనుసరించబోమనీ, ద్విభాషా విధానమే తమ మార్గమనీ స్టాలిన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంటూనే ఉన్నారు. డిఎంకె విధానం ఆది నుంచి అదే. హిందీని వ్యతిరేకించడం డిఎంకె విధానాల్లో ప్రధానమైనదిగా ఉంటోంది. ఒక్క డిఎంకెనే కాదు, ద్రవిడ పార్టీల విధానమే అది. ఎన్నికల్లో ఈ విధానానికి ఎక్కువ ఓట్లు పడతాయని భావించిన ద్రవిడ పార్టీలు ( అన్నా డిఎంకె సహా) ఈ ద్విభాషా విధానానికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. అంటే మాతృభాష తమిళం, మరో భాషగా ఇంగ్లీషు. ఈ విధానంలో హిందీకి అధికారికంగా స్థానమే లేదు. హిందీ నేర్చుకున్నా, కార్యకలాపాలు ఆ భాషలో జరిపినా జాతీయ పార్టీల వలలో ప్రజలు పడతారని భావించడం అందుకు ఓ కారణమై ఉండవచ్చు. ఈ కొత్త విద్యావిధానం ముసాయిదా పాలసీని రూపొందించడానికి 2022లో రిటైర్డ్ జస్టిస్ మురుగేశన్ నాయకత్వంలో 14మంది సభ్యులతో ఒకప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గత సంవత్సరమే తమ ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి సమర్పించింది. వాటిని పరిశీలించిన స్టాలిన్ సర్కార్ తాజాగా నూతన విద్యావిధానం ప్రకటించింది. మాతృభాషతో పాటు ఆంగ్లం, కృత్రిమ మేధ (ఎఐ), సైన్స్ రంగాలకు ప్రాధాన్యం ఇచ్చేలా ఈ కొత్త విధానాన్ని రూపొందించారు. అంతేకాదు. నీట్ వంటి ప్రవేశ పరీక్షలను కూడా వ్యతిరేకిస్తున్న స్టాలిన్ ప్రభుత్వం కొత్త విధానంలో భాగంగా మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించింది. 11, 12 వ తరగతుల మార్కులతో ఆర్ట్స్, సైన్స్ వంటి కోర్సుల్లో యుజి ప్రవేశాలు కల్పించేలా కొత్త పాలసీలో ప్రతిపాదనలు చేశారు. విద్యను తిరిగి రాష్ట్ర జాబితాలోకి తీసుకురావాలన్నదే తమ విధానమని స్టాలిన్ తనయుడు, ఉప ముఖ్యమంత్రి అయిన ఉదయనిధి స్టాలిన్ ఈ సందర్భంగా ప్రకటించడం



స్టాలిన్

కూడా ముందు ముందు డిఎంకె ఎటువంటి వ్యూహం అనుసరించబోతున్నదో తెలియజేస్తోంది. వచ్చే సంవత్సరం అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండడంతో 'సొంత' విధానాలు ప్రకటించడం, వాటి ద్వారా 'అదనపు ఓట్లు' ఆకర్షించాలనుకోవడం స్టాలిన్ వ్యూహమనుకోవచ్చు. తమిళనాడులో ఎన్ఇ పి ని అమలుచేయడానికి నిరాకరించడంతో రూ.2,200 కోట్ల నిధులను కేంద్రం వెనక్కి తీసుకొంటున్నదని ఆరోపిస్తూ స్టాలిన్ సుప్రీం కోర్టును కూడా ఆశ్రయించారు. ఇటీవల పొరుగున ఉన్న మహారాష్ట్రలో కూడా ఇటువంటి ధోరణే కనిపించింది. ఎన్ ఇ పి, హిందీ బోధనను వ్యతిరేకిస్తూ విపక్షాలు ముఖ్యంగా శివసేన వర్గాలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరపడంతో అక్కడి బిజెపి కూటమి ప్రభుత్వం దిగివచ్చి 14 తరగతి విద్యార్థులకు హిందీని తప్పనిసరి చేయడాన్ని విరమించుకొంది. ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరేలు ఈ ఆందోళనల కారణంగా తిరిగి చేతులు కలపడం మరో ఆసక్తికర పరిణామం. అయితే అక్కడి ఆందోళనల నేపథ్యం వేరు. ప్రాథమిక స్థాయిలో హిందీని వద్దంటున్నారు కానీ ఆ భాషను పూర్తిగా వ్యతిరేకించడం లేదు. అందుకు కొన్ని రాజకీయ కారణాలు కనిపిస్తాయి. శివసేన ప్రాంతీయ పార్టీ అయినా జాతీయ పార్టీలతో కలిసి నడవడం అలవాటు చేసుకొంది. బిజెపి లేదా కాంగ్రెస్ ఏదో ఒక పార్టీతో చాలా కాలం నుంచి కలిసినడుస్తోంది. అందువల్ల ధైర్యం చేసిహిందీని పూర్తిగా వ్యతిరేకించలేకపోతోంది. ఫడ్నవిస్ ప్రభుత్వం విధిలేని స్థితిలో వెనక్కితగ్గింది. తమిళనాట స్టాలిన్ ప్రభుత్వానికి ఎదురులేదు కనుకహిందీని పూర్తిగా అన్నిస్థాయిల్లో వ్యతిరేకించే విధానాన్ని ప్రవేశపెట్టింది కానీ ఇది చాలావిమర్శలకు గురవుతోంది. హిందీ వ్యతిరేకతను కాంగ్రెస్ సమర్థించలేదుకానీ డిఎంకె కూటమిలో భాగస్వామి అయినందువల్ల నోరు మెదపలేకపోతోంది. విద్యను స్టేట్ లిస్ట్‌లోకి మార్చాలనేడిఎంకె డిమాండ్‌ను కూడా చాలామంది తప్పు పడుతున్నారు. తమకేదో అన్యాయం జరుగుతోందను కొని డిఎంకె చేస్తున్న డిమాండ్‌వల్ల ఇతర రాష్ట్రాలకు నష్టం జరిగే అవకాశం ఉంది. ద్విభాషా విధానంలో పేర్కొన్న'సామాజిక న్యాయం' కూడా హేతుబద్ధంగా లేదనే విమర్శ ఉంది. రాష్ట్రప్రభుత్వ విధానంలో హిందీ లేకపోయినా ఉత్తరాదికి వెళ్లాలనుకొనే వారికి హిందీ తప్పనిసరి అవసరంగానే కనిపిస్తుంది. ఆ కారణంగా ప్రాథమిక స్థాయి నుంచి ఆ భాషను నేర్చుకొనేవారు కూడా ఉంటారు. అటువంటప్పుడు భాషపై ఆంక్షలు విధించడం సమంజసమా?అనే ప్రశ్న ఉదయిస్తుంది. మాతృభాషను తప్పనిసరిగా నేర్చుకొంటూ ఒకజాతీయ, మరో అంతర్జాతీయ లేదా నచ్చిన మరో భాషను నేర్చుకొనే త్రిభాషా విధానాన్నే మెజారిటీరాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. అయితే అందరిదీ ఒక దారి, ఉలిపికట్టెది మరోదారి అన్నట్లు తమిళనాడుప్రభుత్వం సొంత విధానం అనే ప్రత్యేక విధానం ప్రకటించింది. దాని ప్రభావం ఎంత ఉంటుంది, ఎలా ఉంటుందనేది ఎన్నికలే నిర్ణయిస్తాయి. ●

---


రాష్ట్రం

ఉక్రెయిన్

# చెదిరిన ఉక్రెయిన్ 'శాంతి' స్వప్నం!

**గన్ని మోహన్**

మూడున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధకాండకు ముగింపు లభిస్తుందని ప్రపంచదేశాలన్నీ అంచనా వేసాయి. ఐరోపాలోని అతి చిన్న దేశంగా ఉన్నఉక్రెయిన్ కూడా తమ దేశానికి మంచిరోజులు వస్తున్నాయని మురిసిపోయింది. అయితే ఎలాంటి డీల్ లేకుండానే ముగిసిన అగ్రరాజ్యాల అధినేతల భేటీతో శాంతిచర్చలకు విఘాతం కలిగిందనే భావించాలి. అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య జరిగిన చర్చలు అసంపూర్తిగానే ముగియడంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ కలలుకంటున్న శాంతిఒప్పందం చెదిరిపోయిందనే చెప్పాలి. రష్యా ఆక్రమించుకున్న క్రిమియా, డోనెట్స్క్ ఒబ్లాస్ట్, లుహాన్స్క్ ఒబ్లాస్ట్, తాజాగా యుద్ధంలో స్వాధీనం చేసుకున్న ఝపోరిజియా, ఖెర్సన్ ఒబ్లాస్ట్‌ప్రాంతాలను తమకే అప్పగించాలంటున్న రష్యా డిమాండ్లు ఎంత మాత్రం ఆమోదయోగ్యంగా లేవు. అలాగే ఉక్రెయిన్‌కు నాటోసభ్యత్వం ఇవ్వకూడదని, ఐరోపా, నాటోదళాల సైనిక ఆయుధ సాయం వెంటనే నిలిపివేయాలంటూ ట్రంప్ ముందు పెట్టిన డిమాండ్లు ఉక్రెయిన్‌కు సుతరాము ఇష్టంలేదు. తమ దేశ సార్వభౌమత్వానికి భంగం వాటిల్లే ఎలాంటిచర్యలనైనా వ్యతిరేకిస్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టత ఇచ్చారు. ఆయనకు ఐరోపాదేశాలు కూడా సంపూర్ణమద్దతు ఇచ్చాయి. అందుకే అలాస్కా చర్చలు అసంపూర్తిగానే ముగిసాయి. ఒకవిధంగా చూస్తే ఈచర్చల్లో మొదటి విడత ట్రంప్ కంటే పుతిన్ సఫలీకృతం అయినట్లు కనిపిస్తోంది. మరోసారి చర్చలు మాస్కోలు ఉంటాయని ప్రకటించిన పుతిన్ శాంతిఒప్పందానికి తాను వ్యతిరేకం కాదని, కొన్ని షరతులకు లోబడి మాత్రమే ఉంటుందని ప్రకటించడం చూస్తే సాగదీత ధోరణి కనిపిస్తోంది. ఉక్రెయిన్ రష్యామధ్య యుద్ధవిరమణ జరిగి శాంతి ఒప్పందం జరిగితే నోబెల్ శాంతి పురస్కారం తనకే దక్కుతుందన్న ట్రంప్‌ఆకాంక్షలకు కూడా పుతిన్ బ్రేకులు వేసినట్లయింది. ఇక చర్చలపరంగా చూస్తే ఏం జరిగిందన్నది ఇరువురు నేతలు బయటికి వెల్లడించలేదు. అంతాసవ్యంగా జరిగిందని మాత్రమే చెప్పుకున్నారు. ఒకరినొకరు పొగుడుకోవడం మినహా చర్చల్లో ఒరిగిందేమీ లేదన్నది నగ్న సత్యం. పుతిన్‌ను దారికితెచ్చుకోవాలని ట్రంప్ అలాస్కాలో రెడ్‌కార్పెట్ వేసి చప్పట్లతో ఆహ్వానించి తానే చర్చల వేదికపైకిస్వయంగా తోడ్కొని వెళ్లడం. అదికూడా ఎవ్వరికీ అనుమతి లేని తన సొంత బీస్ట్ వాహనంలోనే పుతిన్‌ను తీసుకెళ్లడం వంటిఅంశాలు చర్చలు కొలిక్కివస్తాయన్న ఆశలు పెంచాయి. మూడున్నరేళ్లుగా ఉక్రెయిన్‌పై సాగుతున్న నరమేధం అంతం కావాలంటే రష్యాఅధ్యక్షుడిపై ఒత్తిడిని పెంచాలని చెపుతూ వచ్చిన ట్రంప్ చర్చలకు ముందువరకూ శాంతి ఒప్పందానికి రాకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయన్న హెచ్చరికలు కూడా ట్రంప్ చేసారు. తీరా చర్చలు ముగిసిన తర్వాత ట్రంప్ ధోరణి చూస్తుంటే కొంత మేర అసంతృప్తికి గురైనట్లే ఉంది. ఉక్రెయిన్‌పై చర్చలకంటే ఇరుదేశాల వ్యక్తిగత ప్రయోజనాలే ఎక్కువ చర్చకు వచ్చాయన్న ప్రచారంపైనా ఇరువురునేతలుస్పందించలేదు. తక్షణమే కాల్పులు విరమణ ప్రకటించి యుద్ధం నిలిపివేయాలని, తమ నుంచి ఆక్రమించుకున్న ప్రాంతాల నుంచి రష్యాసేనలు వైదొలగాలని, భవిష్యత్తులో ఎలాంటి సైనిక చర్యల్లో అయినా నాటో లేదా అగ్రరాజ్యాలు తమకు అండగా నిలవాలని జెలెన్‌స్కీ కోరుకుంటున్నారు. ముఖ్యంగా అమెరికా అనుసరిస్తున్న ప్రస్తుత ధోరణులపైనా ఆయనకు అసంతృప్తిగా ఉంది. శ్వేతసౌధంలో తనపట్ల వ్యవహరించిన తీరు ఇప్పటికీ జెలెన్‌స్కీ మనసులోనే ఉంది. వాటిని పక్కనపెడితే చర్చల్లో ఉక్రెయిన్, ఐరోపాదేశాలను పిలవకపోవడంకూడా సర్వత్రా విమర్శలపాలైంది. రష్యా ఉక్రెయిన్ బృందాల ఇస్తాంబుల్‌లో సంప్రదింపులు, రష్యా అమెరికా ప్రతినిధులు రియాద్‌లో జరిపిన చర్చలకు కూడా ఐరోపానేతలకు ఆహ్వానంలేదు. ఉక్రెయిన్ లేకుండా జరిగే శాంతిచర్చలు అర్థరహితమని ఐదు దేశాలు హెచ్చరిస్తున్నాయి. ఓపక్క రష్యా ఆక్రమిత భాగం తమకు అప్పగించాలని, యుద్ధఖైదీలను విడుదల చేయాలని, రష్యా అపహరించిన తమ దేశచిన్నారులను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తోంది, రష్యాపై విధించిన అంతర్జాతీయ ఆంక్షలు ఎత్తివేసినా భవిష్యత్తులో అవసరమైతే మళ్లీ విధించే విధంగా ఒప్పందంలో ఉండాలని ఉక్రెయిన్ కోరుకుంటున్నది. అత్యంత కీలకంగా నడిచిన శిఖరాగ్ర చర్చలు సుదీర్ఘంగా జరుగుతాయని భావించారు. నాలుగుగంటల్లోనే ముగించి బయటకు వచ్చి చర్చలు ఫలప్రదం అయ్యాయని ప్రకటించడంపై ఐరోపా దేశాలు పెదవి విరిచాయి. ఇది కేవలం పుతిన్ వ్యక్తిగత విజయం మాత్రమేనని బాహాటంగానే ట్రంప్‌ను విమర్శించాయి. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధకాండను నిలిపివేసేందుకు జెలెన్ స్కీ ముందు నుంచి కూడా అహరహం శ్రమిస్తూనే ఉన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి అగ్రరాజ్యాల్లో పర్యటించారు కూడా. ఐక్యరాజ్య సమితిలో కూడా పలు పర్యాయాలుప్రసంగించి కన్నీటి పర్యంతం అయ్యారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వానికి భంగం వాటిల్లే ఏచర్యలను కూడా ఆమోదించలేమని ప్రకటించిన జెలెన్‌స్కీపైనే ట్రంప్‌వ్యూహాత్మకంగా వ్యవహరించి ఆతని చేతుల్లోనే శాంతిఒప్పందం ఇమిడి ఉందని పేర్కొంటున్నారంటే రష్యా ఆక్రమిత ప్రాంతాలను అప్పగించడమేనని చెప్పకనే చెపుతున్నట్లయింది. భూభాగాల మార్పిడిని ఐరోపా దేశాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈచర్య ఆదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని స్పష్టం చేసాయి. దీనితో ట్రంప్ చేసిన ప్రతిపాదనలన్నీ తేలిపోయినట్లు భేటీ తర్వాత ఆయన ముఖకవళికలే చెపుతున్నాయని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు చేస్తున్న విశ్లేషణల్లో నిజం లేకపోలేదనిపిస్తోంది. మొత్తంగా చూస్తే చిరకాలంగా శాంతి ఒప్పందం జరుగుతుందని, అమెరికా జోక్యంతోనే రష్యాదారికివస్తుందని అచంచల విశ్వాసంతోఉన్నఉక్రెయిన్ ప్రజల ఆకాంక్షలపై నీళ్లు చల్లినట్లయింది. ●



జెలెన్‌స్కీ

---

# యుద్ధాలకు నిర్వచనమే అమెరికా

**బొల్లిముంత సాంబశివరావు**

సామ్రాజ్యవాదం యుద్ధాలకు నిలయం. ఈ రెండింటి మధ్య అవినాభావ సంబంధం ఉంది. యుద్ధాలు లేకపోత సామ్రాజ్యవాద దేశాలకు నిద్రపట్టదు. వివిధ దేశాల సహజ వనరులను కొల్లగొట్టటం, ప్రభుత్వాలను కూల్చటం, దురాక్రమణ యుద్ధాలు చేయటం, పెద్దఎత్తున ఆయుధ వ్యాపారం చేయటం కోసం దేశాల మధ్య తగవులు పెట్టటం దాని సహజ లక్షణం. వీటన్నిటినీ నేడు అమలు జరుపుతున్నదే అమెరికా సామ్రాజ్యవాదం. ఆయుధాలను ఉత్పత్తి చేయటం, అమ్మటం సామ్రాజ్యవాద దేశాలకు అత్యంత కీలకం. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తిలో ఆయుధాల ఉత్పత్తి ముఖ్య భాగంగా ఉంది. గత 64 సంవత్సరాలుగా మొత్తం అమెరికా పారిశ్రామిక ఉత్పత్తిలో ఆయుధాల ఉత్పత్తి ముఖ్య భాగంగా ఉంది. ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ ఐ పిఆర్ ఐ)పరిశోధన ప్రకారం అమెరికాలోనిఆయుధ కంపెనీలు, రక్షణ రంగ సంస్థలు అంతర్జాతీయ ఆయుధ అమ్మకాల్లో 37శాతంతో అగ్రస్థానంలో ఉన్నాయి. ఆయుధాల మీద, రక్షణ రంగం మీద 2020లో అమెరికా చేసిన ఖర్చు 778బిలియన్ డాలర్లు. మన రూపాయల్లో 58 లక్షల కోట్లు. ఆ తర్వాత 10స్థానాల్లో ఉన్నదేశాలు చైనా, ఇండియా, రష్యా, సౌదీ అరేబియా, ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లాండ్, జపాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్. ఈ పది దేశాల ఆయుధ ఉత్పత్తి ఖర్చులు కలిపినా అమెరికా ఖర్చు కన్నా తక్కువ. అమెరికా మొత్తం ఖర్చులో 15శాతం పైగా ఆయుధ పరిశ్రమలకే ఖర్చు చేస్తున్నది. 2019లో దేశ రక్షణ కోసం కేటాయించిన 716 బిలియన్ డాలర్లలో 686 బిలియన్ డాలర్లు (90) రక్షణ శాఖకే కేటాయించింది. 2023 నాటికి రక్షణ రంగ కేటాయింపులు 900 బిలియన్ల డాలర్లకు పెరిగింది. అమెరికా ఆయుధ ఉత్పత్తిలో 10శాతం కాంట్రాక్టు ఆయుధ నిర్మాణం, అంటే ఇతర దేశాల ప్రభుత్వాల కోసం ఆయుధాలు ఉత్పత్తి చేసి ఇవ్వటం. ఆయుధ పరిశ్రమలో ఉద్యోగాలు నిలపటం కోసం నిరంతరం ఆయుధ ఉత్పత్తి జరుగుతుంది. ఈ ఆయు ధాల విక్రయం కోసం ఇతర దేశాల అంతరంగిక విషయా ల్లో జోక్యం చేసుకోవటం, ఒక దేశం పైకి మరొక దేశాన్ని రెచ్చగొట్టి యుద్ధాలను సృష్టిస్తుంది. తన సామ్రాజ్యవాద కాంక్షలకు, ఆధిత్యానికి వ్యతిరేకంగా స్టాలిన్ నాయకత్వాన సోషలిస్టు శిబిరం ఏర్పడటం అమెరికాకు నిద్ర లేకుండా చేసింది. అనేక దేశాలకు విస్తరిస్తున్న మార్క్సిజం వ్యాప్తిని అడ్డుకోవటానికి కమ్యూనిస్టు, సోషలిస్టు దేశాలపై దాడులకు పాల్పడింది. 1950లో ఉత్తర కొరియాపై సైన్యాలను పంప టమే కాకుండా చైనా వైపునకు చొరబడేందుకు ప్రయత్నిం చింది. ఈయుద్ధంలో అమెరికా ఓటమి చెందటమే కాకుండా 36వేల మంది సైనికులను కోల్పోయింది. చైనా, ఉత్తర కొరియాకు అన్ని రకాల తోడ్పాటును అందించింది. దక్షిణ వియత్నాంలో కమ్యూనిస్టుల ఉద్యమాన్ని అణచివేయటానికి అక్కడి నిరంకుశ దోపిడీ ప్రభుత్వానికి మద్దతుగా సైనిక జోక్యం చేసుకుని ఐదు లక్షల సైన్యాన్నిపంపింది. ప్రజల పైన, కమ్యూనిస్టుగెరిల్లా, సైనిక దళాలపైన పాశవికటాం బుల దాడులతో అనేక అమానుషాలకు పాల్పడింది. అమెరికా సైన్యాల దాడుల్లో 11లక్షలకుపైగా వియత్నాం ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 58వేల అమెరికన్ సైనికులూ మర ణించారు. ఈయుద్ధంపై అమెరికా పెట్టిన ఖర్చు 686 బిలి యన్ డాలర్లు. అప్పటి రూపాయి విలువ ప్రకారం 5.5 లక్షల కోట్లు. ఎంత మంది సైన్యాలను పంపినా, మారణ హోమం సృష్టించినా, వందల బిలియన్ల డాలర్లు ఖర్చుచేసినా హోచిమిన్ నాయకత్వాన ఉన్న సైన్యం చేతిలో అమెరికా ఓడిపోక తప్పలేదు. 1975లో దక్షిణవియత్నాం విముక్తితో ఒకే వియత్నాం ఏర్పడింది. ఇదే క్రమంలో లావోస్, కాంబో డియా దేశాల్లో కూడా సైనిక జోక్యం చేసుకుని ఓటమిచెంది అప్రతిష్ట



పాలైంది. 1961లో క్యూబాలో ఫెడరల్ కాస్ట్రోప్రజా ప్రభుత్వాన్ని పడగొట్టి కుట్రచేసి విఫలమైంది. వివిధదేశాల్లో కమ్యూనిస్టుల పోరాటాల అణచివేతకు సైనిక జోక్యం చేసుకోవటమే కాకుండా, తన మాటవినని దేశాల్లోని ప్రభుత్వాల కూల్చివేతకు పాల్పడింది. సైనిక దాడులు చేసి ఆక్రమించింది. 2003లో ఇరాక్‌పై సైనికదాడి చేసి, ఆదేశాన్ని ఆక్రమించి, దేశాధ్యక్షుడు సద్దాం హుస్సేన్ చంపింది. ఈ దాడిలోను, దాడి తర్వాత పరిణామాల్లో 4లక్షల, 61వేల మంది ఇరాక్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యుబుష్ ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్ దేశాలలో యుద్ధాలు మొదలు పెట్టగా, ఆ తర్వాత బరాక్ ఒబామా వాటిని కొనసాగిస్తూ లిబియా, సిరియా, ఎమన్ దేశాల్లో పరోక్షంగాను, ప్రత్యక్షం గాను యుద్ధాలు చేశాడు. డొనాల్డ్ ట్రంప్ యుద్ధాలను వివిధ రూపాల్లో కొనసాగించారు. అరబ్ దేశాల చమురు నిల్వలను కొల్లగొట్టేందుకు ఇజ్రాయిల్‌ను పావుగా వాడుకుంటూ ఆధునిక ఆయుధాలు, పెద్దఎత్తున ఆర్థిక సహాయం అందించి పాలిస్తీనాపై దురాక్రమణ యుద్ధం చేయించి లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయేలా చేసింది. 2023లో గాజాపై ఇజ్రాయిల్ చేసిన యుద్ధంలో 44,750 గాజా ప్రజలు మరణించారు. ఈ మారణకాండ కొనసాగు తూనే ఉంది. కొద్దినెలల క్రితం ఇజ్రాయిల్ చేత లెబనాన్‌పై దాడులు చేయించింది. గాజాపైన లెబనాన్పైన ఇజ్రాయిల్ జరిపిన, జరుపుతున్న దాడులను మోడీ ప్రభుత్వం ఖం డించలేదంటే ఇజ్రాయిల్ దాడులను, దాని మారణకాండను సమర్థించటమే. ప్రపంచ ఆధిపత్యం కోసం ఆరాటపడుతూ, అందుకు అడ్డంకిగా ఉన్న రష్యాను దెబ్బతీయటానికి నాటో కూటమిని అమెరికా ఏర్పాటు చేసింది. రష్యాను దెబ్బ తీయాలంటే ఉక్రెయిన్‌ను తనవైపుకి అమెరికా తెచ్చుకోవాలి. ఆ దేశ ప్రస్తుత అధ్యకుడు రష్యా వ్యతిరేకి, ఉక్రెయిన్‌ని నాటోలో చేరమని అమెరికా జెలన్‌స్కీపై ఒత్తిడి ప్రారంభించింది. ఉక్రెయిన్ నాటోలో చేరటం తనకు ప్రమాదంగా రష్యా భావించింది. ప్రపంచ ఆధిపత్యంలో భాగం కోసం అమెరికాతో ఘర్షణ పడుతున్న రష్యా, నాటోలో చేరవద్దని జెలెన్‌స్కీని హెచ్చరించింది. అమెరికా వ్యూహంలో చిక్కుకున్న జెలన్‌స్కీ రష్యాతో చర్చలకు తిరస్కరించి యుద్ధానికి మొగ్గు చూపిన ఫలితమే, ఉక్రెయిన్‌పై రష్యా దాడి. అమెరికా దాని మిత్ర దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధాలు సప్లయ్ చేస్తూ యుద్ధాన్ని ఆరకుండా చేస్తున్నాయి. యుద్ధం ఫలితంగా ఉక్రె యిన్లో ప్రాణనష్టం, ఆర్థికనష్టం అపారంగా ఉంది. అమెరికా నేడు తీవ్రమైన ఆర్థికసంక్షోభంలో ఉంది. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగాయి. కొన్నిదేశాలు అమెరికా పెత్తనాన్ని సవాలు చేస్తున్నాయి. ఇప్పుడు ట్రంప్ అనుసరిస్తున్న రాజ కీయ, ఆర్థిక విధానాల వెడల అమెరికా ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. దీన్ని కప్పిపుచ్చుకోవటానికి దేశ ప్రయోజనాల కోసమంటూ వివిధ దేశాల దిగుమతులపై 25నుంచి 50 శాతం సుంకం విధించటం కూడా దాని ఆర్థికసంక్షోభానికి నిదర్శనం. అమెరికా చేసిన అనేక దురాక్రమణ యుద్ధాల్లో 45లక్షల మంది ప్రజలు చనిపోయారని బ్రౌన్ విశ్వవిద్యా లయ 2023 మే విడుదల చేసిన 'యుద్ధం ఖరీదు' అనే రీసెర్చ్ ప్రాజెక్టు నివేదిక పేర్కొంది. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, మానవహక్కుల కోసమని అమెరికా చేస్తున్న ప్రచారం ఎంతటి మోసమో నివేదిక తేటతెల్లం చేసింది. భూగ్రహం మీద అత్యంత హింసాత్మకమైన, పరులరక్తంతో తడిచిన శక్తిఏదైనా ఉందంటే అది అమెరికానే అవుతుందని నివేదిక పేర్కొంది. యుద్ధాలకు, కోట్లాది ప్రజల మరణాలకు అమెరికా సామ్రాజ్యవాద ప్రపంచ ఆదిపత్య ధోరణే కారణం. సామ్రాజ్యవాదం ఉన్నంత కాలం యుద్ధాలు కొనసాగుతూ, ప్రజల ప్రాణాలు హరించబడుతూనే ఉంటాయి. సామ్రాజ్యవాదానికి వ్యతి రేకం ప్రపంచ ప్రజలు పోరాడి దాన్ని ఓడించినప్పుడే యుద్ధాలు ఆగుతాయి. ఆ మార్గంలో ప్రపంచ ప్రజలు పయనించి అమెరికా సామ్రాజ్యవాదాన్ని కూలద్రోయాలి. ●

# విజయవాడ వార్త



## టిడిపి కార్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 16: మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని గోపాలకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీకృష్ణుడు ధర్మానికి అండగా నిలిచి సమాజానికి న్యాయం చేశాడు. శ్రీకృష్ణుడి



గీతా సూత్రాలు యుగయుగాలపాటు మనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. తెలుగుదేశం పార్టీ కూడా అదే మార్గాన్ని అనుసరిస్తోందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో సుపారిపాలన అందిస్తున్నామని, 40 రోజుల్లో సుపారిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా కోట్లాది ప్రజల ఇళ్లను సందర్శించి వారి అభిప్రాయాలను సేకరించామని పేర్కొన్నారు. ప్రజల్లో చంద్రబాబు గారి పాలనపై అపార విశ్వాసం నెలకొందని ఆయన వివరించారు. సూపర్ సిక్స్ హామీలలో 90 అమలు చేయడం ద్వారా ప్రభుత్వ నిబద్ధతను చూపించామన్నారు. ముఖ్యంగా మహిళల కోసం ప్రారంభించిన స్త్రీశక్తి ఉచిత బస్సు సేవ లక్షలాది కుటుంబాలకు ఊరటనిస్తోందని, ఇది మహిళల గౌరవానికి, భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పల్లా స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అణచివేత, అరాచకాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు రాష్ట్రంలో స్వేచ్ఛా వాతావరణం నెలకొని, సంక్షేమం-అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అశోక్ బాబు, నేతలు పరుచూరి కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చిన్నారులకు మిఠాయిలు, పుస్తకాలు పంపిణీ చేశారు..

## సర్దార్ గౌతు లచ్చన్న ఆలోచనలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి : అదనపు కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్

విజయవాడ కార్పొరేషన్, ఆగస్టు 16, ప్రభాతవార్త: సర్దార్ గౌతు లచ్చన్న ఆలోచనలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం కమాండ్ కంట్రోల్ రూం వద్ద గౌతు లచ్చన్నకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు లచ్చన్న



స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా, శ్రామికులకు అండగా నిలిచి, బలహీన వర్గాల ప్రజల అస్థిత్వాన్ని, హక్కులను అందించడానికి పోరాటం చేశారని, ఆయన మాటలు విధానాలు మనకు ప్రేరణ అని, యువత ఆయన ఆలోచనలను, సేవాభావాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సంబంధాల అధికారి డాక్టర్ రజియా షబీనా, వీఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

తిరువూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త : సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్దార్ గౌతు లచ్చన్న



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అందించారు. ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడైన సర్దార్ గౌతు లచ్చన్న బిసిల ఉన్నతికోసం చేసిన పోరాటాలను శ్లాఘించారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ నాయకులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎ కొండూరు ప్రధాన రహదారి చూడతరమా..!

### - పట్టించుకోని సర్పంచ్ అధికారులు

ఎ కొండూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండల కేంద్రంలో జాతీయ రహదారి-30 నుండి ప్రధాన రహదారిపై ఈ వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండటంతో పాదచారులు చుట్టుపక్కల నివసించే ప్రజలు ద్విచక్రవాహన చోదకులు సైక్లిస్ట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రధాన రహదారికి డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో గత ఎన్నో ఏళ్లుగా కచ్చాడ్రైన్‌లో



మురుగునీరు పారుదల లేక దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారడంతో మండల కేంద్రం ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక వర్షాకాలంలో పరిస్థితి చెప్పనలవి కాదు. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఈ వానాకాలం సీజన్‌లో విషజ్వరాలు అంటువ్యాధులు దోమల వల్ల ప్రబలే అవకాశం ఉందని ఇప్పటికైనా ఈ మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి పక్కా డ్రైన్ సౌకర్యం ఏర్పాటు చేసి మురుగు నీరు నిల్వ ఉండకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుని ప్రజారోగ్య పరిరక్షణకు గ్రామ పంచాయతీ సర్పంచ్ అధికారులు వెంటనే స్పందించే విధంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిపివో డీఎల్‌పివో చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు.

## కిడ్నీ ప్రభావిత తండాలో కృష్ణా నీటితో నిండిన ట్యాంకులు

ఎ కొండూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో కిడ్నీ ప్రభావిత గిరిజన తండా గ్రామాల్లో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు ఆర్‌డబ్లు ఎస్ అధికారులు తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సింటెక్ ట్యాంకుల్లో మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలోని సంప్‌వెల్ నుండి



ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తుండటం పట్ల కిడ్నీ డయాలసిస్ బాధితులు ఎంపి చిన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌ల విశేష కృషిని ప్రశంసిస్తున్నారు. ఈ మండలంలో రూ.40కోట్ల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇబ్రహీంపట్నం నుండి జి కొండూరు మైలవరం మీదుగా ఎ కొండూరుకు కృష్ణాజలాల సరఫరా పైప్‌లైన్ పనులు వ ఱ వ ్ర ం ి ం గా సాగుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వ నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గిరిజన మెట్ట ప్రాంతంలో ముఖ్యంగా దళిత గిరిజనులు ఎక్కువగా కిడ్నీ జబ్బుతో బాధపడుతూ వైద్యానికి ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకుని వైద్యం చేయించుకుంటున్న అనేక మంది ఈ మహమ్మారి జబ్బుతో పిట్టల్లా రాలిపోతున్నారు. ఇకనైనా ఈ గిరిజన మెట్ట మండలానికి వెంటనే జలజీవన్ మిషన్ ద్వారా కృష్ణావాటర్ పైప్‌లైన్ పనులు ఈ నెలాఖరుకు వెంటనే పూర్తి చేసి ఇంటింటికి కృష్ణ వాటర్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకుని కిడ్నీ మరణ మృదంగం మృత్యుఘంటికల నుంఇ కాపాడి అనాధలు కాకుండా చూడాలని మండల ప్రాంత గిరిజనులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం: రిజిస్ట్రార్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్15, ప్రభాతవార్త: వర్సిటీలో విద్యార్థులు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ప్రభాతవార్తతో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వర్సిటీలో వసతిగృహాల వద్ద, పరిక్షాభవన్, ప్రిన్సిపాల్స్ ఆఫీస్, హిందీ భవన్, వాణిజ్య భవన్ వంటి ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. వీటిపై పత్రికల్లో వచ్చిన వార్తలకు రిజిస్ట్రార్ స్పందించారు. ఉద్యోగులకు, ఉద్యోగులకు , వసతిగృహాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ చర్యలు తీసుకున్నామన్నారు. వర్షాల వల్ల వచ్చిన అసౌకర్యాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. వర్షం నీరు నిలువకుండ తగు జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఇందులో నిధుల దుబారాపై వస్తున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. కాగా శుక్రవారం ఇన్‌చార్జి వీసి ఆచార్య గంగాధరరావు, ఇంజనీర్ కుమార్‌రాజా లు వర్సిటీలో కలియతిరిగారు. ఎక్కడెక్కడ నీరు నిలిచింది, వసతిగృహాల్లో ప్రస్తుత పరిస్థితులు, విద్యార్థుల సౌకర్యాలపై సమీక్ష చేసినట్లు తెలిసింది.



## శ్రీగురుధామ్‌లో 'నేను లేను' గ్రంథావిష్కరణ

జగ్గయ్యపేట, ఆగస్టు 16, ప్రభాతవార్త :ప్రఖ్యాత సద్గురు నిసర్గదత్త మహరాజ్ వారి ధ్యానములు అనే పుస్తకంపై చేసిన సత్సంగ ప్రవచనాలతో రూపొందించిన " నేను లేను" గ్రంథ ప్రధమ భాగాన్ని శనివారం ప్రముఖ తాత్వికులు, డాక్టర్ అబ్దుల్‌కలాం అంతర్జాతీయ పురస్కార గ్రహీత గెంటేల వెంకటరమణ ఆవిష్కరించారు. జగ్గయ్యపేట మండలం బలుసుపాడు శ్రీగురుధామ్‌లో శనివారం జరిగిన సత్సంగ కార్యక్రమంలో ఈవేడుక నిర్వహించారు. అరుణాచల శ్రీరమణమహర్షి భోదనలపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేసిన సద్గురు నిసర్గదత్త మహరాజ్ వెలువరించిన ధ్యానములు అనే పుస్తకంపై వెంకటరమణ శ్రీగురుధామ్‌లో ప్రతి ఆదివారం సత్సంగ ప్రవచనాలు నిర్వహించారు.



ఈక్రమంలో 64 శీర్షికలతో శివానంద సుపథ ఫౌండేషన్ ముద్రించిన ' నేను లేను" గ్రంథాన్ని వెంకటరమణ-వసంతలక్ష్మి గురు దంపతులు ఆవిష్కరిస్తూ ఇందుకు సహకరించిన బాణాల రవికిరణ్, గెంటేల భరత్‌కుమార్‌లకు గ్రంథాన్ని సభలో బహూకరించారు. ఈకార్యక్రమంలో ఆనంద శంకర-హర్షిత దంపతులు కూడా పాల్గొన్నారు.

### శ్రీగురుధామ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు గెంటేల వెంకటరమణ-వసంతలక్ష్మి గురు దంపతులు శ్రీశివానందగురు ఎడ్యుకేషనల్, కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రత్యేక పూజలు, సద్గురు ఆరాధన, పల్లకీసేవ, ఉట్టి కొట్టు కార్యక్రమానులను వైభవంగా నిర్వహించారు. ఉట్టి కొట్టిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కృష్ణ అంటే ఆకర్షణ, సంపూర్ణ ప్రేమ అనే అర్థాలు ఉన్నాయని, ఉన్నదాన్ని నాది అని భావించకుండా అందరిది, అది పరమాత్మది అని భావించటమే కృష్ణతత్వమని విశ్లేషించారు.

## యంగ్ సైంటిస్ట్‌లకు మంత్రి లోకేష్ ప్రశంస

గుంటూరు విద్య, ఆగష్టు 16, ప్రభాతవార్త : స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లోజరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇస్రో వారిచే యంగ్ సైంటిస్ట్ అవార్డు పొందినటువంటి విద్యార్థులు పక్కపట్ల సోమశేఖర్, కేకేఆర్ గౌతమ్ స్కూల్ గుంటూరు, సందు పవన్ దుర్గ జడ్పిహెచ్‌ఎస్ ముట్లూరు, కలారి లావణ్య, శ్రీచైతన్య పబ్లిక్ స్కూల్ గుంటూరు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు గైడ్ టీచర్ అయిన వి.ఎస్.రామాంజనేయులను అభినందించారు. ప్రతిభావంతులైన ఆయా విద్యార్థులకు ప్రశంసల జల్లు కురిపించారు. కార్యక్రమంలో మంత్రి లోకేష్ తోపాటు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, విద్యాశాఖాధికారి సి.వి.రేణుక, ఎంఈవో ఖుద్దూస్, విద్యార్థుల్ని గైడ్ టీచర్ వి.ఎస్.రామాంజనేయులు ని అభినందించారు.



## స్వాతంత్ర్య సమరయోధులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి

గుంటూరు విద్య, ఆగష్టు 16, ప్రభాతవార్త : స్వాతంత్ర దినోత్సవం నాడు దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులందర్ని స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలని శ్రీమేధ విద్యాసంస్థల డైరెక్టర్ అన్నా నందికిషోర్ అన్నారు. స్థానిక కొత్తపేట క్యాంపస్‌లో జెండా వందనం అనంతరం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలంగా మనకి సిద్ధించిన స్వాతంత్ర్యాని సాఫల్యం చేసుకుంటూ పేదరికం, అజ్ఞానం, అవినీతి, అసమానతల నుండి ప్రజలకు విముక్తి కల్పించి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం మనందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో శ్రీమేధ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## బలహీనవర్గాల ఆరాధ్యదైవం గౌతు లచ్చన్న

విజయవాడ, ఆగష్టు 16, ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోధుడు రైతుబాంధవుడు అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న బడుగు బలహీన వర్గాలు ఆరాధ్యదైవంగా భావిస్తారని ఆంధ్రప్రదేశ్ బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు కొనియాడారు. విశాఖ జిల్లా గ్రీన్‌పార్క్ హోటల్ కూడలిలో నిర్వహించిన సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎసిపి కె.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ జై ఆంధ్ర ఉద్యమం చేపట్టి పరిపాలన సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఆవశ్యకతను ఆనాడే గుర్తించి పోరాడిన నాయకుడు గౌతు లచ్చన్న అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.



## సుప్రీంకోర్టులో ఆరుగురు ఏఎన్‌యు ప్రొఫెసర్లకు ఊరట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్15, ప్రభాతవార్త: వర్సిటీలో ప్రొఫెసర్‌లుగా విధులు నిర్వహిస్తున్న వారిలో 6గురికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2018లో వీరు ఏఎన్‌యులో ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇంటర్వ్యూలు పూర్తయ్యేలోగానే ఇంటర్వ్యూల ఫలితాలను ప్రకటించవద్దని హైకోర్టు నుంచి వర్సిటీకి ఆదేశాలు వచ్చాయి. వర్సిటీ కోర్టు ఆదేశాలను అమలుచేసింది. అయితే ఇంటర్వ్యూలకు హాజరైన వారు హైకోర్టు ఆర్డర్‌పై పిటిషన్ వేశారు. వారి పిటీషన్‌ను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పుఇచ్చింది. అయితే హైకోర్టు కొన్ని నిబంధనలు విధించింది. హైకోర్టు ఆదేశాలతో వర్సిటీలో 8మంది ప్రొఫెసర్‌లుగా ఉద్యోగాలు పొందారు. ఆతరువాత కొన్ని తమకు కోర్టు నిబంధనలు తొలగించాలని ప్రొఫెసర్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వాదనలు ప్రతివాదనలు విన్న సుప్రీంకోర్టు గత వారం వర్సిటీల్లోని ప్రొఫసర్‌లకు అనుకూలంగా తీర్పుఇచ్చింది. ఇందులో 2018 నుంచి ఇప్పటి వరకు ఎటువంటి బ్రేక్ ఇవ్వకుండా ప్రొఫెసర్‌ల సర్వీస్‌ను అమలుచేయాలని ఆదేశించింది. దీంతో ఆచార్య నాగార్జున, కృష్ణా, జెఎన్‌టియు అనంతపురం, రాయలసీయ వర్సిటీలలో ఉన్న 18మంది ప్రొఫెసర్‌లకు ఊరట లభించింది. ఆచార్య నాగార్జున నుంచి ఉన్న 8మందిలో ఒకరు ఉద్యోగ విరమణ చేయగా, మరొకరు సుప్రీకోర్టును ఆశ్రయించలేదని తెలిసింది.

## తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 16: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు ప్రజల పోరాట యోధుడు గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి ఆదేశానుసారం సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతల ఆధ్వర్యంగా ఘనంగా నిర్వహించారు.



ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వెనుకబడిన ప్రాంతం నుంచి వచ్చిన గౌతు లచ్చన్న నాడు ఈ దేశం కోసం అ రోజు ఉన్న పరిస్థితుల బట్టి అ పాలకులను ఎదురించి భనిసా సంకెళ్ల నుంచి విముక్తి కలిగించాలనే ఉద్దేశ్యంతో జాతి గౌరవించే విధంగా ఆయన చేసిన పోరాటాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎవరైతే దేశం కోసం.. సమాజం కోసం పోరాటం చేస్తారో.. వారు ఎప్పటికి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు సర్దార్ గౌతు లచ్చన్న సేవలను గుర్తించి భవిష్యత్తు తరాలకు వారి పోరాటాలు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రవ్యాప్తంగా గౌతు లచ్చన్న జయంతి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఘనంగా స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాకుండా స్వాతంత్రం అనంతరం వెనుకబడిన వర్గాల హక్కుల కోసం కూడా జీవితాంతం పోరాడిన నాయకుడని గుర్తుచేశారు. ఆయన త్యాగస్ఫూర్తి, ప్రజాసంకల్పం నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. గౌతు లచ్చన్న ఆశయాలు, ఆయన కలల సమాజం సాధనకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తుందని పల్లా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవులు గారు, తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి ఆశోక్ బాబు గారు, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు, తాళ్ల వెంకటేష్ యాదవ్, పర్చూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసార మాధ్యమాల్లో బెదిరించడం..ఎమ్మెల్యే స్థాయికి తగదు..

ఎ కొండూరు, ఆగష్టు 16, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరులోని ఇటీవల జరిగిన గిరిజన ఉత్సవ కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణావాటర్ అందడం లేదని కొందరు చేసిన విమర్శను తట్టుకోలేని ఎమ్మెల్యే ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలను జీర్ణించుకోలేక తప్పుడు కథనాలు ప్రసారం చేసే వారిని చెప్పు తెగేదాక కొడతానని కలెక్టర్ సాక్షిగా బెదిరింపులకు దిగడం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే స్థాయికి తగదని ఎమ్మెల్యే స్థాయిని మర్చి సమస్యలు ప్రశ్నించే వారిని చెప్పుతో దాడి చేస్తానని బెదిరించడాన్ని తిరువూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు శనివారం చీమలపాడు స్వగృహంలో చీమలపాడు స్వగృహంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కిడ్నీ రోగులు అధికంగా ఉన్న ఈ మండలంలో జలజీవన్ మిషన్ పథకం పైప్‌లైన్ పనులు పూర్తయ్యే వరకు కృష్ణావాటర్ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా బాధితులకు అందించే లక్ష్యంతో రూ.1.60 కోటి ట్రాక్టర్ల ద్వారా 27 ట్రిప్పులతో కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కృష్ణా వాటర్ సరఫరా నిలిచిపోయిన విషయాన్ని తెలుసుకోకుండా ఎమ్మెల్యే బెదిరింపు ధోరణి, గతంలో కూడా మట్టితోలకాలు ఇంకా ఇతర సమస్యలపై ప్రశ్నించే వారిని జర్నలిస్టులను సైతం ఇంటికి వెళ్లి గుడ్డలూడదీసి కొడతానని దూషించడం పత్రికా స్వేచ్ఛను హరించడం దాడి చేయడమేమని జెఎస్‌పి కన్వీనర్ ఎం శ్రీనివాసరావు ఖండించారు.



## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరువద్దు..

### పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ శంకర్

ఎ కొండూరు, ఆగష్టు 16, ప్రభాతవార్త :ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలోని పిఎసిఎస్ (సింగిల్ విండో) వద్ద విజయవాడ ఎంపి కేశినేని చిన్ని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇటీవల నియమించబడ్డ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ బెజవాడ శంకర్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నాయకులు కార్యకర్తలు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా త్రిసభ్య కమిటీ ఛైర్మన్ శంకర్ మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలంతో మనకు సిద్ధించిన భారత దేశ స్వాతంత్ర్యాన్ని దేశ సమగ్రత సార్వభౌమధికారాన్ని కాపాడుకోవాలని ఆ త్యాగధనుల స్ఫూర్తి మన భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని ముఖ్యంగా యువత నిరంతర కృషి సల్పాలని శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండెపాటి వెంకట సుబ్బారావు కార్యదర్శి జంగా స్టాలిన్ మండల మైనార్టీ లీడర్ ఎస్‌కె ఆదాం షరీఫ్ ఎస్‌కు సుభాని బెజవాడ ఆదిశేషు, సింహాద్రి సత్యం పిఎసిఎస్ సిఈవో ఎలుగు కుటుంబరావు ఎండి ఇస్మాయిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు స్వీట్లు చాక్లెట్లు పంపిణీ చేశారు. ముందుగా జాతీయ పతాకావిష్కరణ చేశారు.



## కృష్ణాష్టమి వేడుకల్లో ప్రసాద వితరణ

విజయవాడ, ఆగష్టు 16, ప్రభాతవార్త : జయహో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పైపుల రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద భక్తులకు పులిహోర మైసూర్‌పాక్, జాంగ్రీ ప్రసాద వితరణ చేశారు. ఇలాగే ప్రతి సందర్భానికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని జయహో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొల్లా జయశ్రీ తెలియచేశారు. సెక్రటరీ సిహెచ్ రమాదేవి ఈ కార్యక్రమానికి సహకారం అందచేశారు.



## విలువలతో కూడిన విద్య అవసరం: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

విజయవాడ, ఆగష్టు 16, ప్రభాతవార్త :విద్యార్థి దశలో కొన్నిటిని త్యాగాలు చేసి చదువుపైనే పూర్తి సమయాన్ని కేటాయిస్తే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరడం సాధ్యమవుతుందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ అన్నారు. సమాజంలో ప్రస్తుతం విద్యార్థులు సమయాన్ని అధికంగా వృధా చేస్తున్నారని దీనివల్ల అనుకున్న లక్ష్యాన్ని సాధించడం కష్టసాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్లో శారద విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ వై రమేష్‌బాబు అధ్యక్షత వహించిన శారద విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్‌లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన విద్యార్థులు సోషల్ మీడియా సెల్‌ఫోన్లు వంటి వాటికి కొంతమేర దూరంగా ఉంటూ తల్లిదండ్రులు అధ్యాపకులు సహాయ సహకారాలతో విద్యపట్ల ధృఢ సంకల్పంతో మంచి చెడులను దృష్టిలో పెట్టుకొని అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు, కళాశాల ఎండి వై శారదాదేవి వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు అద్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## శ్రీకృష్ణాష్టమి వేడుకలు - బాల గోకులం

గుంటూరు కల్చరల్, ఆగష్టు 16, ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణ వేదికపై సంస్కార భారతి ఇండ్ల శ్రీధర్ బాబు బృందం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు భగవత్ గీత శ్లోకాలు, చిత్రలేఖనం, కోలాట బృంద నృత్యాలు, భాగ వతరం క్విజ్, కృష్ణ శతకం వ్రాత పరీక్ష, శ్రీకృష్ణ రుక్మిణి, సత్యభామ పోటీలను నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులతో ఆలయ ప్రాంగణం కళ కళ లాడింది.


వార్త VAARTHA CLASSIFIEDS

**PROPERTY**

★ 2 BHK Delux Flat with Carparking 1250 Sqft 1st Floor East Facing for Sale Sampoorna Residency, Rajula Bazar, Ramavarapadu, VIJ Cont # 9866333734

(Ro.No.16425)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# పల్నాడు జిల్లా వార్త



## వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పిడుగురాళ్ళ, ఆగస్టు 16 ప్రభాతవార్తః పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, దేవస్థాన అధ్యక్షుడు ఏలూరి చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శి కొల్లిశెట్టి సుబ్బారావు, కోశాధికారి కొత్త లక్ష్మీనారాయణ, కొత్త వెంకట సుబ్బారావు ఉట్టి కొట్టారు. యాదవ వర్గీయులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వెంకట సుబ్బారావు మాట్లాడుతూ శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి పాలకవర్గ సభ్యులను



అభినం దించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్న యువకు లను అభినందించారు. ప్రతి సంవత్సరం ఇదే ఉత్సాహంతో ఆనందోత్సవాల మధ్య శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు అధికంగా పాల్గొన్నారు.

## మాడుగులలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



గురజాల, ఆగస్టు 16 ప్రభాతవార్తః మండలంలోని మాడుగుల గ్రామంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఎంపీపీ చలమయ్య ఆధ్వర్యాన యాదవ్ యూత్ గ్రామంలోని రామాలయం సెంటర్లో ఉట్టి కొట్టి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా బీసీ అధ్యక్షుడు సిద్దవరపు గాంధీ, యాదవ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చర్లగుడిపాడు గ్రామంలోనూ శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.

## స్త్రీ శక్తి పథకంతో మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అండ : నాగోతు శౌరయ్య

నకరికల్లు, ఆగస్టు 16 ప్రభాతవార్త : స్త్రీ శక్తి పథకంతో మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆర్థికభారం ఉన్నప్పటికీ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంచుతుందన్నారు. ఉద్యోగాలు చేసే వారికి, చిరు వ్యాపారులకు, వ్యవసాయ కార్మికులకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుందన్నారు. కనీసం నెలకు ఒక్కొక్క మహిళకు రూ.2 వేలకు పైగానే ఆర్థికభారం తగ్గుతుందన్నారు. మహిళల సాధికారత కోసం ఆస్తిలో సమాన హక్కు తెచ్చిన ఘనత



తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 15 నెలలకే అన్ని పథకాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ నిబద్ధతకు అద్దం పడుతుందన్నారు. పల్లె వెలుగు బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులలో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని, ప్రతి ఆడబిడ్డ కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు.

## ఏపి లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన వైకాపా నాయకులు

నరసరావుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : ఏపి లెజిస్లేటివ్ కౌన్సిల్ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని శనివారం పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర, జిల్లా పార్టీ అనుబంధ సంఘాలలో ఎన్నికైనవారిని ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయనకు పరిచయం చేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. మాజీ సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఖచ్చితంగా మరోసారి ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్



మోహన్‌రెడ్డి వస్తా_రన్నారు. ప్రజలకు మంచి చేసేందుకు ఆయన వెంటే అన్నివర్గాల ప్రజలు ఉంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు పార్టీ నాయకులు యన్నం రాధాకృష్ణారెడ్డి, షేక్.ఖాజావలి మాస్టరు, కనకా పుల్లారెడ్డి, ఎన్.కె.ఆంజనేయులు, పాలపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణిలో ఏఐ పై అవగాహన సదస్సు

నరసరావుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఏఐతో వస్తున్నటువంటి విప్లవాత్మకమైనటువంటి మార్పులను ఎడ్యు-9 అండ్ ఎడ్యుటెక్ ప్రతినిధులు మేఘన తెలియజేశారు. బెంగుళూరుకు చెందిన సంస్థ ప్రతినిధులు ఏఐతో ఉన్నటువంటి ఉపయోగాలను తెలియజేశారు. అదే విధంగా మిషన్ లెర్నింగ్, ఎలా అప్లయ్ చేస్తాం అనే విషయాలను వివరించారు. నిత్య జీవితంలో ఏఐ పాత్ర ఏమిటి, భవిష్యత్తు ఎలా ఉండబోతుంది, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయి, ఏఐతో ఎలా అప్‌డేట్ అవ్వాలి తదితర అంశాలను ఈ సందర్భంగా వివరించారు.



## గీతమ్స్...లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

వినుకొండ,ఆగస్టు16,ప్రభాతవార్త: పట్టణంలోని పల్నాడు రోడ్డు నందు గల గీతమ్స్ బ్లూమ్స్ స్కూల్ నందు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంటెడ్ మాలపాటి కోటిరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులకు కృష్ణుడి జనన విశేషాలు, గొప్పతనం గురించి కోటిరెడ్డి వివరించారు. చిన్నారులు కృష్ణుడు,గోపికల వేషధారణలతో అలరించారు. కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక చేసి ఉట్టికొట్టే కార్యక్రమం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

యడ్లపాడు, ఆగస్టు 16, ప్రభాతవార్త : కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా పలు వేణుగోపాలస్వామి దేవాలయాలు భక్తులతో శనివారం రద్దీగా మారాయి. మండల పరిధిలోని పలుగ్రామలలోని దేవాలయాలతోపాటు చరిత్ర ప్రసిద్ధి చెందిక చెంఘీస్కాన్‌పేట గ్రామంలోని శ్రీ వెన్నముద్దల వేణుగోపాలస్వామి దేవాలయంలో భక్తులు అధికంగా పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు అలయ అర్చకులు పరుచూరి సత్యనారాయణాచార్యులు తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో పారాయణ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు మోదికారం, అటుకులు, వెన్న ప్రసాదంగా అందజేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం అనంతరం అలయ ప్రాంగణంలో ఉట్టి మహోత్సవాన్ని ఏర్పాటుచేయగా గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## మీ కోసం... కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి : కలెక్టర్

నరసరావుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : కలెక్టరేట్‌లో ఈ నెల 18వతేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం తెలియజేశారు. ఫిర్యాదుదారులు 1100 సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు పరిష్కారం కాకపోతే లేదా తమ ఫిర్యాదులకు సంబంధించి సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు తమ సమస్యలను తెలియజేయడానికి మీ కోసం డాట్ ఏపి డాట్ జిఓవి డాట్ ఇన్ అనే వెబ్‌సైట్ నందు అవకాశం ఉందని, వినియోగించుకోవాలన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పరిష్కార వేదిక కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అర్జీలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాని అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించి రశీదులను వెంట తెచ్చుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు.



## జిల్లా ఎస్పీ కార్యాలయంలో సర్దార్ గౌతులచ్చన్న జయంతి

నరసరావుపేట క్రైం, ఆగస్టు 16 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్దార్ గౌతులచ్చన్న జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్దార్ అనే గౌరవాన్ని ఆయన పొందడం విశేషమన్నారు. సాహసానికి మారు పేరు అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత సమాజంపై ఆయన విశేషమైన ప్రభావాన్ని చూపారని తెలియజేశారు. వారి స్ఫూర్తిని భవిష్యత్తు తరాలు కొనసాగించాలన్నారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ ఎస్పీ జె.వి.సంతోష్, ఏఆర్ డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఆర్.ఐ. ఎస్.కృష్ణ, యువరాజ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## సర్దార్ గౌతులచ్చన్న స్ఫూర్తిని కొనసాగిస్తాం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : సర్దార్ గౌతులచ్చన్న స్ఫూర్తిని కొనసాగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గౌతులచ్చన్న 116వ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరై మాట్లాడారు.




సమాజంలో కులం కాదని గుణం కావాలన్నారు. మతం కాదని మానవత్వం ఉండాల న్నారు. శ్రీకాకుళం జిల్లాలోని చిన్న గ్రామంలో జన్మించి గాంధీజీ పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుకు వెళ్ళారని తెలిపారు. అంటరానితన నిర్మూలన కోసం పోరాడారని తెలిపారు. ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారని, విద్యుత్ కార్మికశాఖామంత్రిగా ఆయన పని చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు, రైతులకు, యువతకు, విద్యార్థులకు, బలహీన వర్గాలవారికి అండగా నిలిచామన్నారు. కార్యక్రమంలో తొలుత గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, జిల్లా అధికారులు శ్రీనివాసరావు, సురేష్, బిసి సంఘాల నాయకులు మురళీ తదితరులు పాల్గొన్నారు.

## వీరవట్నంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సికేర్ హాస్పటల్ ఉచిత కంటి వైద్య శిబిరం



రొంపిచర్ల, ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలోని వీరవట్నం గ్రామంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ప్రారంభించారు. డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. డైరెక్టర్లు డాక్టర్ ఏవీవి రామలింగారెడ్డి, డాక్టర్ సరస్వతీ, డాక్టర్ ఎం.చెంచిరెడ్డి, డాక్టర్ శాంతిశ్రీ, కోఆర్డినేటర్ వీరయ్యలు నిర్వహిస్తున్న సేవలకు అభినందనలు తెలిపారు. శిబిరంలో 220 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 42 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 57 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళను అందజేశారు. శిబిరంలో డాక్టర్ బత్తుల మల్లేష్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ హరీష్, డాక్టర్ రమ్య పాల్గొని వైద్యసేవలను అందించారు.

## చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్

రొంపిచర్ల, ఆగస్టు 16 ప్రభాతవార్త : రొంపిచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను ఎస్.ఐ. సి.హెచ్.మణికృష్ణ విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. సంతగుడిపాడు గ్రామానికి చెందిన నామాల మీన, ప్రసన్నరెడ్డి ఇంట్లో ఏప్రిల్ 23 నుండి మే 1వతేదీ వరకు ఎవరూ లేరు. ఈ నేపథ్యంలో గాలం రాజేష్ అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి రూ.2 లక్షల విలువైన బంగారాన్ని, రూ.లక్ష విలువైన ద్విచక్ర వాహనాన్ని, రూ.11.97 లక్షల నగదు దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్.ఐ. మణికృష్ణ తెలిపారు. ఎస్.ఐ.మణికృష్ణతో పాటు సిబ్బందిని ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందించారు.



## డాక్టర్ ఎం.వి.రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




నరసరావుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : డాక్టర్ ఎం.వి.రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేశారు. ఛైర్మన్ డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి, డాక్టర్ ఎం.సృజన ఈ సందర్భంగా మాట్లాడారు. కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలను నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. శుక్లములు, నీటికాసులు, ఇతర శస్త్ర చికిత్సలు ఎన్టీఆర్ వైద్యసేవలో భాగంగా ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు ఆరోగ్య భీమా సంస్థలకు సంబంధించి నగదు రహిత వైద్యసేవలను అందిస్తున్నట్లు వివరించారు. క్యాటరాక్ట్, గ్లాకోమా, ఆక్యులోప్లాస్టీ తదితర వైద్యసేవలను ప్రత్యేక వైద్య నిపుణులతో అందిస్తున్నట్లు వారు తెలియజేశారు. వైద్య శిబిరానికి సహకారం అందజేసిన ఇస్కాన్ ఆలయ కమిటీకి కృతజ్ఞతలను తెలియజేశారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చీఫ్‌విప్ జీ.వీ.,డీసీసీబీ చైర్మన్ మక్కెన

వినుకొండ,ఆగస్టు16,ప్రభాతవార్త: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని స్థానిక వెల్లటూరు రోడ్డు నందు గల సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొన్నారు.



స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణుడు లోకానికి శాంతి,ప్రేమ,సౌభాగ్యాన్ని అందించారని ప్రతి ఒక్కరిపై ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నలుగురు కోత ముక్క నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

యడ్లపాడు, అగస్టు 16, ప్రభతవార్త : మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామ శివారులో కోతముక్క ఆడుతున్న వారిపై శనివారం దాడులు నిర్వహించారు. దాడికి సంబంధించి ఎస్సై టి శివరామకృష్ణ వివరిస్తూ విశ్వసనీయ సమాచారం మేరకు అకస్మిక దాడులు నిర్వహించటం జరిగిందని, ఇందులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి మొత్తం 19200నగదును స్వాదీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. అసాంఘీక కార్యకలాపాల్లో పాల్గొనవద్దని, ఎవరైనా ఇలాంటి అక్రమ చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



## మానసిక స్థితి క్షీణించే జగన్ జాతీయ పతాకాన్ని అవమానించారు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలన రోజురోజుకి ప్రజల్లో పెరుగుతున్న చంద్రబాబు ప్రతిష్ట, తాజాగా స్త్రీశక్తి పథకం అమలుతో ప్రజా ప్రభుత్వానికి లభిస్తున్న మహిళల ప్రసంశలతో జగన్‌కు దిక్కు తోచడంలేదని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికలలో టిడిపి విజయం, సూపర్-6, సూపర్‌డూపర్ సక్సెస్‌తో జగన్ మానసికి స్థితి పూర్తిగా క్షీణించిందని అన్నారు. మతిస్థిమితం కోల్పోయిన భావనలో ఉండబట్టే మాజీముఖ్యమంత్రి తానొక భారతీయుడినని, తనకు తన దేశానికి ఆగస్టు 15 నాడే స్వాతంత్ర్యం లభించిందనే నగ్న సత్యాన్ని విస్మరించాడని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు పసిపిల్లలు మొదలు వయోభారంతో సరిగ్గా కదల్లేని వృద్ధుల వరకు ఓపిక తెచ్చుకొని మరీ తమ దేశభక్తిని చాటుకున్నారు.



దేశభక్తిని చాటే నినాదాలు చేయకపోయినా కనీసం జాతీయపతాకానికి నమస్కరించి భారతమాతను స్మరించుకున్నారు. అందుకు కారణం తాము భారతీయులమనే గొప్ప భావన, మరియు తమ దేశం చాలా గొప్పదని, ఎందరో అమరవీరుల త్యాగాలవల్లే తమకు నేడు స్వేచ్ఛా వాయువులు లభించాయనే గౌరవంతో కూడిన ఉన్నతమైన భావనతో చేశామని అన్నారు. కానీ రాష్ట్రాన్ని ఐదేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, ఒక రాజకీయ పార్టీకి అధినేత, ప్రస్తుతం పులివెందుల నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన జగన్ మాత్రం స్వాతంత్ర్య దినోత్సవాన జాతీయ జెండాను అగౌరపరిచాడని ప్రత్తిపాటి తెలిపారు. భారతీయుడిననే విషయం మరిచిపోయి తాను పుట్టిన గడ్డను, తనకు గుర్తింపు అందించిన భరతమాతను విస్మరించి క్షమించరాని తప్పు చేశాడని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయజెండాకు వందనం చేయని వ్యక్తి అసలు భారతీయుడైనా అనే సందేహం ప్రతి ఒక్కరికి కలుగుతుందని అన్నారు. గొప్ప గొప్ప స్థానాలలో ఉన్నవారు, ఇతరదేశాల అధినేతలు కూడా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అమితంగా అభిమానిస్తారని అన్నారు. అటువంటిది ఈ దేశంలో పుట్టి, చట్ట సభలకు ప్రతినిధ్యం వహించి, ప్రజా ప్రతినిధిగా ఉన్న జగన్‌మాత్రం జడ్‌పిటిసి ఉప ఎన్నికలలో ప్రజలు తనను ఓడించారనే అక్కసుతో భరతమాతను అవమానించాడని ప్రత్తిపాటి తెలిపారు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించలేని వ్యక్తి అసలు నాయకుడెలా అవుతాడో జగన్ చెప్పాలన్నారు. రాజకీయాలలో ఉన్నతస్థాయి, పతనస్థాయి రెండు సహజమని అన్నారు. తలపండిన, కొమ్ములు తిరిగిన బడాబడా రాజకీయ నాయకులే ప్రజల నాడి గ్రహించలేక బొక్కబోర్లాపడిన ఉదంతాలు చరిత్రలో అనేకం ఉన్నాయని అన్నారు. అటువంటిది తనకు తానే సుప్రీంగా భావించే జగన్ మాత్రం తనకు ఓటమే లేదన్నట్లు అధికారంలో ఉన్నంతకాలం విర్రవీగాడని ప్రత్తిపాటి తెలిపారు. తాజా ఉప ఎన్నికలలో తన నియోజకవర్గ ప్రజలు కొట్టిన చావుదెబ్బకు మతిభ్రమించి చివరకు జాతీయ పతాకాన్ని అవమానించే దుస్థితికి దిగజారాడని అన్నారు. పూటకో కట్టుకథ, రోజుకో మోసంతో ప్రజలను ఎల్లకాలం నమ్మించే ప్రయత్నం చేసే జగన్ ఇప్పటికైనా అహంకారం తగ్గించుకొని జనామోద రాజకీయం చేస్తే బాగుంటుందని ప్రత్తిపాటి సూచించారు.

## సిఎం సహాయనిధి చెక్కుల అందజేత



చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన 26మంది లబ్దిదారులకు రూ 14.26లక్షల విలువైన ముఖ్యమంత్రి సహయనిధి చెక్కులను మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తన నివాసంలో శనివారం అందచేశారు. వివిధరకాల అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాదపడుతున్నవారు. వారి కుటుంబసభ్యులు ప్రత్తిపాటి చేతులమీదుగా చెక్కులు స్వీకరించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే ప్రత్తిపాటికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్‌మోహన్, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రూ.2.44లక్షలు విలువైన గంజాయి, బంగారం స్వాధీనం

### -కేసులను ఛేదించిన సిఐ సుబ్బనాయుడును అభినందించిన జిల్లా ఎస్పీ

చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: చిలకలూరిపేట మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాల వినియోగాన్ని అరికట్టేందుకు పల్నాడు జిల్లా పోలీసులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భారీ విజయం సాదించారు. గంజాయి అక్రమంగా అమ్ముతున్న 7గురితోపాటు, గంజాయి తాగుతున్న 11మందిని చిలకలూరిపేట రూరల్ సిఐ బి సుబ్బనాయుడు ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి రూ 2.44లక్షల విలువైన 2.44 కిలోల గంజాయి, రూ 3,500 నగదు, 5సెల్‌ఫోన్‌లు, షుమారు 117 గ్రాముల బంగారు అభరణాలు స్వాధినం చేసుకున్నట్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట ఇన్‌చార్జి డిఎస్‌పి యం హనుమంతరావు విలేకరులకు తెలియచేశారు. పల్నాడు జిల్లా ఎస్‌పి ఆర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట ఇన్‌చార్జి డిఎస్‌పి యం హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సిఐ బి సుబ్బనాయుడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. చిలకలూరిపేట, నాదెండ్ల మరియు పరిసర ప్రాంతాలలో గంజాయి అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో నాదెండ్ల ఎస్ఐ జి పుల్లారావుకు అందిన పక్కా సమాచారంతో పోలీసులు గణపవరం గ్రామంలోని ప్రసన్నవంశీకృష్ణ స్పిన్నింగ్ మిల్లు వద్ద కొంతమందిపై దాడీచేశారు. అక్కడ గంజాయి అమ్ముతున్న 4గురు వ్యక్తులు, కొనుగోలు చేస్తున్న 11మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన నిందితులలో గంజాయి వ్యాపారం చేస్తున్న అన్నంరాజు ఈశ్వర సాయికుమార్, నేలపాటి ఠాగూర్, షేక్ హుస్సేన్ భాషా, షేక్ అస్పిన్‌భాషా, షేక్ బాజీ, పల్లపు నాగ మరియు మరొకరిని పోలీసులు గుర్తించారు. వీరిలో కొందరిపై గతంలో హత్యా, గంజాయి రవాణా, హత్యాయత్నం వంటి కేసులు ఉన్నట్లు డిఎస్‌పి వివరించారు. అలాగే గంజాయి తాగుతున్న కె రవితేజ, నేలం సూర్య, పల్లపు కళ్యాణకుమార్, తెప్పలి వెంకటేష్, జి సురేష్, ఎస్ ప్రవీణ్‌కుమార్, షేక్ జాన్‌భాషా, శొంఠినేని పవన్‌కళ్యాణ్, పులగం సాయి వెంకటేష్, నక్కల ఏసుబాబు, నాగండ్ల ఆదిత్యపండు మరియు మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి సుబ్బనాయుడు, నాదెండ్ల ఎస్ఐ జి పుల్లారావుతో పాటు ఎఎస్‌ఐలు డి రోశిబాబు, జివి సుబ్బారావు, పి రమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు కె దేవరాజు, జె శ్రీధర్, ప్రసాద్, అనిల్‌కుమార్, వెంకట్రావు,కానిస్టేబుళ్లు యం ఇర్మియా, శివప్రసాద్, గౌతం, కిషోర్, విద్యాసాగర్, రత్నకిషోర్, రంగానాయక్, హోమ్‌గార్డ్ కె మధుబాబులను జిల్లా ఎస్‌పి కె శ్రీనివాసరావు అభినందించారు.



## ఉప్పాల భాస్కరరావుకు ఘనసత్కారం

చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం అధికార లాంఛనాలతో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతులచ్చన్న 116వ జయంతి కార్యక్రమాన్ని శనివారం



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నరసరావుపేట శాసనసభ్యుడు చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. కాగా చిలకలూరిపేట మహాత్మా జ్యోతిరావుపూలే సేవాసంఘం అధ్యక్షుడు,బిజెపి నాయకుడు ఉప్పాల భాస్కరరావు ను ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సత్కరించి, జ్యోతిరావు పూలే సంఘం తరుపున చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు.

## ఎండోస్కోపి ద్వారా 16 రాళ్ల తొలగింపు



చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: పట్టణంలోని జానకీ నర్సింగ్‌హోంలో ఉన్న బలరామకృష్ణ గ్యాస్ట్రో సెంటర్‌లో శనివారం అరుదైన చికిత్స జరిగింది. కడుపునొప్పి, కామెర్లతో బాధపడుతున్న 60 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తికి ఆసుపత్రి వైద్య నిపుణులు బలరామకృష్ణ తేజస్వీ ఈ చికిత్స చేశారు. రోగికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా పసరుతిత్తిలో, పసరుపేగులో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆధునిక చికిత్స విధానమైన ఎండోస్కోపి ద్వారా ఎలాంటి శస్త్ర చికిత్స లేకుండా రాళ్లను తొలగించారు. దాదాపు 15 రాళ్లను తొలగించినట్లు డాక్టర్ బలరామకృష్ణ తేజస్వీ తెలిపారు. అనంతరం రోగి తన వ్యాధినుంచి ఉపశమనం పొందినట్లు తెలిపారు. స్దానికంగా ఇలాంటి కేసుకు చికిత్స చేసిన డాక్టర్ బలరామకృష్ణ తేజస్వీనిని స్దానిక వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

## పట్టణ తెలుగు యువత, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం కమిటీల ఎన్నిక

చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్దాగత ఎన్నికలలో బాగంగా నియోజకవర్గస్దాయి, పట్టణస్దాయి, మండలస్దాయి కార్యవర్గాల ఎన్నికల ప్రక్రియను గత కొద్ది



రోజులుగా పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్నారు. దీనిలో బాగంగా తెలుగుయువత పట్టణ అధ్యక్షులుగా బొబ్బిళ్ల ప్రసాద్ (నిమ్మకాయల ప్రసాద్), ప్రధాన కార్యదర్శిగా షేక్ కరిముల్లా ( జిసి కరిముల్లా)లను ఎన్నుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా షేక్ షఫీ ఉజ్మా, ఉపాధ్యాక్షులుగా తోకల సాంబశివరావు, గుంటు సత్యనారాయణ, ఉప్పుటూరి రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా పైనం కోటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు తెలియచేశారు. ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, మురకొండ మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ఐటిడిపి, మైనారిటి కార్యవర్గాల ఎన్నిక ఏకగ్రీవం



చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్దాగత ఎన్నికలలో బాగంగా నియోజకవర్గ స్దాయి కార్యవర్గాల ఎన్నిక ప్రక్రియను పార్టీ శ్రేణులు ప్రారంభించారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్నికలలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులుగా పిల్లి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎన్ బాలాజీసింగ్ పెరవలి భరత్, గోనుగుంట్ల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహ్మద్ రఫీ(సిబిఎన్ రఫీ)లను ఎన్నుకున్నారు. అలాగే నియోజకవర్గ మైనారిటి విభాగం అధ్యక్షులుగా షేక్ బాజీ, ప్రధాన కార్యదర్శిగా షేక్ రియాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, మారెళ్ల అప్పారావు, మురకొండ మల్లిబాబు పాల్గొన్నారు.

## వాజ్‌పేయి విగ్రహానికి ఘననివాళి



చిలకలూరిపేటటౌన్,ఆగస్టు16,ప్రభాతవార్త: రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బిజెపి మొట్టమొదటి జాతీయ అధ్యక్షులు, మాజీ భారత ప్రధాని అటల్‌బీహారి వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకొని నరసరావుపేట సెంటర్ వద్దనున్న ఆయన విగ్రహానికి శనివారం ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు పోలూరి శ్యాం మోహనరావు, బిజెపి పట్టణ ఓబిసి అధ్యక్షులు కుప్పం కళ్యాణ దుర్గారావు, బిజెపి ఉపాధ్యక్షులు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు కందిమళ్ల వెంకటేశ్వర్లు, గుమ్మా బాలకృష్ణ, ఊటికొండ నాగేశ్వరరావు, జె రాయుడు తదితరులు నివాళులు అర్పించారు.

## బిజెపి పట్టణశాఖ ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతి

చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: బిజెపి పట్టణశాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో శనివారం మాజీ ప్రధాని అటల్‌బీహారి వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



ముఖ్యఅతిధిగా బిజెపి ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు పోట్రు పూర్ణచంద్రరావు పాల్గొని మాట్లాడుతూ దేశంలో రోడ్డురవాణా వ్యవస్థను మెరుగుపరుస్తూ అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోట వవన్‌కుమార్ గాంధీ, కార్యదర్శి ఎస్ పోలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, నియోజకవర్గ మాజీ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరాంకుశం శ్రీనివాసరావు, కిసాన్‌మోర్చా అధ్యక్షులు నెల్లూరి ఈశ్వర్ రంజిత్, జిల్లా నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు ఆదిమూలం గురుస్వామి, పి మహేష్, బందారు నాగరాజు, మల్ల కోటి, ఎ నరేష్, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 19న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

చిలకలూరిపేట,ఆగస్టు16,ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను ఈనెల 19వ తేదిన పట్టణంలోని సింగ్ మినీ ఫంక్షన్‌హాల్‌నందు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించబడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై ఎడుకొండలు ప్రకటనలో తెలిపారు. ఈ వేదికలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షులు ఎన్ విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాంకేతిక సభ్యులు ఎన్ శ్రీనివాస్, ఆర్థిక సభ్యులు ఆరిసిహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ సునీత, సిఆర్‌డిఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ యం శ్రీనివాసరావులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సదస్సులో పరిష్కారం కాని విద్యుత్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లింగ్, విద్యుత్ సరఫరాకు సంబంధించిన అన్ని సమస్యలను వ్రాత పూర్వకంగా ఇచ్చిన యెడల తక్షణమే పరిష్కరించబడుతుందని ఈఈ వై ఎడుకొండలు తెలిపారు. కావున ఈ సదస్సులో చిలకలూరిపేట ప్రాంత వినియోగదారులు పాల్గొని తమ విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త : పట్టణంలోని వడ్డవల్లిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకృష్ణుని



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి వేడుకలను వాడవాడలా ఘనంగా జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తున్నదన్నారు. శ్రీకృష్ణుని ప్రతి ఒక్కరూ పూజించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పలువురికి అవార్డులు

సత్తెనపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త : 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో శుక్రవారం జరిగిన వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాలశాఖామంత్రి నాదెండ్ల





మనోహర్ చేతుల మీదుగా సత్తెనపల్లి తహశీల్దార్ కె.ఎస్.చక్రవర్తి అవార్డును అందుకున్నారు. అదే విధంగా స్థానిక మదర్‌థెరిస్సా ఆదరణ సంక్షేమ కేంద్రం అధ్యక్షులు చిలక జాన్సన్‌కు రెండవసారి తమ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా హెడ్ క్వార్టర్స్ విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు గాను ఆయనకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు పలువురు అభినందనలు తెలిపారు.

## సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి

బాపట్ల,ఆగస్టు16,ప్రభాతవార్త: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివని . వారి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలని ఇన్చార్జ్ సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ అన్నారు. సర్దార్ గౌతమ్ లచ్చన్న జయంతి సందర్భంగా బాపట్ల చీల్ రోడ్ లోని ఆయన



విగ్రహానికి శనివారం ఇన్చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు, కూలీల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గౌతు లచ్చన్న సేవలు అపూర్వమన్నారు. స్వాతంత్రం కోసం అనేక కష్టాలు, జైలు జీవితం గడిపిన ఆయన నేటి తరానికి స్ఫూర్తిదాయకుడని అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడని ఆయన గుర్తుచేశారు. సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్రం సాధనలో చేసిన కృషికి గాను వారి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.సాధారణ కుటుంబం నుంచి వచ్చి ప్రజల కోసం అహర్నిశలు పోరాడిన లచ్చన్న నిజాయితీ, ధైర్యం, త్యాగం ప్రతి యువకుడికి ఆదర్శమని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడన్నారు. బాపట్ల ఆర్డీవో గ్లోరియ మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని, సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, డీపీవో ప్రభాకర్, డిఆర్డిఏ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి.గౌడ సంఘం నాయకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ,మోహన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ముత్తాయపాలెంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



బాపట్ల,ఆగస్టు16,ప్రభాతవార్త: బాపట్ల మండలం ముత్తాయపాలెంలో కృష్ణాష్టమి సం దర్భంగా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తొలుత కృష్ణుడు మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలోని యువత,పెద్దలు శ్రీ కృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యువత,బాలలు పెద్ద ఎత్తున పాల్గొని ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు.అనంతరం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్నిన నిర్వహించారు.

## విద్యాశాఖ ఉత్తమ అకడమిక్ మోనటరింగ్ అధికారిగా బిల్లా మోజెస్

బాపట్ల,ఆగస్టు16,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా విద్యాశాఖ అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ గా విధులను నిర్వహిస్తూ అత్యుత్తమ సేవలందించిన బిల్లా మోజెస్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవి,జిల్లా కలెక్టర్ శ్రీ మురళి గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.ఈ నెల 15వ



తేదిన జరిగిన స్వాతంత్ర ధినోత్సవ వేడుకలల్లో మోజెస్ ఈ అవార్డుకు ఎంపికైయ్యారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఫౌండేషనల్ లిట్రసి అండ్ న్యూమరసి , స్కూల్ లీడర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం వంటి వినూత్న శిక్షణ తరగతులను ఘనంగా నిర్వహించిన సందర్భంగా మరియు విద్యాశాఖ కు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలలో మంచి సహకారాన్ని అందించినందుకు గాను ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు బిల్లా మోజెస్ తెలియజేశారు ఈ పురస్కారాన్ని అందించిన కలెక్టర్ గారికి డీఈవో ఎస్. పురుషోత్తం ,గారికి ఏపీసి శ్రీ ఎం .నాగిరెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేటి నుంచి శ్రీ స్వర్ణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: టెంపుల్ సిటీగా ప్రసిద్దిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాధ్ తెలిపారు. అందుకు సంబంధించిన



వివరాలను శనివారం ఆయన వివరించారు. 17వ తేదీ ఉదయం ప్రాత:కాలార్చన, విశేషపూజ, శ్రీ స్వర్ణవెంకటేశ్వరస్వామివార్లకు పంచామృత స్నపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 18వ తేదీ ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనము, సాయంత్రం 7గంటలకు శ్రీ స్వామివారి కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు. 19వ తేదీ ఉదయం శ్రీ స్వామివారి గరుడోత్సవం, మహాశాంతి హోమము, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవము జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 7గంటలకు వసంతోత్సవము, చక్రస్నానము, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6గంటలకు సహస్రదీపాలంకరణ, పవళింపు సేవలు జరుగుతాయన్నారు. 21వ తేదీ ఉదయం 9గంటలకు పుష్పయాగం, సాయంత్రం 7గంటలకు స్వామివార్ల తెప్పోత్సవము తదితర కార్యక్రమము జరుగుతాయన్నారు. 18వ తేదీన జరిగే కళ్యాణోత్సవంలో పాల్గొనాలనుకొనేవారు రూ.2,116లు చెలి ంచి రశీదు పొందాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే పూజా కార్యక్రమాలలో గోత్రనామాలతో పూజ చేయించుకోవాలనుకునేవారు రూ.516చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు దేవాలయంలో సంప్రదించాలన్నారు.


## లయన్స్ రీజియన్ ఛైర్మన్‌గా రంగవల్లి

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: లయన్స్ రీజియన్ ఛైర్మన్‌గా పట్టణానికి చెందిన పరాశరం రంగవల్లిని నియమిస్తూ లయన్స్ జిల్లా గవర్నర్ సిహెచ్ హరిప్రసాదరావు ఉత్తర్వులు జారీ చేశారు. పరాశరం రంగవల్లి లయన్స్‌క్లబ్ సభ్యురాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం,



లయన్స్‌క్లబ్‌లో సభ్యులుగా చేర్పించడం, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని, ఆమె సేవలను రీజియన్ పరిధిలో ఉపయోగించుకునేందుకు గవర్నర్ హరిప్రసాదరావు రీజియన్ ఛైర్మన్‌గా రంగవల్లిని నియమించారు. ఈ సందర్భంగా రంగవల్లి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రీజియన్ ఛైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పదవి తీసుకోవడంతో నా బాధ్యత మరింత పెరిగినట్లు భావిస్తున్నానన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యురాలిగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, ఎంతో మందిని సభ్యులను చేర్పించినట్లు చెప్పారు. ఏది ఏమైనా తనపై ఉంచిన బాధ్యతను శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని చెప్పారు. రంగవల్లిని రీజియన్ ఛైర్మన్‌గా నియమించడం పట్ల స్వర్ణపురి మహిళా క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేయడంతోపాటు దుశ్శాలువాలతో, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బి.ఝాన్సీరాణి, కార్యదర్శి గుత్తికొండ శోభాకలూష, కోశాధికారి పి.నిర్మల, జి.కృష్ణకుమారి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, పరాశరం శేషుకుమారి, కె.విజయలక్ష్మి, లక్ష్మీకుమారి, పి.ఉమాకుమారి, శ్రీలక్ష్మి, ఎం.అమరేశ్వరి, బి.శబలాదేవి తదితరులున్నారు.

## విజితేంద్రకు ఉత్తమ అవార్డు



పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: మండల పరిధిలోని కసుకర్రు గ్రామానికి చెందిన గంజాము విజితేంద్రకు ఉత్తమ సేవా అవార్డు దక్కింది. బాపట్ల జిల్లా, భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాలలో సేవలు అందిస్తున్న విజితేంద్రకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకటమురళీ చేతుల మీదుగా విజితేంద్ర అవార్డు అందుకున్నారు. విజితేంద్రకు అవార్డు రావడం పట్ల గ్రామ పెద్దలు, బంధువులు, ఆప్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## పాల ఉత్పత్తిదారులకు సంగం చేయూత

-సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ చేయూతనందిస్తుందని సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు, గోళ్ళమూడిపాడు, మునిపల్లె, చూండురు మండల పరిధిలోని తొట్టెంపూడి గ్రామాలలో శనివారం బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొర్రు రామారావు మాట్లాడుతూ



సంగం డెయిరీకి వచ్చిన లాభాలను పాల ఉత్పత్తిదారులకు, అందులో పనిచేస్తున్న కార్మికులకు, సిబ్బందికి సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. ఇంత పెద్ద ఎత్తున బోనస్ పంపిణీ చేస్తున్న సంస్థ ఒక్క సంగం డెయిరీ మాత్రమేనన్నారు. 267మంది రైతులకు రూ.4.24లక్షలను బోనస్‌గా అందజేశామన్నారు. ఈ సందర్భంగా గోళ్ళమూడిపాడు కేంద్రం ఆవరణలో పశువైద్య పరీక్ష నిమిత్తం గేదెల బోను ప్రారంభించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ అధికారులు బండ్లమూడి శ్రీకాంత్, ఉప్పాల సందీప్‌కృష్ణ, మర్రి బ్రహ్మారెడ్డి, వేతన కార్యదర్శులు మల్లంపాటి లక్ష్మి, అంగిరేకుల వెంకటేశ్వరరావు, టి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

-ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ ఏకా

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: సెప్టెంబరు 13వ తేదీన స్థానిక సివిల్ కోర్టు నందు జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పవన్‌కుమార్ ఏకా కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీపడదగిన కేసులను పరిష్కరించుకునేందుకు ఇది ఒక చక్కటి అవకాశమన్నారు. న్యాయవాదులు అధిక సంఖ్యలో కేసులు రాజీపడే విధంగాచూడాలన్నారు. కక్షిదారులకు ఇంది ఎంతో మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొందుగల జయరాజు, న్యాయవాదులు ఎన్.వర్ధన్, బొనిగల రాజారావు, పి.విజయకుమార్, సాయి, సిహెచ్ నాగరాజు, లీలాప్రసాద్, ప్రకాష్ తదితర న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## కట్టావారిపాలెంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

సత్తెనపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు అందజేశారు. ఎన్ఆర్ఐ మదమంచి రామకృష్ణ విద్యార్థుల కొరకు రూ.20 వేల విలువ గల చెక్కును మండల పరిషత్ పాఠశాలకు అందజేశారు. అదే విధంగా రూ.15 వేల విలువ చేసే కుర్చీలను గ్రామానికి చెందిన కోయ నరసింహారావు నరసింహారావు అందజేశారు. ఈ కార యక్రమానికి హెచ్ఎం వడ్లమూడి శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశంపార్టీ నాయకులు కొబ్బరి సుబ్బారావు, మదమంచి రాంబాబు, జానకిరావు, శ్రీలక్ష్మి, చందన, నరసింహారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పెదకూరపాడు, ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలోని 75 తాళ్ళూరు గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కోదండ రామాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ సీతారామ స్వామి వార్లకు, ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సత్యనారాయణరెడ్డి, ధర్మకర్త అంజిరెడ్డి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



రాజుపాలెం, ఆగస్టు 16 ప్రభాతవార్త : కలియుగ ప్రత్యక్ష దైవం గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహోత్సవాలకు సిద్ధమైంది. గత 12 సంవత్సరాలుగా ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. బ్రహ్మోత్సవాలలో భాగంగా 15వతేదీన విశ్వక్సేనారాధన, వాసుదేవ



పుణ్యాహవచనం, రక్షాబంధనం, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. మంగళవారం 16వతేదీన నిత్యారాధన, మంగళశాసనం, ద్వజారోహణ, యోగశాల ప్రవేశం, నిత్య పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఛైర్మన్ కొత్తూరి వెంకట రామ సుబ్బారావు దంపతులు తెలియజేశారు. అదే విధంగా 17వతేదీన యోగశాలలో పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, ఉత్సవమూర్తుల గ్రామోత్సవం జరుగుతాయన్నారు. 18వతేదీన చక్ర తీర్థోత్సవం, ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 19వ తేదీన తీర్థ ప్రసాద గోష్ఠితో పాటు రుత్వికులకు, ఆచార్యులకు సత్కారం జరుగుతుందన్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారిని కనులారా దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ఛైర్మన్ కొత్తూరి వెంకట రామ సుబ్బారావు తెలియజేశారు.

## పాఠశాలకు వాటర్ ప్లాంట్ బహూకరణ

పెదకూరపాడు, ఆగస్టు 16 ప్రభాతవార్త : రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సౌజన్యంతో మండలంలోని ఆనందపేట నందు గల ప్రాథమిక పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శనివారం ఏర్పాటు చేశారు. మంచికలపూడి గ్రామానికి చెందిన కొండపనేని నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు సాంబశివరావు, సుబ్బారావు, మౌలయ్య తదితరులతో



పాటు శ్రీనివాసరావు, కె.కృష్ణ, మురళీలు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు గుండపనేని విజయకృష్ణ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించే ఉద్దేశంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, హెచ్ఎం రాయపూడి సాంబశివరావు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

రాజుపాలెం, ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐ. వేణుగోపాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఏఎస్ఐ కిరణ్, కానిస్టేబుల్స్ విజయ్, అప్పలనాయుడు, అశోక్, అంజిబాబు, లింగరాజు, గోపి, చెంచయ్య, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా మండలానికి చెందిన







ఉమెన్ కానిస్టేబుల్ విక్టోరియా రాణి, పశువైద్యులు డాక్టర్ వీరయ్య, డిప్యూటీ ఎంపిడివో పగడాల ముక్కంటిలు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా నరసరావుపేటలో జరిగిన వేడుకల్లో అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు పలువురు అభినందనలు తెలియజేశారు.

## వర్షపునీటిలో మునిగిన జాగిరి వంతెన

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని శలపాడు వద్ద గల జాగిరి వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా మునిగిపోయింది. దీంతో ఐదు చోట్ల గండ్లు పడి పంట పొలాలను ముంపుకు గురి అయ్యాయి. సుమారు 500ఎకరాల్లో ఎదబెట్టిన వరిపైరు పూర్తిగా దెబ్బతినిపోయింది.



శలపాడు రైతులు వెదపెట్టిన పంట నీటిపాలు కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి నీట మునిగిన పొలాలను పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు. శలపాడు గ్రామ రైతు కావూరి వాసుదేవరావు మాట్లాడుతూ గత ఐదు రోజుల క్రిందట కురిసిన భారీ వర్షాలకు శలపాడు వద్ద గల జాగిరి వంతెన మునిగిపోయిందన్నారు. గుంటూరు నల్లా డ్రెయిన్‌కు ఐదు ఆరు చోట్ల గండ్లు పడి వరద నీరు పంట పొలాలను ముంచెత్తిందన్నారు. ఇప్పటికే రెండుసార్లు వరి వెదపెట్టడం వల్ల ఎకరానికి రూ.15వేలు ఖర్చు పెట్టామన్నారు. మరో రూ.15వేలు విలువ చేసే ఎరువులు పొలం గట్లమీద దాచుకున్నామన్నారు. వర్షంతో తడిసి ముద్దయ్యాయన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నష్టపోయామన్నారు. జాగిరి వంతెన ద్వారా శలపాడు, సుద్ధపల్లి, వేజండ్ల, మీసరగడ్డ అనంవరం, వెంకటకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఎరువులను తెచ్చుకుంటారని చెప్పారు. గత పది సంవత్సరాల నుంచి వంతెన శిధిలావస్థకు చేరుకుందని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా, మా ఆవేదన అరణ్యరోదనగా మిగిలిందన్నారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సత్వరమే పంట నష్టం అంచాలను తయారు చేసి వాస్తవ సాగుదారులకు ఎకరాకు రూ.10వేలుతోపాటు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. గుంటూరు నల్లడ్రెయిన్ రెండు గండ్లు పూడ్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాతా శ్రీనివాసరావు, కొడాలి శ్రీకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ ప్రస్తావన చారిత్రక తప్పిదం

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ ప్రస్తావన తీసుకురావడం చారిత్రక తప్పిదమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు.



ఆర్ఎస్ఎస్ ప్రస్తావన తేవడం ద్వారా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఉన్న పవిత్రతను, చారిత్రక ప్రాశస్త్యాన్ని తూలనాడి, ఘోర తప్పిదానికి పాల్పడ్డారన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రస్తావన తేవడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మతోన్మాద ఆర్ఎస్ఎస్ పాత్ర ఎక్కడా లేదన్నారు. కానీ మోడి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వందేళ్ళ చరిత్ర కలిగిన సంస్థ అంటూ కితాబివ్వడాన్ని ఖండించారు. ఆర్ఎస్ఎస్ ఈ దేశంలో విద్వేషాలను పెంచి పబ్బం గడుపుకునే మతోన్మాద సంస్థగా అందరికీ సుపరిచితమైన వేళ మోడి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను ఎన్జిఓగా చిత్రీకరించడం అంటే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించిన ఎందరో సమరయోధుల త్యాగాలను అవమానించడినట్లేనన్నారు.

## ఉత్తమ తహశీల్దార్‌గా గుండవరపు శ్రీచరణ్

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: పొన్నూరు పురపాలక సంఘ పరిధిలోని పాత పొన్నూరుకు చెందిన గుండవరపు శ్రీ చరణ్ ఉత్తమ తహశీల్దార్‌గా ఎంపికై రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకట మురళీ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పొన్నూరుకు చెందిన శ్రీ



చరణ్ బాపట్ల జిల్లా, అద్దంకి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అద్దంకి మండలంలో విశేష సేవలందించడం, ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనడం, వివిధ రకాల సమస్యలపై కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు, ప్రజలను చక్కగా రిసీవ్ చేసుకోవడం, సమస్యలు చెప్పుకొనేందుకు వచ్చే వారి సమస్యలను సావధానంగా వినడం, అందుకు పరిష్కారాలు చూపించడం వంటికి ఉత్తమ తహశీల్దార్‌గా ఎంపికయ్యేందుకు కారణమైనట్లు తెలిసింది. విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా చక్కటి సుపరిపాలన అందించడం వంటివి కూడా శ్రీచరణ్‌కు ఉత్తమ అవార్డు వచ్చేందో దోహదపడినట్లు కార్యాలయ వర్గాలు చెప్తున్నాయి. పొన్నూరు వాసి శ్రీచరణ్ ఉత్తమ అవార్డు తీసుకోవడం పట్ల ఆయన అభిమానులు, బంధువులు, మిత్రులు, ఆప్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరు బ్రాహ్మణమహాసభ పూర్వాధ్యక్షుడు పివిఎస్ఎవి ప్రసాద్(ఆడిటర్ ప్రసాద్), అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి, మునిపల్లె మురళి, దేశిరాజు బాలగంగాధరతిలక్, దేశిరాజు శ్రీనివాసరావు, ఎఆర్‌కెఎస్టీసాయి, మునిపల్లె పాండురంగ విఠల్ తదితరులు శ్రీచరణ్‌కు అభినందనలు తెలిపారు.

# ‘ కన్యాకుమారి’ హై ఎంటర్టైన్‌మెంట్ సినిమా



**ప్రముఖ నటి** మధు శాలిని ప్రెజెంటర్‌గా రూరల్ లవ్ స్టోరీ “కన్యా కుమారి“ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో మూవీ ప్రజెంటర్ మధు షాలిని మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు. ఈ వేడుకకు విచ్చేసి మమ్మల్ని సపోర్ట్ చేసిన ప్రవీణ్‌కి ధన్యవాదాలు కన్యాకుమారి టీజర్ చూడగానే నాకు చాలా నచ్చేసింది. గీత్ చాలా అద్భుతమైన క్యారెక్టర్ లో చాలా అందంగా కనిపించారు. సృజన్ తీసిన పుష్పక విమానం సినిమా నాకు చానా నచ్చిం.ది అలాంటి కొత్త టాలెంట్ ని సపోర్ట్ చేయాలనిపించింది. మీ అందరూ కూడా సినిమాను సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సృజన్ చాలా కష్టపడి పాషన్ తో ఈ సినిమా చేశారు. ఈ సినిమాని బన్నీ వాసు కిచూపించబోతున్నాము. ఆయనకి నచ్చాలని కోరుకుంటున్నాము. ఆయన మాకు ఇచ్చిన ధైర్యం మర్చిపోలేము. ఈ సందర్భంగా ఆయనకి హృదయపూర్వక కృతజ్ఞతలు. వినాయక చవితి రోజు ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు వస్తుంది. మరిన్ని బ్యూటిఫుల్ ఫిలిమ్స్ తో మీ ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నాను. మీ అందరికీ సపోర్ట్ కావాలి. గీత్ సైని మాట్లాడుతూ... ఇది ఒక డ్రీమ్ లాగా ఉంది. చాలా గ్రేట్ ఫుల్ గా ఫీల్ అవుతున్నాను. ఈ మూమెంట్ మధు గారి వలన ఇది పాజిబుల్ అయింది. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది విలేజ్ బ్యాక్ డ్రాప్ లో ఉండే యూనిక్ లవ్ స్టోరీ. వర్షం పడినప్పుడు వచ్చే మట్టి సువాసన అంతా స్వచ్ఛంగా ఉంటుంది. ఈ సినిమాచూసినప్పుడు కూడా మనసును హత్తుకునే అనుభూతిని ఇస్తుంది. ఇందులో కన్యాకుమారి లాంటి పాత్ర చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి రోల్ వచ్చినందుకు చాలా అదృష్టంగా భావిస్తున్నాను. డైరెక్టర్ గారు అంత అద్భుతంగా ఈ క్యారెక్టర్ రాశారు. ఈ సినిమా చూశాక ఒక మంచి సినిమా చూసామని అనుభూతి ప్రేక్షకులకు రావాలని ఆ దేవున్ని కోరుకుంటున్నాను.

డైరెక్టర్ సృజన్ మాట్లాడుతూ. కన్యాకుమారి దర్శకుడిగా నాకు రెండో చిత్రం. ప్రంట పొలాల్లో గట్ల మీద పుట్టిన ఒక వైల్డ్ ఫ్లవర్ లాంటిది. నటీనటులందరినీ శ్రీకాకుళం తీసుకెళ్ళిపోయి ఆ ప్రాసెస్ లో తయారు చేసిన సినిమా ఇది. గీత్ అద్భుతంగా నటించింది. సినిమా అంతా పూర్తయిన తర్వాత ఇక్కడ కొంత మందికి చూపించాం. వాళ్ళందరూ కూడా చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. రియల్ ఎమోషన్స్ వుంటాయి. మంచి అనుభూతిని పొందాలంటే కన్యాకుమారి సినిమా చూడాలని కోరుకుంటున్నాను ఈ సినిమాని ముందుకు తీసుకొస్తున్న మధు మేడంకి మరోసారి కృతజ్ఞతలు.డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. సృజన్ నాకు చిన్నప్పటి నుంచి ఫ్రెండ్. తన ఫస్ట్ సినిమా పుష్పక విమానం నాకు చాలా ఇష్టం. ఈ సినిమా చాలా మంచి పాజిటివ్ వైపు ఇచ్చింది. ఒక పల్లెటూరి లవ్ స్టోరీ చూసి చాలా కాలం అయింది. అందరూ చాలా నేచురల్ గా చేశారు. ఇలాంటి సినిమా చేయడం చాలా కష్టం. లాంటి సినిమాలు రావాలి. చాలా పాజిటివ్ వైస్ కనిపిస్తున్నాయి. ఒక ఫ్రెష్ ఫీలింగ్ కనిపిస్తుంది. తప్పకుండా థియేటర్స్ కి వెళ్లి ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. మ్యూజిక్ డైరెక్టర్ రవి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మంచి కంటెంట్ ఉన్న కథని సపోర్ట్ చేసిన మధుషాలిని గారికి థాంక్యూ. ఈ సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మా దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు తప్పకుండా మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. ఎడిటర్ నరేష్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమాని సపోర్ట్ చేసిన మధుశాలిని గారికి థాంక్యూ. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతినిచ్చే సినిమా ఇది. తప్పకుండా ఆగస్టు 27న ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను.కో ప్రొడ్యూసర్ అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఈ సినిమా నిర్మాణం నుంచి ముగింపు వరకు చూశాను. పల్లెటూరి ప్రేమ కథ వచ్చి చాలా రోజులైంది. ఇది నేచురల్ లవ్ స్టోరీ. చాలా అద్భుతమైన లొకేషన్స్ ఈ సినిమాలో చూస్తాం. సజీవమైన కళింగాంధ్ర భాషను కూడా ఈ సినిమాలో చూపించారు. తప్పకుండా ఈ సినిమాని అందరూ చూసి ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను.

కో ప్రొడ్యూసర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమాకి మధు శాలిని చాలా సపోర్ట్ చేశారు. సృజన్ గొప్ప విజన్ తో తీశారు. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ చాలా కొత్త అనుభూతిని అందిస్తుంది.




# కన్మణిగా ఆకట్టుకున్న అరుల్‌మోహన్




**కన్మణిగా** ఆకట్టుకుంటున్న ప్రియాంక అరుల్ మోహన్‌పవర్‌స్టార్‌పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియు లంతా ఎంతగానో ఎదురుయ చూస్తున్న చిత్రం ఓజీ. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీ వీ వీ దానయ్య ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఓజాస్ గంభీరగా గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో కనిపించనున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు.అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓజీ సినిమా నుంచి ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్‌ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆమె కన్మణిని పాత్రలో అలరించనున్నారు. ఓజీ రూపంలో ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని వెండితెరపై చూడబోతున్నామనే హామీని ఇప్పటిదాకా విడుదలైన ప్రచార చిత్రాలు ఇచ్చాయి. తాజాగా విడుదలైన ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్ మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఒక పోస్టర్ దయ, బలం, నిశ్శబ్దాన్ని ప్రదర్శిస్తోంది. మరో పోస్టర్ ప్రశాంతత, గృహ వాతావరణాన్ని సూచిస్తుంది. ఇప్పటికే విడుదలైన పవన్ కళ్యాణ్ పాత్రకు సంబంధించిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది. ఇప్పుడు ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్ కూడా కట్టిపడేస్తోంది. సుజీత్ యొక్క విస్ఫోటన కథనానికి భావోద్వేగ లోతును, ఆకర్షణను పవన్ కళ్యాణ్ , ప్రియాంక అరుల్ మోహన్ జోడిస్తున్నారు. ప్రతి తుఫానుకు అవసరమైన ప్రశాంతత ప్రియాంక మోహన్ పాత్ర అని నిర్మాతలు అభివర్ణించారు.ఇటీవల విడుదలైన ఓజీ మొదటి గీతం ఫైర్ స్టార్మ్‌కు విశేష స్పందన లభించింది. ఇప్పుడు రెండవ గీతాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో ప్రోమో విడుదల కానుంది. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, ప్రియాంక అరుల్ మోహన్ తో పాటు ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. 2025లో అతిపెద్ద సినిమాటిక్ ఈవెంట్‌గా ఇది రూపుదిద్దుకుంటోంది. సంగీత సంచలనం ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకులుగా రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస వ్యవహరిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.


# 'ఫైటర్‌శివ'నుంచి టీజర్

కౌండిన్య ప్రొడక్షన్స్, అరుణ గిరి ఆర్ట్స్ బ్యానర్ల మీద ఉన్నం రమేష్, నర్సింహా గౌడ్ నిర్మించిన



చిత్రం 'ఫైటర్ శివ'. ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మణికాంత్, ఐరా బన్సాల్ జంటగా నటించారు. ఈ మూవీలో సునీల్, వికాస్ వశిష్ట వంటి వారు కీలక పాత్రలను పోషించారు. ఈ టీజర్‌ను ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ రిలీజ్ చేశారు.యముడుకి పోలీస్ ఉద్యోగం దొరికితే ఎలా ఉంటుందో చూపిస్తా. నేను పవన్ కళ్యాణ్ లెక్క.. గెలిచే వరకు పోరాడుత్తా వంటి పవర్ ఫుల్ డైలాగ్స్‌తో 'ఫైటర్ శివ' టీజర్‌ను అద్భుతంగా కట్ చేశారు. ఈ 'ఫైటర్ శివ' టీజర్‌ను గమనిస్తే ఫుల్ యాక్షన్ ఓరియెంటెడ్ మాస్ కమర్షియల్ సినిమానిచూడబోతోన్నామని అర్థంఅవుతోంది. టీజర్‌లాంచ్ అనంతరం.హీరోమణికాంత్ మాట్లాడుతూ,నన్ను హీరోని చేయాలని ఈ 'ఫైటర్ శివ'కోసం మా నాన్న చాలా కష్టపడ్డారు. పెట్టిన ప్రతీ రూపాయిని వడ్డీతో సహాఇండస్ట్రీ నుంచి తీసుకు వెళ్తాను. సురేందర్ ప్రతీ ఫ్రేమ్ అద్భుతమనే చెప్పాలి. గౌతమ్ ఇచ్చిన సంగీతం అందరినీ ఆకట్టుకుంటుంది. 'ఫైటర్ శివ' అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది.అని అన్నారు.దర్శకుడు ప్రభాస్ నిమ్మల మాట్లాడుతూ, అశ్వనీదత్, సంపత్ నందివల్లే ఈ 'ఫైటర్ శివ'ఇక్కడి వరకు వచ్చింది. మా మూవీ పోస్టర్‌ను సంపత్ నంది, టీజర్‌ను అశ్వనీదత్ రిలీజ్ చేసినందుకు ధన్యవాదాలు నేను ఇప్పుడు చిన్న సినిమా తీస్తున్నాను కావొచ్చు.. ఓ సందేశాత్మకంగా చిత్రంగా 'ఫైటర్ శివ'ను తెరకెక్కించాం. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మన ప్రభుత్వాలు ఎంతో ప్రయత్నిస్తున్నాయి. . నర్సింహగౌడ్ వాళ్ల అబ్బాయిని హీరోగా పరిచయం చేయాలని అనుకున్నారు. ఆ క్రమంలో యాక్షన్, మాస్, కమర్షియల్, మెసెజ్ ఓరియెంటెడ్ 'ఫైటర్ శివ' సబ్జెక్ట్ చెప్పాను. రమేష్ మా వెన్నంటే నిల్చున్నారు. తెలంగాణ నుంచి మణికాంత్ అనే స్టార్ హీరో రాబోతోన్నాడు. మా మూవీని అందరూ ఆశీర్వదించండి అని అన్నారు..ఎమ్మెల్యే రామలింగం మాట్లాడుతూ ఫైటర్ శివ కోసం ప్రభాస్ ఎంతో కష్టపడ్డారు. ప్రభుత్వం డ్రగ్స్ మీద చేసే పోరాటం ఆధారంగా 'ఫైటర్ శివ'ను తెరకెక్కించారు. చిరంజీవి ఎప్పుడూ కూడా కొత్త వాళ్లు రావాలని చెబుతుంటారు. ఇప్పుడు మణికాంత్ అనే కొత్త హీరో రాబోతోన్నారు. 'ఫైటర్‌శివ'ను అందరూ ఆదరించండిఅని అన్నారు.నిర్మాత నర్సింహా గౌడ్ మాట్లాడుతూ,నేను చాలా కథలు విన్నాను. ఓ టైంలో ప్రభాస్ ఈ 'ఫైటర్ శివ' స్టోరీ చెప్పారు. ఈ మూవీని అద్భుతంగా తెరకెక్కించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్ మీద పోరాడుతున్నారు. అదే సందేశాన్ని ఈ మూవీతో మేం ఇవ్వబోతోన్నాం. యువతను మేల్కొపేలా మా 'ఫైటర్ శివ' ఉంటుంది. త్వరలోనే ఈ మూవీ విడుదల కాబోతోంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా మాచిత్రం ఉంటుందిఅని అన్నారు.నిర్మాత ఉన్నం రమేష్ మాట్లాడుతూ,డ్రగ్స్

# రోలెక్స్‌ని టచ్ చేయలేకపోయిన ‘అమీర్ ఖాన్ ’..!




దర్శకుడు లోకేష్ కనగరాజ్ డైరెక్షన్‌లో వచ్చిన కూలీ చిత్రం రిలీజ్‌కు ముందు సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాలో సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటిస్తుండటంతో ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూశారు. కట్ చేస్తే.. ఈ సినిమా రిలీజ్ తర్వాత మిక్స్‌డ్ టాక్‌తో రన్ అవుతుంది. లోకేష్ నుంచి వచ్చిన వీక్ రైటింగ్ అంటూ క్రిటిక్స్ కామెంట్స్ చేస్తున్నారు.

ఇక కూలీ చిత్రంలో భారీ క్యాస్టింగ్ ఉండటంతో వారి పాత్రలు ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తాయని చిత్ర యూనిట్ చెబుతూ వచ్చింది. ముఖ్యంగా బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ ఈ సినిమాలో ఓ క్యామియో రోల్ చేస్తున్నాడని మేకర్స్ రివీల్ చేయడంతో.. ఆయన పాత్ర విక్రమ్ చిత్రంలోని సూర్య పోషించిన రోలెక్స్ తరహాలో ఉంటుందని అందరూ ఆశించారు. నిజానికి రోలెక్స్ ని మించిన పాత్ర ఇది అవుతుందని లోకేష్ అండ్ టీమ్ ప్రచారం చేశారు. కానీ, సినిమా రిలీజ్ తర్వాత అమీర్ ఖాన్ పోషించిన దాహ పాత్ర చాలా చప్పగా అనిపించింది. ఏమాత్రం పవర్‌ఫుల్‌గా లేకుండా ఈ పాత్రను లోకేష్ ప్రెజెంట్ చేసిన తీరు ప్రేక్షకులను మెప్పించలేకపోయింది.

దీంతో రోలెక్స్ తరహా పాత్రను బీట్ చేయాలంటే చాలా కష్టమని సూర్య ఫ్యాన్స్‌తో పాటు లోకేష్ ఫ్యాన్స్ కూడా అంటున్నారు. ఏదేమైనా అమీర్ ఖాన్ రోలెక్స్‌ని టచ్ కూడా చేయలేకపోయాడని వారు కామెంట్స్ చేస్తున్నారు మహారాజ్ సంగీతం అందించిన ఈ సినిమాకు హాలేస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎడిటర్ : కృష్ణ, కొరియోగ్రాఫర్: సాధిక్ సర్దార్, నిర్మాత:చంద్ర శేఖర్... సహనిర్మాత : అరుణ్ కుమార్. పిఆర్ఓ లక్ష్మి శ్రీనివాస్

# మిస్టీరియస్ థ్రిల్లర్ ‘కిష్కిందపురి’



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్, కౌశిక్ పెగల్లపాటి, సాహు గారపాటి, షైన్ స్క్రీన్స్ “కిష్కిందపురి ”మిస్టీరియస్ అకల్ట్ థ్రిల్లర్ గ్రిప్పింగ్ టీజర్ రిలీజ్‌బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మిస్టీరియస్ అకల్ట్ థ్రిల్లర్ “కిష్కిందపురి”లో పవర్ ఫుల్ ఎమోషనల్ అవతార్ లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 12న విడుదలకు సిద్ధవవుతున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈచిత్రం టీజర్ విడుదలైంది. చేసిన“కిష్కిందపురి” టీజర్ మిస్టీరియస్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో అదిరిపోయింది. మొదటి షాట్ నుంచే ఓ మిస్టరీ స్టార్ట్ అవుతుంది. ఒక వింటేజ్ మాన్షన్‌లోకి వెళ్లిన ఓ అమ్మాయి ఒక్కసారిగా అదృశ్యం అవుతుంది. ఇంతలో రేడియో నుంచి ఒక మెసేజ్ ప్రసారం చేస్తుంది. ఇది కథలో పారానార్మల్ ఎనర్జీ తో పాటు డిఫరెంట్ టైమ్ లైన్స్ ని ప్రజెంట్ చేసింది.బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఇంటెన్స్ రోల్‌లో అదరగొట్టారు.

అనుపమ పరమేశ్వరన్ ఆయన లవ్ ఇంటరెస్ట్‌గా కనిపించింది. టీజర్‌లో ఈ ఇద్దరి క్యారెక్టర్లను పరిచయం చేశారు.టెక్నికల్ గా టీజర్ అద్భుతంగా వుంది. చిన్మయ్ సలస్కర్ కెమెరా వర్క్ ఓ సస్పెన్స్, హారర్ ని ఎలివేట్ చేసింది. చైతన్ భరద్వాజ్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్ ని మరో లెవల్ కి తీసుకెళ్ళింది. ప్రొడక్షన్ డిజైనర్‌గా మనీషా ఏ దత్, ఆర్ట్ డైరెక్టర్‌గా డి. శివ కామేష్, నిరంజన్ దేవరమనే దితర్, క్రియేటివ్ హెడ్ జి. కనిష్క, కోరైటర్‌గా దరహాస్ పాలకోలు వర్క్ చేస్తున్నారు.థ్రిల్స్, ఎమోషన్స్, సూపర్‌న్యాచురల్ సస్పెన్స్ తో టీజర్‌తో “కిష్కిందపురి”పై క్యురియాసిటీని పెంచింది. కిష్కిందపురి ఈ ఏడాది థియేటర్స్‌లో చూడాల్సిన మస్ట్‌వాచ్ మూవీ.

తారాగణం: బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్.సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కౌశిక్ పెగళ్లపాటి నిర్మాత సాహు గారపాటి,బ్యానర్ : షైన్ స్క్రీన్స్, సమర్పణ: అర్చన,సంగీతం: చైతన్ భరద్వాజ్, డిఓపి :చిన్మయ్ సలాస్కర్‌ప్రొడక్షన్ డిజైన్, మనీషా ఎ దత్‌ఆర్ట్ డైరెక్టర్ డి శివ కామేష్ ఎడిటర్: నిరంజన్ దేవరమానే‌సహ రచయిత దరహాస్ పాలకొల్లు,స్క్రిప్ట్ అసోసియేట్: కె బాల గణేష్.

# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



**సుందరకాండ** మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఆగస్ట్ 27న ఫ్యామిలీ అంతా కలసి థియేటర్స్ లో ఈ సినిమాచూసి మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుకుంటన్నాను: ప్రెస్ మీట్ లో హీరో నారా రోహిత్‌హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు, ట్రైలర్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో నారా రోహిత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సుందరకాండ ట్రైలర్, సాంగ్స్ కి చాలా మంచి రెస్పాన్స్ ఉంది. ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఫ్యామిలీ అంతా కలిసి వెళ్లి ఈ సినిమాను చూడొచ్చు. సినిమా మొదలైనప్పుడు ఎంత హ్యాపీగా ఉన్నామో ఇప్పుడు అంతే హ్యాపీగా ఉన్నాం. వినాయక చవితికి ఈ సినిమా రిలీజ్ చేయడం చాలా హ్యాపీగాఉంది. మా టెక్నీషియన్స్‌కోస్టార్స్ అందరికీ చాలా మంచి హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. ట్రైలర్ ని లాంచ్ చేసిన ప్రభాస్‌కి థాంక్యూ. అలాగే మా ఫ్రెండ్స్ అందరు కూడా లాంచ్ చేశారు.వినాయక చవితి రోజు ఫ్యామిలీ అంతా కలసి థియేటర్స్‌లో ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. శ్రీదేవివిజయ్ కుమార్ మాట్లాడుతూ. అందరికి నమస్కారం. ఆగస్టు 27న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. ఆ రోజు కోసం మేమంతా ఎంతగానో ఎదురు చూస్తున్నాం. మా టీమ్ అందరికీ థాంక్యు వెరీ మచ్. సినిమా మొత్తం చాలా ఎంజాయ్ చేశాం. ప్రమోషన్స్‌లో ఇంకా ఎంజాయ్ చేస్తున్నాము. చాలా కాలం తర్వాత ఈ సినిమా చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. . మంచి ఎంటర్టైనర్ ఇది. థియేటర్ కి వచ్చి అందరూ హ్యాపీగా చూడొచ్చు. ఈ సినిమా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. థియేటర్స్‌కి వెళ్లి ఫ్యామిలీతో పాటు ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. ఇలాంటి రొమాంటిక్ కామెడీ ఇప్పటి వరకు రాలేదు. వినాయక చవితికి ఈ సినిమా వస్తోంది. రొమాంటిక్ కామెడీతో పాటు చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది. తప్పకుండా ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది. ఈ క్యారెక్టర్ లో నారా రోహిత్ ని తప్ప మరెవరిని ఊహించ లేను. ఈ సినిమాకి తనే బ్యాక్ బోన్. సినిమాలో చాలా మంచి క్యారెక్టర్ చేశాను..తారాగణం: నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య,అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్ష్మి, సునైనా, రఘు బాబు.

# ఎమోషనల్‌గా కనెక్ట్అయ్యే సినిమా .పరదా’

ది దర్శన రాజంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ ట్రైలర్ పాటలు మంచి బజ్ క్రియేట్ చేశాయి. 'పరదా'ఆగస్ట్ 22న థియేటర్స్‌లో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టు ఆలోచన ఎప్పుడు మొదలైంది ?**

ఈ కథ ఆలోచన నాకు ఎప్పటినుంచో ఉంది. నేను దుల్కర్ తో ఒక సినిమా చేయాలి. . కొన్ని కారణాల వల్ల దాదాపు మూడేళ్లు పట్టింది మనాలి, ధర్మశాల ఇలా ఎన్నో అద్భుతమైన లొకేషన్‌లో వందమంది క్రూ తో కలిసి ఈ సినిమాని షూట్ చేశాము. గౌతమ్ మేనన్ రాజేంద్రప్రసాద్ , రాగ్ మయూర్ ఇలా చాలా పెద్ద కాన్వాస్ ఉంది. వరకు ఇది బాహుబలి లాంటి ప్రాజెక్టు. ఈ సినిమా చూస్తున్నప్పుడు మీకు ప్రతిసారి సర్ప్రైజ్ ఎలిమెంట్స్ వస్తూనే ఉంటాయి.రివ్యూస్ నచ్చితేనే సినిమాకి వెళ్ళమని చెప్పారు.

**అంత నమ్మకం ఏమిటి?**

సినిమాకి ఆడియన్స్ న్యాయ నిర్ణేతలు. రివ్యూస్ ఎలా వచ్చిన సరే వాటిని మేము యాక్సెప్ట్ చేస్తాము. సినిమాలో ఏముందో జెన్యూన్‌గా అదే చెప్తారని నమ్ముతున్నాను.. ఈ సినిమా చూసి నేను విజువల్ గా పెద్ద సినిమాలు కూడా హ్యాండిల్ చేయగలనని నమ్మకాన్ని ప్రేక్షకులు కల్పిస్తే చాలా హ్యాపీగా ఫీలౌతాను.

రాగ్ మయూర్ మీ లక్కీ చార్మ్ నా?నా మూడు సినిమాల్లో తను ఉన్నాడు. శుభంలో చాలా సర్ప్రైజ్ గా తన క్యారెక్టర్ కుదిరింది. పరదా లో కూడా తన క్యారెక్టర్ చాలా అద్భుతంగా ఉంటుంది.




**ట్రైలర్ కి ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది?**

ట్రైలర్ కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఉంది. ఇండస్ట్రీలో ఉన్న దాదాపు అందరూ కూడా చాలా పాజిటివ్‌గా రెస్పాన్స్ రెస్పాండ్ అవుతున్నారు.ఈ సినిమాని కొత్తగా ప్రమోట్ చేయాలని ఆలోచన ఎప్పటినుంచో ఉండింది. అనుపమ థియేటర్స్ కి వెళ్లి పరదా వేసుకుని రీల్స్ చేసి రిలీజ్ చేయడం, అలాగే వైజాగ్ లో ర్యాలీ చేయడం ఇవన్నీ కూడా తన భుజాన వేసుకుని నడిపిస్తుంది. సినిమా మాకు అంత నమ్మకాన్ని ఇచ్చింది. చాలా మంచి సినిమా తీశాం. జనాల్లోకి తీసుకువెళ్తే కచ్చితంగా ఆదరిస్తారు అనే నమ్మకంతో ముందుకు వెళుతున్నాం.

17-8Pg5 9 th page_17-8Pg5.qxd 8/16/2025 10:20 PM Page 1



# హిమాచల్ వరదల్లో భారీ నష్టం

## 257 మందికిపైగా మృతి, మరో 200 మంది ఆచూకీ గల్లంతు





**సిమ్లా, ఆగస్టు 16:** హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. క్లౌడ్‌బరస్ట్, ఆకస్మిక వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ ఏడాది జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 257 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాలు.. కొండ చరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్‌లు, ఇళ్లు కూలిపోవడం, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల కారణంగా 133 మంది మరణించగా, రోడ్డు ప్రమాదాల్లో 124 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. ఈ జిల్లాలో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 26 మంది మరణించారు. ఆ తర్వాత కాంగ్రాలో 28 మంది, చంబాలో 10 మంది, కులులో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక బిలాస్‌పూర్, కిన్నౌర్, సిమ్లా, సిర్మౌర్, సోలన్, లాహౌత్‌స్పితి, హమీర్‌పూర్, ఉనాలో కూడా మరణాలు సంభవిం చాయి. రోడ్డు ప్రమాదాల కారణంగా మండి (21), చంబా (20), సిమ్లా (15), కాంగ్రా (12), కిన్నౌర్‌లో 12 మరణాలు సంభవించాయి. ఇక ఇప్పటి వరకూ 331 మంది గాయపడ్డారు.

ఈ వర్షాలకు భారీగా ఆస్తి నష్టం కూడా సంభవించింది. రోడ్డు, విద్యుత్ లైన్లు, నీటి సరఫరా పథకాలు వంటి ప్రజా మౌలిక సదుపాయాలూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. రూ.లక్షలు విలువ చేసే పంటలు నీటిపాలయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, వరదలకు రోడ్లు కొట్టుకుపోవడం వంటి కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా మూడు జాతీయ రహదారులు సహా 455 రోడ్లు బ్లాక్ అయ్యాయి. కులు జిల్లాలో 73 రోడ్లు మూసివేశారు. ఆ తర్వాత మండిలో 58, సిమ్లాలో 58 రోడ్లను అధికారులు మూసివేశారు. విద్యుత్ సరఫరా కూడా పూర్తిగా దెబ్బతిన్నది. కులులో 145, సిమ్లాలో 63 సహా మొత్తం 681 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 182 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనవసరమైన ప్రయాణాలను నివారించాలని, వాతావరణ శాఖ అధికారుల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

### విఖ్రోలిలో విరిగిపడిన కొండచరియలు

#### ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

**ముంబయి, ఆగస్టు 16:** వాణిజ్య రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా నగరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విఖ్రోలి ప్రాంతంలో ఓ ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. విఖ్రోలిలోని జన్‌కల్యాణ్ సొసైటీలో శనివారం ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో ఓ కుటుంబం లోని నలుగురు సభ్యులు ఇంట్లోనే ఉన్నారు. రోడ్లు, రైల్వే ట్రాక్‌లపైకి భారీగా వరద నీరు చేరడంతో నగరంలో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబై, రాయ్‌గడ్ జిల్లాలకు అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ ఖిరెడ్ అలర్ట్‌ఖి జారీ చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ముంబై పోలీసులు హెచ్చరించారు. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయి, దారి సరిగా కనిపించని పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు. అత్యవసర సహాయం కోసం



ఒక్కసారిగా ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో వారు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఈ ఘటనలో షాలు మిశ్రా, సురేశ్‌చంద్ర మిశ్రా అక్కడికక్కడే మృతి చెందారని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఆర్తి మిశ్రా, రితురాజ్ మిశ్రాలను రక్షించి రాజావాడి ఆసుపత్రికి తరలించాయి. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో ముంబైలోని గాంధీ నగర్, కింగ్స్ సర్కిల్ సహా అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. 100, 112, 103 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.


మరోవైపు, బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కూడా సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని, అత్యవసర సాయం కోసం 1916 నంబరును సంప్రదించాలని కోరింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో శిథిలాలను పూర్తిగా తొలగించామని, ముందు జాగ్రత్త చర్యగా సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించామని అధికారులు వెల్లడించారు.



## చషోటి వరద ప్రాంతాల్లో సిఎం ఓమర్ అబ్దుల్లా పర్యటన

**శ్రీనగర్, ఆగస్టు 16:** జమ్ము కశ్మీరులోని కిష్త్‌వార్ జిల్లాలో గురువారం కురిసిన కుండపోత వర్షానికి వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో 60 మందికిపైగా మరణించగా 100 మందికిపైగా గాయపడ్డారు. చషోటీ గ్రామంలో గురువారం వచ్చిన ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొన సాగుతున్నాయి. తాజాగా చషోటి గ్రామాన్ని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు బాధిత కుటుంబాలకు జమ్ము కశ్మీర్ ప్రభుత్వం ఎక్స్‌గ్రే షియా ప్రకటించింది. విపత్తులో మరణించిన కుటుంబాలకు రూ.2లక్షలు, తీవ్రంగా గాయప డినవారికి రూ.లక్షచొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రక టించింది. స్వల్పంగా గాయపడిన వారికి రూ. 50 వేలు అందించనున్నట్లు తెలిపింది. ఇక ఈ ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.లక్ష, తీవ్రంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.50వేలు, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.25 వేలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కిష్త్‌వార్ జిల్లాలో ఆకస్మిక కుంభవృష్టికి ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు సహా దాదాపు 65 మంది ప్రాణాలు కోల్పోయారు. 160 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. మరో 200 మంది వరకు గల్లంతయ్యారు. మారుమూల పర్వత ప్రాంతంలోని ఓ గ్రామంపై మేఘ విస్ఫోటం సంభవించి గ్రామాన్ని వరద ముంచెత్తినట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన వారిని రక్షించేందుకు సహాయక బృందాలు గాలిస్తున్నాయి. మచైల్ మాతాదేవి యాత్రకు వెళ్లే మార్గంలో వాహనాలు వెళ్లగల చివరి గ్రామం చషోటీని కుంభవృష్టి ముంచెత్తినట్లు అధికారులు చెప్పారు. హిమాలయ పర్వత శ్రేణుల్లో కొలువై ఉన్న చండీమాత ఆలయంలో జరుగుతున్న వార్షిక మచైల్ మాత యాత్రలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు చషోటీ గ్రామానికి చేరుకున్నపుడు ఈ ఘటన జరిగింది.

## 18న వాషింగ్టన్‌లో ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ



**అలాస్కా, ఆగస్టు 16:** ఉక్రెయిన్ తో యుద్ధానికి ముగింపు పలకడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడువ్లాదిమిర్ పుతిన్ అలాస్కాలో భేటీ అయ్యారు. ఆ భేటీ జరిగిన కొన్ని గంటలకే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తో,యూరోపియన్ యూనియన్ నేతలతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం జెలెన్‌స్కీ, ట్రంప్ ఇద్దరూ వాషింగ్టన్‌లో భేటీ కానున్నట్లు సమాచారం. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ ఈవిషయాన్ని వెల్లడించారు. అలాస్కాలో సమావేశం అనంతరం తిరుగు ప్రయాణంలో ట్రంప్ జెలెన్‌స్కీతో ఫోన్ మాట్లాడినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించారు. ట్రంప్‌తో గంటన్నరకు పైగా ఫోన్‌లో మాట్లాడానని అన్నారు. శాంతి ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్‌కు తెలిపినట్లు చెప్పారు. పుతిన్‌తో సమావేశంలో చర్చించిన ముఖ్య విషయాలను ట్రంప్ తనకు తెలియజేసినట్లు వెల్లడించారు. శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇక జెలెన్‌స్కీ చేతుల్లోనే..పుతిన్‌తో భేటీ తర్వాత ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 16:**అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగిన జరిగిన కీలక భేటీ ఎటువంటి ఒప్పందం లేకుండానే ముగిసింది. డీల్ పూర్తికావడంపై నిర్ణయం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫాక్స్ న్యూస్ ప్రతినిధి సియాన్ హానిటీతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ఆయనకు సూచిస్తానని చెప్పారు.'ఒప్పందం చేసుకోవాలని జెలెన్‌స్కీకి సూచిస్తా. కానీవాళ్లు అందుకు నిరాకరించే అవకాశంఉంది. రష్యా చాలా శక్తిమంతమైన దేశం.పుతిన్-జెలెన్‌స్కీల సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నా.అందులో నేను కూడా చేరే అవకాశంఉంది' అని ట్రంప్ పేర్కొన్నారు.



### చైనా అద్భుత సృష్టి..

## ఇకపై రోబోలు కూడా పిల్లను కంటాయి..

**బీజింగ్, ఆగస్టు 16:** శాస్త్రసాంకేతిక విషయంలో చైనా అన్ని దేశాల కంటే ఓ అడుగు ముందే ఉంటుంది. అన్ని విషయాల్లో దేవుడి సృష్టికి ప్రతి సృష్టి చేయడానికి ప్రయత్నిస్తూ ఉంది. కొన్నింటిలో విసయం కూడా సాధించింది. ఈ నేపథ్యంలోనే 'ప్రెగ్నెన్సీ రోబో'ను రూపొందిస్తోంది. సాధారణంగా పిల్లలు కనడంలో ఇబ్బంది ఉన్న భార్యాభర్తలు సరోగసిని ఆశ్రయిస్తూ ఉంటారు. సరోగసిలో భాగంగా భార్యభర్తల నుంచి శుక్రకణాలు, అండాలు సేకరించి వేరే మహిళ గర్భం ద్వారా పిల్లలను కనేలా చేస్తారు. అయితే ఇది బాగా ఖర్చుతో కూడుకున్న పని. పైగా ఇండియాలో వాణిజ్య సరోగసి బ్యాన్‌లో ఉంది. చైనా ప్రయోగం విజయవంతం అయితే మాత్రం సరోగసి కోసం వేరే మహిళలు అవసరం లేదు. రోబోలే పిల్లలను కంటాయి. చైనాకు చెందిన కైవా టెక్నాలజీ ఈ అద్భుత సృష్టికి తెరతీసింది. రోబోలు, మనుషుల పిల్లల్ని ఎలా కంటాయన్న అనుమానం అక్కర్లేదు. ఆ రోబోల్లో కృత్రిమ గర్భాశయాన్ని ఏర్పాటు చేస్తారు. అందులో అండం వృద్ధి చెందుతుంది. 9 నెలల తర్వాత శిశువు బయటకు వస్తుంది. రోబో గర్భంలో బిడ్డ పెరుగుతున్నంత వరకు పైపు ద్వారా పోషకాలను అందిస్తారు. ఈ ప్రోటోటైప్ వచ్చే యేడాది మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రెగ్నెన్సీ రోబోల ధర లక్ష యూవాన్లు.అదే మన ఇండియన్ కరెన్సీలో చెప్పాలంటే 11 లక్షల రూపాయలుపైనే ఉంటుంది. కైవా టెక్నాలజీ అధినేత డాక్టర్ హాంగ్ కీఫెంగ్ మాట్లాడుతూ 'కృత్రిమ గర్భాశయం తయారీ ఇప్పటికే పూర్తయింది. దాన్ని రోబో కడుపులో అమర్చి పరీక్ష చేయడం మాత్రమే మిగిలి ఉంది. ఇకపై మనుషులు, రోబోలు కలిసి పిల్లల్ని కనొచ్చు. న్యాయపరమైన, సమాజపరమైన సమస్యలకు సంబంధించి ప్రభుత్వ అధికారులతో చర్చలు జరుపుతున్నాం' అని అన్నారు.

## నేడు రూ. 11,000 కోట్లతో జాతీయ రహదారి ప్రాజెక్టులు ప్రారంభించనున్న ప్రధాని

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** దేశ రాజధానిలో రెండు కీలకమైన నేషనల్ హైవే ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించనున్నారు. ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతంలో మెరుగైన కనెక్టివిటీ, రోడ్లపై రద్దీని తగ్గించేందుకు ఈ కీలక ప్రాజెక్టులను ఉద్దేశించారు. సుమారు రూ. 11,000 కోట్ల విలువైన ఈ రెండు ప్రాజెక్టులను రోహిణిలో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. తర్వాత అక్కడి వేదిక నుంచి ప్రసంగిస్తారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఢిల్లీ సెక్షన్, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2 ప్రాజెక్టులు ప్రభుత్వ సమగ్ర ప్రణాళికలో భాగంగా ప్రారంభమవుతున్నాయి. దేశ రాజధానిలో మెరుగైన అనుసంధానం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో రద్దీని తగ్గించడం ఈ ప్రాజెక్టుల ముఖ్యోద్దేశం.

# పాకిస్థాన్‌ను ముంచెత్తిన వరదలు: 307 మంది మృతి

**కరాచి, ఆగస్టు 16:** దాయాది దేశం పాకిస్థాన్‌ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా పాక్ వ్యాప్తంగా కుంభవృష్టి కురుస్తోంది. ఈ వర్షానికి మెరుపు వరదలు సంభవించాయి. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు, ఇళ్లను వరద ముంచెత్తింది. భారీ వర్షానికి పలు చోట్ల ఇళ్లు, చెట్లు కూలిపోయాయి. కుండపోత వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. ఈ కుంభవృష్టి కారణంగా రెండు రోజుల్లోనే దాదాపు 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర పాకిస్థాన్‌లో భారీ వర్షాలకు సంభవించిన ఆకస్మిక వరదలకు గత 48 గంటల్లో కనీసం 321 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు శనివారం తెలిపారు. అత్యధికంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే 307 మంది మరణించినట్లు ప్రావిన్షియల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్



అథారిటీ తెలిపింది. వంద మందికిపైగా గాయపడ్డారు. అనేక మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. గల్లంతైన వారి కోసం రెస్క్యూ టీమ్స్ గాలింపు చేపడుతోంది. వరదలకు సంబంధించిన షాకింగ్ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌అవుతున్నాయి. మరోవైపు రానున్న రోజుల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశంఉందని పాక్‌వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈహెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులుప్రజలుజాగ్రత్తగాఉండాలని సూచిస్తున్నారు.

# పద్మశ్రీ అవార్డు గ్రహీత పతకాలు చోరీ



**కోల్‌కతా, ఆగస్టు 16:** పద్మశ్రీ అవార్డు గ్రహీత, స్విమ్మింగ్ క్వీన్ బులా చౌదరి ఇంట్లో దొంగలు పడ్డారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా వచ్చిన పలు ప్రతిష్ఠాత్మక పతకాలు, మెమెంటోలు ఎత్తుకెళ్లారు. పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని ఆమె పూర్వీకుల ఇంట్లో ఈ చోరీ జరగడంతో తాను జీవితంలో సంపాదించుకున్న సర్వం కోల్పోయానంటూ బులా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. దొంగలు నేను జీవితాంతం కష్టపడి, ఎంతో అంకితభావంతో సాధించిన అన్నింటినీ దోచుకుపోయారు. క్రీడల్లో గెలుచుకున్న ఆరు బంగారు పతకాలతో సహా అన్ని మెడల్స్, పద్మశ్రీ పతకం కూడా ఎత్తుకెళ్లారని చౌదరి తెలిపారు. తనకు వచ్చిన మెమెంటోలు కూడా దోచుకున్నారని, అయితే అర్జున్ అవార్డు, టెన్జింగ్ నార్గే అవార్డులను దొంగలు వదిలేశారని చెప్పారు. బహుశా సైజులో చిన్నవిగా ఉండ టంతో అర్జున్ అవార్డును, టెన్జింగ్ నార్గే అవా ర్డులను దొంగలు గుర్తించినట్టు లేదని అన్నారు. హిందర్ మోటార్ రెసిడెన్స్‌లో చోరీ జరగడం ఇది మూడోసారని ఆమె చెప్పారు. హిందర్ మో టార్ రెసిడెన్స్ తాళం వేసి ఉంటుంది. అప్పుడ ప్పుడు చౌదరి వెళ్లి చూసుకుంటారు. ప్రస్తుతం ఆమె కోల్‌కతాలోని కస్బా ఏరియాలో కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఆమె పూర్వీకుల ఇంటిని అక్కడికి కొద్ది దూరంలో ఉంటున్న ఆమె సోదరుడు మిలన్ చౌదరి అప్పుడప్పుడు వెళ్లి చూసుకుంటూ ఉంటారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హాలిడే కావడంతో మిలన్ తన సోదరి సూచనల మేరకు ఆ ఇంటిని శుభ్రం చేయించేందుకు వెళ్లారు. లోపలకు వెళ్లగానే ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. వెనుక గేటు తెరిచి ఉండి, గదిలోని వస్తువులు ఎవరో కొల్లగొట్టారు. విషయం తెలిసిన వెంటనే చౌదరి అక్కడకు వెళ్లారు. గతంలో కూడా తన ఇంట్లో దొంగతనాలు జరిగాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని చౌదరి వాపోయారు. దొంగలు నా మెడల్స్ ఎందుకు ఎత్తుకెళ్లారు? ఆ మెడల్స్ వల్ల వాళ్లకు ఏమాత్రం డబ్బులు రావు. అవి నా జీవితంలో సాధించిన విలువైన ఖజానా. నా కెరీర్‌లో సాధించిన విజయాలకు గుర్తులు. ఇల్లు ఖాళీగా ఉండటంతో ప్రతిసారి దొంగలు నా ఇంటిని టార్గెట్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

## భారత్‌పై అదనపు సుంకాలపట్ల మెత్తబడిన ట్రంప్

**అలాస్కా, ఆగస్టు 16:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త మెత్తబడినట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌పై ఆంక్షలు విధించాల్సిన అవసరం రాకపోవచ్చని ఆయన సంకేతాలు ఇచ్చారు. రష్యా ఇప్పటికే భారత్ రూపంలో ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయిందని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. పుతిన్‌తో భేటీ కోసం అలాస్కా పర్యటనకు వెళ్తూ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మాట్లాడారు. పుతిన్ ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయారు. అదే భారత్. ఆ దేశం సుమారు 40 శాతం చమురును కొనుగోలు చేసేదని ఆయన అన్నారు. ఒకవేళ నేను సెకండరీ టారిఫ్‌లు విధించాల్సి వస్తే, అది వారికి చాలా నష్టం కలిగిస్తుంది. అవసరమైతే నేను ఆ పని చేస్తాను. బహుశా ఆ అవసరం రాకపోవచ్చని ట్రంప్ అన్నారు. వాస్తవానికి, ఆగస్టు 27 నుంచి భారత్‌పై 25 శాతం సెకండరీ టారిఫ్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అలాస్కాలో ట్రంప్, పుతిన్




మధ్య చర్చలు సఫలం కాకపోతే భారత్‌పై ఆంక్షలు మరింత పెరగవచ్చని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## అలా చేస్తే ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేస్తా: హిల్లరీ క్లింటన్



**వాషింగ్టన్, ఆగస్టు 16:** తననుతాను గొప్ప మధ్యవర్తిగా, ప్రపంచ శాంతి దూతగా ఆవిష్కరించుకునేందుకు ఉబలాటపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఆపినట్లయితే ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదిస్తానని హిల్లరీ చెప్పారు. అయితే ఒక షరతు ఉందంటూ ట్విస్ట్ ఇచ్చారు. ఉక్రెయిన్ తన భూభాగాన్ని రష్యాకు వదులుకోవాల్సిన అవసరం లేకుండా రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ట్రంప్ ముగించాలని పేర్కొన్నారు. అలా చేసినట్లయితే అమెరికా అధ్యక్షుడిని నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తానని వెల్లడించారు. రేజింగ్ మోడరేట్స్ పాడ్‌కాస్ట్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో హిల్లరీ ఈ మేరకు ప్రకటన చేశారు. నిజాయితీగా చెప్పాలంటే, ఉక్రెయిన్ తన భూమిని దురాక్రమణదారు దేశానికి వదిలివేయాల్సిన అవసరంలేని విధంగా ఇప్పటి వరకు మనం చూడని విధంగా పుతిన్‌కు వ్యతిరేకంగా దృఢంగా నిలబడగలిగే విధంగా మూడేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధాన్ని ముగించేలా చూడాలని హిల్లరీ పేర్కొన్నారు. ట్రంప్ దాని రూపశిల్పి అయితే ఆయనను నోబెల్ బహుమతికి ప్రతిపాదిస్తానన్నారు. కాగా, రష్యా, ఉక్రెయిన్ మధ్య మూడేండ్లుగా సాగుతున్న యుద్ధాన్ని ముగించడమే ప్రధాన అజెండాగా అలాస్కాలో ట్రంప్, పుతిన్ భేటీ కొనసాగింది.

# సంక్షిప్తంగా..

## కాక్‌పిట్ డోర్ తెరిచే ఉంచి నడిపిన పైలట్ సస్పెన్షన్




**లండన్, ఆగస్టు 16:** విమానం నడుపుతున్న తనను చూసి కుటుంబ సభ్యులు మురిసిపోవాలనుకున్నాడో ఏమో గానీ, ఓ పైలట్ చేసిన పని అతడి ఉద్యోగానికే ఎసరు తెచ్చింది. లండన్‌లోని హీత్రూ నుంచి న్యూయార్క్ వెళ్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ప్రయాణ సమయంలో కాక్‌పిట్ డోర్‌ను తెరిచే ఉంచి, ఉగ్రవాద నిరోధక చట్టాలను ఉల్లంఘించిన ఆరోపణలపై సస్పె న్షన్‌కు గురయ్యాడు. ఇటీవల హీత్రూన్యూ యార్క్ విమానంలో ఓ పైలట్ కాక్‌పిట్ డోర్‌ను మూయకుండానే విమానాన్ని నడిపాడు. అదే విమానంలో ప్రయాణిస్తున్న తన కుటుంబ సభ్యులకు, తాను విమానాన్ని ఎలా ఆపరేట్ చేస్తానో చూపించాలనే ఉద్దేశంతోనే ఇలా చేసినట్లు తెలుస్తోంది. అయితే, విమానం గాల్లో ఉండగా కాక్‌పిట్ డోర్ తెరిచి ఉండటాన్ని గమనించిన ప్రయాణికులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

## 'ఎయిర్ కెనడా' సిబ్బంది సమ్మె: 700 సర్వీసులపై ప్రభావం



**ఒట్టావా, ఆగస్టు 16:** వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫ్లయిట్ అటెండెంట్ల సమ్మె నేపథ్యంలో ఎయిర్ కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె నోటీసు గడువు శనివారంతో ముగియడంతో.. ఎయిర్ కెనడా, అనుబంధ సంస్థ ఎయిర్ కెనడా రూజ్ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. థర్డ్ పార్టీ నిర్వహిస్తున్న ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సేవలు మాత్రం కొనసాగుతాయని తెలిపింది. తాజా పరిణామంతో రోజుకు 1.3లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. కెనడాలో అతిపెద్ద విమానయాన సంస్థగా ఉన్న ఎయిర్ కెనడా నిత్యం 700 సర్వీసులు నడిపిస్తోంది. ఇందులో 10 వేల మంది ఫ్లయిట్ అటెండెంట్లు పనిచేస్తున్నారు. విమానప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు వీరిదే బాధ్యత. అయితే, వేతనాల పెంపునకు సంబంధించి కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయిస్ ఈ నెల 13న మూడు రోజుల సమ్మె నోటీసు ఇచ్చింది. నేటితో ఆ గడువు ముగియగా ఇప్పటికీ ఒప్పందం కుదరకపో వడంతో సమ్మె ప్రారంభమైనట్లు ఉద్యోగసంఘం వెల్లడించింది.

## ఓట్లచోరీపై రాహుల్ వ్యంగ్యోక్తుల విడియో



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ఓట్ చోరీకి పాల్పడుతోం దంటూ ఎన్నికల కమిషన్‌పై వరుస విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి ఓట్ల చౌర్యంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హాస్యం, వ్యంగ్యం మేళవించిన స్పూఫ్ వీడియోను శనివారంనాడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో షేర్ చేశారు. బాలీవుడ్ చిత్రం లాపతా లేడీస్ స్ఫూర్తితో ఈ వీడియోను రూపొందించారు. రహస్యంగా, దొంగతనంగా ఇక వద్దు, ప్రజలు మేలుకొన్నారని రాహుల్ ఆ వీడియోతో పాటు ఒక పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఒక మధ్యవయస్కుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వస్తాడు. ఏమి పోయిందని అధికారి అడుగుతాడు. ఆ వ్యక్తి కొద్ది సేపు ఆగి నా ఓటు అని చెబుతాడు. ఆశ్చర్య పోవడం ఆ పోలీసు అధికారి వంతవుతుంది. ఓటు ఎత్తుకెళ్లడం ఎవరికైనా ఎలా సాధ్యమ వుతుంది? అని ఆయన అడుగుతాడు. నకిలీ ఓట్లద్వారా లక్షలాది ఓట్లు చోరీ అవుతున్నాయని ఆ మధ్యవయస్కుడు జవాబిస్తాడు. ఒకరి ఓటును దోచుకోవడం అంటే ఒకరి హక్కును దోచుకోవడమే అనే సందేశంతో వీడియో ముగుస్తుంది.

## అల్లుడిని స్తంభానికి కట్టేసి కొట్టిన అత్తమామలు

### ఒడిశా భువనేశ్వర్‌లో చోటు చేసుకున్న ఘటన



**భువనేశ్వర్, ఆగస్టు 16:** అల్లుడిని అతడి అత్తమామలు స్తంభానికి కట్టేసి కొట్టారు. రాత్రంతా అతడిని అలాగే కట్టేసి ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మరునాడు ఉదయం అక్కడకు చేరుకున్నారు. కట్లు విప్పి అతడిని విడిపించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ఒడిశాలోని గజపతి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జలాంత బలియార్‌సింగ్ అనే వ్యక్తిఏడాది కిందట భార్య సుభద్ర మాల్చిసోయేను కొట్టాడు. ఇది తెలిసి గ్రామపెద్దలు అతడ్ని పిలిపించారు. అతడి భార్యను కొన్ని నెలలపాటు పుట్టింట్లో ఉండాలని సూచించారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ గృహహింస కేసుపై ఏడాదిగా కోర్టులో విచారణ కొనసాగుతున్నది. కాగా, ఆగస్ట్ 14 రాత్రి వేళ జలాంత బలియార్‌సింగ్ కిరాణా సరుకులు కొనేందుకు తన అత్తమామలు నివసించే గ్రామానికి వెళ్లాడు. అక్కడ వారు కనిపించడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో అత్తింటి వారు అతడిని ఒక స్తంభానికి కట్టేసి కొట్టారు.

17-08pg6exHMNWJQE_17-08pg6exHMNWJQE.qxd 8/17/2025 12:29 AM Page 1



# వర్షాకాలంలో రైలు మార్గాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

## - ప్రత్యేక భద్రతా సమావేశంలో రైల్వే జిఎం ఎస్‌కె శ్రీవాత్సవ



వర్షాకాలంలో రైలు మార్గాల నిర్వహణపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న రైల్వే జీఎం శ్రీవాత్సవ

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 16,ప్రభాతవార్త** ప్రస్తుత వర్షాకాలంలో రైలు మార్గాల నిర్వహణను నిత్యం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా ఎదుర్కోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. శనివారం రైల్వే నిలయం నుండి ప్రత్యేక భద్రతా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రైల్వే జోన్ పరిధిలోని వివిధ డివిజన్లలో రుతుపవనాల ప్రభావంపై రైల్వే సిబ్బంది సన్నద్ధత,భద్రతపై ఈ సమావేశంలో ఆయన సమీక్షించారు. జోన్‌కు చెందిన వివిధ విభాగాల ప్రధాన అధికారులతో పాటు సికింద్రా బాద్,హైదరా బాద్, విజయవాడ, గుంత కల్లు, గుంటూరు, నాం దేడ్ డివిజన్లకు చెందిన డిఆర్ ఎంలు, సంబంధిత ఉన్నతాధి కారులు ఈ వీడియో కాన్ఫ రెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వర్షాకాలంలో వంతెనలు, సొరంగాలు వాటి నిర్వహణ స్థితిపై ప్రాథమిక దృష్టిని పెట్టాలని సూచించారు. అత్యవసర పరికరాల లభ్యతను ఏదైనా సంఘటన జరిగినప్పుడు అవసరమైన ఇసుక, బండరాళ్లు,పైపుల వంటి అవసరమైన వస్తు సామాగ్రి నిల్వలను కూడా ఆయన సమీక్షించారు. భారీ వర్షాలు కురిసిన పక్షంలో ప్రమాదానికి గురయ్యే వంతెనలు, ట్యాంక్ బండ్‌ల వద్ద రేయింబవళ్లు పర్యవేక్షించేందుకుగాను పెట్రోలింగ్ సిబ్బందిని ముందు జాగ్రత్తగా నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన తక్షణ చర్యలు చేపట్టేందుకు 24గంటలు రైలు మార్గాలను పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సైడ్ వాటర్ డ్రెయిన్లు,వాటర్‌వేలను శుభ్రపరచడం, నిర్వహించడంతో పాటు రైలు కమ్మిలపై వరదనీరు ప్రవహించకుండా,రైలు సాఫీగా నడిచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. పరికరాల సురక్షితమైన పని విధానాలను, రైలు కార్యకలాపాలకు సంబంధించిన రిజిస్టర్ల సరైన నిర్వహణ, అవసరమైన అన్ని వర్షాకాల జాగ్రత్తలు చేపట్టాలని ఆయన అధికారులకు, సిబ్బందికి సూచించారు. పర్యవేక్షక సిబ్బంది జోన్ స్థాయి కార్యచరణను నిరంతరం పర్యవేక్షించాలని, ఏదైనా సమస్య ఉత్పన్నం అయిన పక్షంలో తక్షణమే హాజరు కావాలని,వీలైనంత త్వరగా పరిస్థితిని సరిదిద్దాలన్నారు. గ్రూప్ మీటింగ్‌లు, వ్యక్తిగత కౌన్సిలింగ్ సెషన్‌ల ద్వారా భద్రతా కేటగిరీ సిబ్బందికి క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు.

# సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా సిఎం చంద్రబాబు నివాళి



**విజయవాడ,ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** విలువల కోసం నిరంతరం కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న యావత్ జాతికి ఒక స్ఫూర్తి దాయకులని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో చంద్రబాబు నాయుడు గౌతు లక్షన్న 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానిస్తూ సమాజంలో సమానత్వం, న్యాయం, మానవత్వం బలంగా స్థిరపడతాయి. ఆయన ఆలోచనలు, ఆయన పోరాట పటిమ కొత్త తరానికి ప్రేరణగా నిలుస్తాయి. ఆధునికత, మారుతున్న విలువల మధ్య యువతకు దిశా నిర్దేశం కావలసిన సమయం ఇదన్నారు. అలాంటి సందర్భంలో గౌతు లచ్చన్న జీవితం ఒక మార్గదర్శక దీపం. ఆయన కృషి ద్వారా సమాజం కోసం త్యాగం అంటే ఏమిటో, నిజమైన ప్రజాసేవ అంటే ఏమిటో తెలుసుకోవచ్చు. సమాజంలో శాశ్వత మార్పు రావాలంటే త్యాగం, పట్టుదల, నిజాయితీతో కూడిన నాయకత్వం అవసరం. అలాంటి అసమాన్య నేతలలో ఒకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఆయన జీవితమంతా పేదల కోసం, కూలీల కోసం, వెనుకబడిన వర్గాల కోసం అంకితమైంది. సాధారణ కుటుంబం నుండి వచ్చినా, సమాజంలో న్యాయం నెలకొల్పడమే తన కర్తవ్యమని భావించి, అన్యాయానికి ఎదురు నిలిచిన ధైర్యవంతుడు ఆయన. గౌతు లచ్చన్న జీవితం ఒక ఉద్యమ గాథ.

సామాన్య ప్రజల కోసం, బలహీన వర్గాల హక్కుల కోసం ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కి తగ్గని స్వభావం ఆయనకు ఉన్నది. రాజకీయాలు ఆయనకు అధికారం కోసం మార్గం కాదు, సేవ కోసం వేదిక. సమాజంలో సమానత్వం నెలకొల్పడమే ఆయన ప్రధాన ఆశయం అని అన్నారు.

# ఉద్యమాల నిప్పుకణిక డా.సర్దార్ గౌతులచ్చన్న

## గౌతు లచ్చన్న శతజయంతి సభలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత, అనగాని సత్యప్రసాద్ తదితరులు



**విజయవాడ, ఆగస్ట్ 16,ప్రభాత వార్తప్రతినిధి:** సమాజంలో అస మానతలను తొలగించేందుకు డా. సర్ధార్ గౌతు లచ్చన్న చేసిన పోరాటాలు, రైతు బడుగు బలహీన వర్గాల కోసం చేసిన నిరసనలు, నిరాహార దీక్షలు, రైలు రోకోలు ఆయన ధైర్యసాహసాలకు నిదర్శనమని, గౌతు లచ్చన్న పదవులు కోసం కాకుండా ప్రజల కోసం పోరాడారని అందుకే ఆయనను నేటికీ ఉద్యమాల నిప్పుకణికగా గౌరవంగా స్మరించుకుంటామని రాష్ట్ర వ్యవసాయ,సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. డా. సర్ధార్ గౌతు లచ్చన్న 116 జయంతిని రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హజరై సర్ధార్ గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో గౌతు లచ్చన్న పేరు ఒక అజరామరం అని, సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల కోసం, రైతు కూలీల కోసం, వెనుకబడిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసుకున్న మహానుభావుడు లచ్చన్న అని అన్నారు. తెలుగునాడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన రోజుల నుండే ఆయన జీవితానికి ఉద్యమాలే పునాది. సాదాసీదా కుటుంబంలో పుట్టినా, లక్ష్యమున్న నాయకుడిగా ఎదిగి, న్యాయం కోసం కఠినంగా నిలబడిన "సర్ధార్" అన్న బిరుదును ప్రజలే అందచేశారని తెలిపారు. రాజకీయాల్లో ఎప్పటికీ మాయమవని ఒక వెలుగుదీపంలా ఆయన కీర్తి నిలిచిపోయిందని, నిజాయితీ, అంకితభావం, ధైర్యం ఈ మూడు గౌతు లచ్చన్న వ్యక్తిత్వానికి ప్రతిరూపాలని అన్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన లచ్చన్న , యావత్ జాతికి ఒక స్ఫూర్తి ప్రదాత అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సమాజంలో సమానత్వం, న్యాయం, మానవత్వం బలం గా స్థిరపడ తాయి. ఆయన ఆలోచ నలు, ఆయన పోరాట పటిమ కొత్త తరానికి ప్రేరణగా నిలు స్తాయి. ఆధునికత, గ్లోబలైజేషన్ ప్రభా వంతో మారుతున్న విలువల మధ్య యువతకు దిశా నిర్దేశం కావలసిన సమయం ఇది. అలాంటి సందర్భంలో గౌతు లచ్చన్న జీవితం ఒక మార్గదర్శక దీపం. ఆయన కృషి ద్వారా సమాజం కోసం త్యాగం అంటే ఏమిటో, నిజమైన ప్రజాసేవ అంటే ఏమిటో తెలుసుకోవచ్చు. సమాజంలో శాశ్వత మార్పు రావాలంటే త్యాగం, పట్టుదల, నిజాయితీతో కూడిన నాయకత్వం అవసరం. అలాంటి అసమాన్య నేతలలో ఒకరు సర్ధార్ గౌతు లచ్చన్న. ఆయన జీవితమంతా పేదల కోసం, కూలీల కోసం, వెనుకబడిన వర్గాల కోసం అంకితమైంది. సాధారణ కుటుంబం నుండి వచ్చినా, సమాజంలో న్యాయం నెలకొల్పడమే తన కర్తవ్యమని భావించి, అన్యాయానికి ఎదురు నిలిచిన ధైర్యవంతుడు ఆయన. గౌతు లచ్చన్న జీవితం ఒక ఉద్యమ గాథ. సామాన్య ప్రజల కోసం, బలహీన వర్గాల హక్కుల కోసం ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కి తగ్గని స్వభావం ఆయనకు ఉన్నది. రాజకీయాలు ఆయనకు అధికారం కోసం మార్గం కాదు, సేవ కోసం వేదిక. సమాజంలో సమానత్వం నెలకొల్పడమే ఆయన ప్రధాన ఆశయం అని అన్నారు. రైతు పట్ల ఆయనకున్న అనుబంధం అంతులేనిది. రైతు హక్కుల కోసం న్యాయస్థానాల వరకు వెళ్లి పోరాడిన వ్యక్తి ఆయనే. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడాలంటే రైతే బలపడాలని ఆయన ఎప్పుడూ నమ్మారు. పేద కూలీలకు, శ్రామికులకు, గిరిజనులకు ఎప్పటికీ అండగా నిలిచిన నాయకుడు.

# గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం

**కాణిపాకం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారికి శనివారం రాత్రి గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకం ఆలయంలో గోకులాష్టమి పండుగ పర్వదినం సందర్భంగా స్వామివారికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన ధనంజయ యాదవ్,దేవరాజులు యాదవ్, రేణుగోపాల్ యాదవ్, రాజేంద్ర యాదవ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో ఉదయం స్వామి వారం మూలవిరాట్‌కు ఉభయదారులచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే రాత్రి అర్చకస్వాములు సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాదాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన మూషిక వాహనంపై స్వామి, అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, అధికారులు, అర్చకులు వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

# మట్టిలో మాణిక్యాలను ప్రభుత్వ స్కూల్ ద్వారా వెలికి తీయడమే లక్ష్యం :మంత్రి నారాయణ



**నెల్లూరు, ఆగష్టు 16, ప్రభాతవార్త-వైద్యం** నాణ్యమైన విద్య లేక.. ఎంతో మంది ప్రతిభ కలిగిన విద్యార్థులు చదువుకోలేకపోతున్నారని, వారికి కార్పొరేట్ తరహాలో విద్యను అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని 15 ఉన్నత పాఠశాలను వీఆర్ హైస్కూల్ తరహాలోనే అభివృద్ధి చేస్తానన్నారు. శనివారం నగరంలోని 9వ డివిజన్ చిన్న బాలయ్య, 14వ డివిజన్‌లోని మల్లెల సంజీవయ్య, 45వ డివిజన్లోని నగర పాలక ఉన్నత పాఠశాలలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. రాబోయే జూన్ మాసం నాటికి నగరంలోని 15 ఉన్నత పాఠశాలలను అన్ని హంగులతో పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పీ4 విధానంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానాన్ని అనుసరించి నర్సరీ నుండి 12వ తరగతి వరకు ఒకే ప్రదేశంలో పాఠశాలలు ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు. త్వరలోనే ఎస్టిమేట్స్ తయారు చేయించామని ఆదేశించామన్నారు. నిన్న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. మహిళల ఆనందానికి హద్దులు లేవని అన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీగా ఉన్నా చంద్రబాబు అపార అనుభంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారన్నారు. అదేవిధంగా నెల్లూరు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. నగర ప్రజలకు మంచినీటి సౌకర్యంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కాలువలకు ఇరు వైపులా గోడలు నిర్మించి, స్లాబు సైతం వేస్తామని అప్పుడు మాత్రమే దోమలు లేని నగరంగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. నగరంలోని అల్లీపురం, దొంతాలి డంపింగ్ యార్డుల్లో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను పూర్తి స్థాయిలో తొలగిస్తామన్నారు. ఏసీ నగర్లోని మల్లెల సంజీవయ్య పాఠశాలలో కరాటే సాధన చేస్తున్న విద్యార్థులతో మంత్రి ఫోటోలు దిగి మెరిట్ సాధించిన కరాటే విద్యార్థులకు మెడల్స్ అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్‌తో పాటు టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, 9వ డివిజన్ పాకాల పెంచలయ్య, నాగేశ్వరరావు, సురేష్, సుబ్బలక్ష్మి, మంగమ్మ, 14వ డివిజన్ కార్పొరేటర్ రక్తం ప్రతాప్‌రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ పసుపులేటి మల్లిఖార్జున, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్, 15వ డివిజన్ ప్రెసిడెంట్ చౌదరి, 45వ డివిజన్ పుట్ట అజయ్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, పోకల రవి, ఎద్దు మహేష్, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డా.కత్తి పద్మారావుకు విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం

**అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త బ్యూరో** తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి చేసి, ఏడు పదుల వయసు పైబడిన ఒక ప్రముఖ సాహితీవేత్తకు ఇస్తున్న విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి గాను ప్రముఖ కవి, సాహితీవేత్త డా.కత్తి పద్మారావుకు అందజేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ సాహిత్య వేత్తలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి (రాయలసీమ), కె.పి అశోక్ కుమార్(తెలంగాణ), గంటేడ గౌరునాయుడు(కోస్తా) జ్యూరీ సభ్యులుగా, మా సాహిత్య సంస్థ సూచించిన నియమ నిబంధనలను అనుసరించి, కొంతమంది సుప్రసిద్ధ సాహిత్య కురువృద్ధుల పేర్లను, వారి అపారమైన నిబద్ధ సాహిత్య కృషిని పరిణనలోకి తీసుకొని, డా.కత్తి పద్మారావుని ఏకగ్రీవంగా మా విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం 2025 కోసం ఎంపిక చేశారు అని ప్రముఖ కవి, సాహితీవేత్త శాంతి నారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. జ్యూరీ సభ్యుల ఏకగ్రీవ ఎంపికను సగౌరవంగా ఆనందంగా ఆమోదిస్తూ డా.కత్తి పద్మారావుకు ఈ పురస్కారాన్ని ప్రకటిస్తున్నాను అని ఆయన తెలియజేశారు. మహా సంస్కృతాంధ్ర భాషాపండితుడు, కవి, గొప్ప చరిత్రకారుడు, సామాజిక తత్వవేత్త, బుద్ధిస్టు, అంబేద్కరిస్టు, మూర్తీభవించిన దళిత బహుజన స్త్రీవాది, హేతువాది, మహా మానవతావాది కత్తి పద్మారావు ఆయన వెల్లడించారు. కట్టెల మోపు, ఈ యుగం మాది, ఒక అస్పృశ్యని యుద్ధగాధ, తెలుగు సాహిత్య చరిత్ర, ఆత్మగౌరవ స్వరం వంటి శతాధిక గ్రంథ కర్తే కాదు, దళిత మహోద్యమ వ్యవస్థాపకుడు, అంబేద్కరిజమే తన వాక్కూ, వాగ్స్వరంగా, శ్వాసా ధ్యాసగా, నడకగా జీవిస్తున్న మహా నిబద్ధ జీవనశిల్పి అని ఆయన వెల్లడించారు



# ఇంద్రకీలాద్రిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 16, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శనివారం శ్రీకృష్ణ స్వామివార్లకు అభిషేకాలు, పూజాదికాలు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం చూడముచ్చటగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఇఓ వికె శీనా నాయక్ దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ధూప, దీప నివేదనలను సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. దుర్గమ్మవారి ఆలయంలోని వైద్యసహాయ కేంద్రం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని ఇఓ వికె శీనా నాయక్ ఆదేశించారు. శనివారం ఆయన ఆలయంలోని వైద్య కేంద్రాన్ని పరిశీలించి చిన్నపాటి ఇరుకుగదిలో ఆరోగ్యకేంద్రం నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలంగా వెలుగు బాగా వుండేలా వైద్యకేంద్రం ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శనివారం విస్సన్నపేటకు చెందిన గణపవరపు ఉమాదేవి, వెంకట విజయ రామసాయి సతీమణి పేరున రు.1,00,116లను విరాళంగా అందించారు. అలాగే గొల్లపూడికి చెందిన గణేష్‌ట్రాన్స్‌పోర్ట్ యజమాని వివి రామప్రసాద్ దంపతులు రు.1,01,116ల విరాళాన్ని వారి కుటుంబసభ్యులు జ్యోతిర్మయి, కుమారులు తిరుమలేష్, కోడలు మానస్విని, రెండో కుమార్డు సాయి తేజేష్ లు అందించారు. ఇదేవిధంగా శ్రీ అమ్మవారి ఉచిత ప్రసాద వితరణకు రు.1,00,116ల విరాళాన్ని విజయవాడలోని శ్రీ దుర్గాభవాని ధర్మ ప్రచార పరిషత్ కు చెందిన ధారవు వెంకట రామప్రసాద్, సతీమణి ఇందుమతి, వారి తల్లిదండ్రులు ధారవు కేశవరావు, లక్ష్మి కాంతమ్మ, మామ చింత వెంకటేశ్వరరావు, నాగమణి దంపతుల పేరిట విరాళంగా అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు.

# బుడమేరును ప్రక్షాళన చేయండి

## రాష్ట్ర బిఎస్పీ అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్



విజయవాడ,ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విజయవాడ నగర ప్రజలు పరివాహక ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన గురవుతున్నారని బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ అన్నారు. తక్షణమే బుడమేరు ప్రక్షాళన చేయాలని విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ. సీఎం చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత బుడమేరు ప్రక్షాళన చేస్తానని...ఇప్పుడేమో బుడమేరు రాదు.. ప్రజలు అధర్య పడొద్దు అంటూ అబద్ధపు మాటలు చెబుతున్నారని తక్షణమే బుడమేరును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్ లో విజయవాడ పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. బుడమేరు వస్తుందన్న విషయం అధికారులకు ప్రభుత్వానికి తెలిసిన ప్రజలు ఎవరిని ముందుగానే హెచ్చరించిన సందర్భాలు లేవన్నారు. చిన్నపాటి వర్షం పడుతుంటేనే నగరంలోని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని వారికి భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విజయవాడ నగరాన్ని వరదలు ముంచెత్తిన విషయంలో భాగంగానే నగరంలో సగ భాగం దాదాపు పది రోజులు పాటు వరద బురదలోని చిక్కుకొని ఉందన్నారు... కొందరు ప్రాణాలు కూడా కోల్పోయార న్నారు.

# కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ముఖ్యమంత్రి జగన్

**విజయవాడ,ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** అధర్మం ఎంత బలంగా ఉన్నా - అది తాత్కాలికం. ధర్మం ఎంత నెమ్మదిగా ముందుకెళ్లినా - అది శాశ్వతం. శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనం." ఈ కృష్ణాష్టమి మీకు శాంతిని, ప్రేమను, విజయాన్ని తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు. "ఎక్స్'వేదికగా శుభాకాంక్షలు తెలిపారు ఆయన కృష్ణతత్వం జీవితం ఆమోఘమన్నారు."అధర్మం ఎంత బలంగా ఉన్నా - అది తాత్కాలికం. ధర్మం ఎంత నెమ్మదిగా ముందుకెళ్లినా - అది శాశ్వతం. శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనం." ఈ కృష్ణాష్టమి మీకు శాంతిని, ప్రేమను, విజయాన్ని తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు.

# నటునిగా స్వర్ణోత్సవం జరుపుకుంటున్న రజినీకాంత్‌కు డిసిఎం పవన్ శుభాకాంక్షలు

**విజయవాడ,.ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్ స్టార్ రజినీకాంత్ సినీ రంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజినీకాంత్ కి ఈ సందర్భంగా ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తరాలు మారుతున్నా రజినీకాంత్ అంటే.. సినీ ప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదని చెప్పారు. ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న అగ్రశ్రేణి కథానాయకుడు రజినీకాంత్ అని కొనియాడారు. నటుడిగా 5 దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారని ప్రశంసించారు. వెండి తెరపై 'సూపర్ స్టార్ రజినీ' అని టైటిల్ కనిపించగానే థియేటర్ ఏ విధంగా మార్మోగుతుందో పలుమార్లు తాను చెన్నైలో చూశానని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గుర్తు చేసుకున్నారు. నటుడిగా ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రతినాయక పాత్ర పోషించినా.. కథానాయకుడిగా మెప్పించినా రజినీకాంత్ తనదైన స్టైల్‌ను చూపించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారంటూ ప్రశంసించారు. రజినీ నడకలో.. సంభాషణలు పలకడంలో.. హావభావ విన్యాసంలో ప్రత్యేకతను చూపిస్తారని పేర్కొన్నారు. రజినీకాంత్ స్టైల్స్‌కి నవతరం ప్రేక్షకుల్లోనూ అభిమానులున్నారన్నారు. నటుడిగా శిఖరాగ్ర స్థాయికి చేరిన రజినీకాంత్ మహావతార్ బాబాజీ భక్తుడిగా ఆధ్యాత్మిక విషయాలు, యోగా సాధనపై ప్రత్యేక శ్రద్ధ చూపడం.. ఆయనలో భక్తి భావాన్ని, ధార్మిక విశ్వాసాలను తెలియజేస్తుందని తెలిపారు. నటుడిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటున్న రజినీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని తాను ఆకాంక్షిస్తున్నానని స్పష్టం చేశారు పవన్. రజినీకాంత్‌కి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు అందించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు.

# కటకటాల వెనుకకు ఉగ్రవాది!

## నూర్ మహమ్మద్ పై దేశద్రోహం కేసు నమోదు!

**ధర్మవరం,ఆగస్టు16(ప్రభాతవార్త)** ధర్మవరంలో ఎన్ఐఏ, ఐబి పోలీస్ అధికారుల తనిఖీల్లో ఆధారాలతో సహా పట్టుబడిన నూర్ మహమ్మద్ కటకటాల పాలయ్యాడు. శనివారం ధర్మవరంలో తనిఖీలు నిర్వహించి ఉగ్రవాది నూర్ మహమ్మద్ నివాసంలో లభ్యమైన 16 మొబైల్ సిమ్ లు, ఒక సాటిలైట్ మొబైల్ తో పాటు ఉగ్రవాద సాహిత్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు నూర్ మహమ్మద్ సాగించిన కార్యకలాపాలపై విచారణ నిర్వహించారు. ఎన్ఐఏ అధికారులు నిర్వహించిన లోతైన విచారణలో అనేక కీలక విషయాలు వెలుగు చూశాయి. దాదాపు పాకిస్తాన్ కు చెందిన 29 సోషల్ మీడియా ఉగ్రవాద గ్రూపులలో కీలక సభ్యుడిగా నూరు మహమ్మద్ ఉగ్రవాద కార్య కలాపాలు కొనసాగించినట్టు ఆధారాలతో సహా బయటపడ్డాయి. దీంతో పోలీసు అధికారులు నూర్ మహమ్మద్ ను న్యాయస్థానం ముందు హాజరు పరిచి దేశద్రోహం కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు . భారీ పోలీసు బందోబస్తు మధ్య కదిరి అదనపు జ్యుడీషియల్ న్యాయాధికారి ఎదుట ఉగ్రవాదిని హాజరపరిచారు ధర్మవరం పోలీసులు. పరిశీలించిన న్యాయాధికారి పి.లోకనాథం ఉగ్రవాదిని ఈ నెల 29 వరకు జ్యూడిషల్ కస్టడీకి ఆదేశించారు. ఉగ్రవాద నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు భారీ పోలీసు బందోబస్తుల మధ్య తరలించినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

# పోలవరం కాపర్‌డ్యామ్ స్వల్ప కుంగుబాటు

## పది అడుగుల వెడల్పు ఎనిమిది అడుగుల లోతు చిన్నగొయ్యి

**హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యాం ఎడమ వైపు ఎగువన స్వల్పంగా కూలిపోవడం నీటిపారుదలశాఖ అధికారులు గర్తించారు .పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం వద్ద మట్టి కుంగడంతో ఎన్‌డిఎస్ఎ కేంద్రప్రభుత్వం సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం డ్యాంభద్రతపై చర్చకు దారి తీసింది.సిడబ్ల్యుసి అధికారి చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో పోలవరం డ్యాం కోసం నిర్మించిన నిర్మాణాలు గతంలో కొట్టుకుపోయి భారీగా ఆర్థిక నష్టం కలిగింది.ప్రస్తుతం 10 అడుగుల వెడల్పు. 7 నుంచి 8 అడుగుల లోతున చిన్నగోతి ఏర్పడింది. శుక్రవారం ఉదయం దీన్ని గుర్తించిన అధికారులు యుద్ధప్రాతిపదికన ఆ ప్రాంతాన్ని పటిష్ఠపరిచే పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం +28 మీటర్ల వద్ద ఉంది. పైగా ఎగువనే నిర్మాణంలో వాడిన మెటీరియల్ మట్టి పడిపోయింది తప్ప దిగువ నుంచి ఎలాంటి సమస్య లేదు. దిగువన ఇప్పటికే బట్రస్ డ్యాం నిర్మాణం పూర్తి చేసినందువల్ల ఎగువ కాఫర్ డ్యాం కట్టడానికి వచ్చిన సమస్య ఏమీ లేదని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. ఆయనతో పాటు పోలవరం ఎస్ఈ రామచంద్రరావు ఆ ప్రాంతాన్ని సందర్శించినారు. మట్టి మెటీరియల్ జారినంత మేర పటిష్ఠపరిచే పనులు చేయించారు. ప్రధాన జలాశయం నిర్మాణమయ్యే లోపు నీటిని మళ్లించేందుకు వీలుగా నిర్మించిన తాత్కాలిక కట్టడమే ఇది. ఎగువ కాఫర్ డ్యాం కడుతారు. దీనికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే విదేశీ నిపుణుల బృందం సిఫార్సు మేరకు బట్రస్ డ్యాం నిర్మించారు. ఎగువ కాఫర్ డ్యాం పైనుంచి పోశమ్మ గండి వైపు (అల్లూరి సీతారామరాజు జిల్లా) నుంచి వాహనాలు కూడా ప్రయాణిస్తున్నాయి. 2022 ఆగస్టులో గోదావరికి భారీ వరదలు వచ్చాయి. అప్పట్లో మరింత వరద పెరుగుతుందేమోనన్న ఉద్దేశంతో ఎగువ కాఫర్ డ్యాం వెడల్పు 9 మీటర్లు ఉండేలా,ఎత్తు మరో 2 మీటర్ల మేర పటిష్ఠం చేశారు. అలా పైన పెంచిన ప్రాంతంలో మాత్రమే ఇప్పుడు కొద్దిగా జారిందని అధికారులు వివరించారు. మళ్లీ వాహనాల రాకపోకలు కూడా ప్రారంభమయ్యాయని, సమస్య ఏమీ లేదని తెలిపారు. నిరంతరం పర్యవేక్షణ ఏర్పాటు చేశామని వెల్లడించారు.

# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), ఆగష్టు 16, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ఉదయం స్వామి వారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం(అభిషేకం) నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మి,చెంచులక్ష్మి అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

17-08Pg7 gnt_17-08Pg7 gnt.qxd 8/17/2025 12:58 AM Page 1



## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పెదనందిపాడు ఆగస్టు 16 (ప్రభాతవార్త) పెదనందిపాడు లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి గోకులాష్టమి



సందర్భంగా . ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం సత్యనారాయణ చార్యులు. హనుమంతాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారుజామున నుండి సుప్రభాత సేవ సాలిగ్రామ సప్త కార్యక్రమం . భగవద్గీత విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమములు భక్తుల సహకారంతో అత్యంత వైభవంగా జరిగాయి.సాయంత్ర వేణుగోపాలస్వామి వారి దేవాలయ సన్నిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా.భక్త సమాజములుముతో భజన సంకీర్తన కార్యక్రమములు రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



వత్తిపాడు ఆగస్టు 16. (ప్రభాతవార్త) జూనం చుండూరు లోని గ్రామంలో వేంచేసి ఉన్న ప్రాచీన శ్రీ సమ్మోహన వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మ జన్మాష్టమి వేడుకల ను ఆలయ అర్చకులు తరిమిశ శ్రీధర్ ఘనంగా నిర్వహించారు . సందర్భంగా గ్రామస్తులు. ఉభయ దేవరలతో శ్రీ సమ్మోహన వేణుగోపాలస్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో గోకులాష్టమి సంబరాలు

**శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. ఓ వైపు వారాంతపు రద్దీ. మరో వైపు వరుస సెలవులు,వెరసి జనంతో కిట కిట లా డింది. శనివారం శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆలయంలో అభయ వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహం వెలసింది. ఇక్కడ స్వామికి ప్రత్యేక అలంకారాలు భక్తుల్ని ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా వెంకటేశ్వరస్వామి హస్తం కిందకు చూపుతుంటుంది. కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వెంకటేశ్వరస్వామి విగ్రహం అభయమిస్తున్నట్లు ఉంటుంది. దీని ప్రాశస్త్యంను బాగా ప్రచారం చేస్తున్నారు. వేదపండితులు,అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడశోపచారాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళ కళ లాడింది.రాహుకేతుదోష నివారణ పూజలుసుమారు 6 వేలు జరిగాయి. ఇక అభిషేకాలు విశేష సంఖ్యలో జరిగాయి.ఇక్కడ సూచిక బోర్డులేకపోవటంతో ఎవరు టిక్కెట్లు కొంటున్నారో? ఎవరు ఎటు వెళ్ళాలో తెలియక తిప్పలు పడ్డారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివాలయాన్ని నిలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిథులతో ఆలయం కిట కిట లాడింది.అదును తీసి అదును వేయలేని స్థితి చోటు చేసుకుంది. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది.

# ఇస్కాన్ టెంపుల్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

## ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించిన వేమిరెడ్డి



**నెల్లూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త** నెల్లూరు కేంద్రంలో ఉన్న ఇస్కాన్ టెంపుల్ ను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ అన్నారు. శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా నగరంలోని ఇస్కాన్ టెంపుల్‌లో వేమిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం చేశారు. ముందుగా ఇటీవల కృష్ణాష్టమి నేపథ్యంలో చిన్నారులకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్, శ్లోక పఠనం, డ్రాయింగ్ వంటి పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను వేమిరెడ్డి దంపతులు అందజేశారు. అనంతరం శ్రీ కృష్ణ ఆలయాలపై రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ ను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈ విషయంపై సీఎం చంద్రబాబు గారితో కూడా చర్చిస్తున్నామన్నారు. ఇస్కాన్ టెంపుల్‌ను మరో చోట ప్రశాంతమైన వాతావరణంలో ఏర్పాటు చేసేలా స్థలాన్ని కూడ చూస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల తాకిడి పెరిగిందని, అందుకు తగ్గట్లుగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారి ఆశీసులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు ఇస్కాన్ టెంపుల్‌తో తమకు 13 ఏళ్ల అనుబంధం ఉందని, స్వామివారి ఆశీసులతో ప్రజలకు సేవల చేస్తున్నామన్నారు. శ్రీ కృష్ణుడు మనకు అందించిన అద్భుత వరం భగవద్గీత అని, ప్రతి ఇంట్లో పిల్లలకు భగవద్గీత చదివించడం అలవాటు చేయాలన్నారు. భగవద్గీత వద్ద మానసిక ప్రశాంత, ఆత్మస్థైర్యం సిద్ధిస్తుందన్నారు. పర్వదినం సందర్భంగా ఆలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ శ్రీ కృష్ణుడి ఆశీసులు సంపూర్ణంగా ఉంటాయని ఆమె కోరుకున్నారు. నెల్లూరు ఇస్కాన్ అధ్యక్షులు సుఖదేవ్ స్వామి మాట్లాడుతూ.. నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ అభివృద్ధిలో వేమిరెడ్డి దంపతుల పాత్ర అమోఘమన్నారు. ప్రతి ఏటా స్వామివారి సేవకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు అనేక విధాలుగా ఆలయానికి అండదండలు అందిస్తున్నారని చెప్పారు.

# పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండ: మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్ ఆగస్టు 16 (ప్రభాతవార్త): పేదల ఆరోగ్యం విషయంలో కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని,స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.శనివారం పట్టణం లోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి



చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 27 మంది లబ్ధిదారులకు రూ.27,29,948 విలువైన చెక్కులను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేద అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తుందని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు 242 మందికి రూ. 3.04 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించామన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి మనోహర్ కి,కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# అమాయకులకు ఆశ చూపి శిశువులను విక్రయించాం

### సృష్టి ఫెర్టిలిటీ కేసులో నేరాన్ని అంగీకరించిన నిందితురాలు డా.నమ్రత

### సరోగసీ ప్రక్రియనే లేదని డిసిపి వెల్లడి

### బాధితుల నుంచి రూ.30 లక్షల వసూలు

### ఏజెంట్లతో అక్రమ దందాకు తెర

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** సికిందరాబాద్ సృష్టి ఫెర్టిలిటీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నా యి. అమాయక మహిళల ఆర్థిక పరిస్థితి ఆసరగా చేసుకొని సరోగసి పేరిట గర్భినుల శిశువులను కొనుగోలు చేసి దంపతులేని వారికి ఇచ్చినట్లు నిర్వాహకురాలు డా. నమ్రత శనివారం హైదరాబాద్ పోలీసుల ముందు నేరాన్ని అంగీకరించింది. సుమారు ఇరవై రోజు లుగా కొనసాగిస్తున్న దర్యా ప్తులో ఎన్నో



డా. నమ్రత

అక్రమాలు బయటపడ్డాయి. అయితే నేరాంగీకార పత్రంలో పలు కీలక అంశాలను పోలీసులు నమోదు చేశారు. ఇందులో ఏపీలోని విజయవాడ, విశాఖ, తెలంగాణలోని సికిందరా బాద్‌లో ఫెర్టిలిటీ సెంటర్లనే ఏర్పాటు చేశారని,సరోగసి పేరుతో పిల్లలు లేని బాధితుల రూ.30 లక్షల వరకు డబ్బులు తీసుకున్నారని పేర్కొన్నారు. అక్రమ దందాకు ఆయా నగరాల్లో పదుల సంఖ్యలో ఏజెంట్లను నియ మించుకొని పిల్లలను కొనుగోలు చేశారు. అంతేకాకుండా ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు డబ్బుల ఆశచూపి శిశువుల విక్రయానికి అక్రమంగా ఒప్పందం చేసుకున్నారు. ప్రసవం తర్వాత బాలింతల నుంచి పిల్లల్ని వేరు చేసి సరోగసి ద్వారా పుట్టినట్లు నమ్మిస్తారు. దీంతో పలు పోలీసు స్టేషన్లలో తనపై కేసులు నమోదైనట్లు నమ్రత ఒప్పుకున్నట్లు డిసిపి రష్మిపెరుమాళ్ వెల్లడించారు.

**ఫిర్యాదుతో వెలుగులోకి..**

జూలై 27న సృష్టి ఆస్పత్రిపై ఓ దంపతులు ఫిర్యాదు చేయడంతో లోగుట్టు అక్రమాలు వెలుగుచూశాయి. కేసు నమోదు చేసుకొని పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడంతో అమ్మతనానికి మచ్చ పడేలా డాక్టరు వ్యవహరించదనే తెలుస్తుంది. సదరు నిందితురాలైన నిర్వాహకురాలు డా. నమ్రత విశాఖలో డా.కల్యాణి, టెక్నిషియన్ చెన్నారావులతో పాటు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎనస్తీషియన్ సదానంద్‌లను అరెస్టు చేసింది తెలిసిందే. సరోగసి పద్ధతి ద్వారా పిల్లలు లేని వారికి ప్రయోజనం చేకూరుస్తామని నమ్మబలికి నమ్రత వేరే వారి శిశువులకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలతో నేరాన్ని అంగీకరించడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విచారణ చేపట్టిన పోలీసులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని, సదరు హస్పిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరాయని గుర్తించారు. అంతేకాకుండా సంతానం కలగని దంపతులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు వెళ్లిన అనంతరం దంపతులకు డాక్టర్ నమ్రత పలుటెస్ట్‌లు నిర్వహించి ఐవీఎఫ్ సాధ్యం కాదని సరోగసీ ద్వారా బిడ్డను పొందవచ్చని చెప్పి మోసం చేశారని డీసీపీ అన్నారు. సరోగసీ కోసం రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని, విశాఖకు చెందిన ఓ దంపతులను ఒప్పించానని నమ్రత ఒప్పించినట్లు రష్మి పెరుమాళ్ తెలిపారు. ఆ దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి సరోగసీ చేస్తున్నట్లు చేస్తారని చెప్పారు. విశాఖలోని ఓ గర్భిణిని సరోగసీ మదర్ అని చూపించి మోసం చేశారన్నారు. కొన్నాళ్లు గడిచిన తర్వాత విశాఖ హాస్పిటల్‌లో ఓ బాబును పిల్లలు కావాలనుకునే దంపతులకు ఇచ్చారు. సరోగసీకి అంగీకరించిన మహిళ అదనంగా డబ్బు అడుగుతున్నట్లు చెప్పి డాక్టర్ వాటిని తీసుకున్నట్లు విచారణలో గుర్తించామని డిసిపి తెలిపారు. ఈ కేసులో డాక్టర్ నమ్రత అసలు సరోగసీ పద్ధతే చేయలేదు. శిశువు వద్దనుకున్న ఓ మహిళకు రూ.90వేలను చెల్లించారు. ఆమెకు శిశువు జన్మించగానే తీసుకున్నారు. ఆ తర్వాత దంపతులకు అను మానం వచ్చి డీఎన్ఏ టెస్టు చేయిస్తే మ్యాచ్ కాకపోవడంతో ఆ బిడ్డ తమకు చెందినది కాదని తేలినట్లు డిసిపి రష్మి పెరుమాళ్ తెలిపారు. సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలను ఉల్లంఘించారని వివరించారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్ ఆగస్టు 16 (ప్రభాతవార్త):పట్టణం లోని నాజరుపేట, బుర్రిపాలెం రోడ్డులో వేంచేసిన శ్రీ గోపాలకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి పండుగ సందర్భంగా,స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన



శ్రీకృష్ణుని ప్రత్యేకపూజా కార్యక్రమాలలో పాల్గొని అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తాడిబోయిన రమేష్,తోట మల్లి,తోట రఘురాం,గుంటూరు కోటేశ్వరరావు,పేరం సంజీవరెడ్డి,పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.అనంతరం పట్టణంలోని గంగానమ్మపేటలోని శ్రీకృష్ణభక్త బృందం వారు నిర్వహించిన కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ కలియుగంలో కల్మషాల్ని హరించి పుణ్యాల్ని ప్రసాధించే పర్వదినం కృష్ణాష్టమి అని, హిందువుల పండుగలలో ముఖ్యమైన పండుగ కృష్ణాష్టమి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సమాది బాలకృష్ణ,సమాది మహేష్, ఇతర శ్రీకృష్ణ భక్తబృందం,పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## గౌతు లచ్చన్న ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### -టిడిపి పార్లమెంట్ కార్యదర్శి బొర్రు రామారావు

పొన్నూరు, ఆగస్టు 16,ప్రభాతవార్త: సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి పార్లమెంట్ కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో



శనివారం జరిగిన సర్దార్ గౌత లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న ఎంతో కృషి చేశారన్నారు. ఆ మహనీయుని ఆలోచన విధానంతోనే నేడు వెనుకబడిన వర్గాలు ఎన్నో అవకాశాలను సద్వినియోగం చేసుకొంటున్నారన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. తొలుత సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి సురేష్, బుల్లి ఆంజనేయులు, గ్రామంలోని గౌడ సంఘీయులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా బీసీ సంఘాల నివాళి

తెనాలి టౌన్ ఆగస్టు 16 (ప్రభాతవార్త): భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గం అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు అన్నారు.శనివారం స్థానిక రామలింగేశ్వర పేట లోని బీసీ సంఘం కార్యాలయంలో తెనాలి నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ



సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర ఉద్యమంలో,ఉప్పు సత్యాగ్రహంలో,విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొనటమే కాకుండా,ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న సమయంలో నలభైరోజులు జైలు జీవితం గడిపారని తెలిపారు.స్వతంత్రం సాధించేంతవరకు వివాహం చేసుకోనని శపథం చేసి స్వతంత్రం వచ్చిన అనంతరం ముప్పైఏడో యేట లచ్చన్న వివాహం చేసుకున్నారని తెలిపారు.సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్రోద్యమ నాయకుని గా,శాసనసభ్యునిగా,మంత్రిగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు జొన్నాదుల శివరామకృష్ణ,వంగర సత్యనారాయణ,కటికం అచ్చయ్య,రమేష్,మురళి, ములికి జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం కాఫర్‌డ్యామ్ స్వల్ప కుంగుబాటు

### పది అడుగుల వెడల్పు ఎనిమిది అడుగుల లోతు చిన్నగోతి

**హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యాం ఎడమ వైపు ఎగువన స్వల్పంగా కూలిపోవడం నీటిపారుదల శాఖ అధికారులు గర్తించారు .పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం వద్ద మట్టి కుంగడంతో ఎన్‌డిఎస్‌ఎ కేంద్రప్రభుత్వం సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం డ్యాంభద్రతపై చర్చకు దారితీసింది. సిడబ్ల్యుసి అధికారి చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో పోలవరండ్యాం కోసం నిర్మించిన నిర్మాణాలు గతంలో కొట్టుకు పోయి భారీగా ఆర్థిక నష్ఠం కలిగింది.ప్రస్తుతం 10 అడుగుల వెడల్పు. 7 నుంచి 8 అడుగుల లోతున చిన్నగోతి ఏర్పడింది. శుక్రవారం ఉదయం దీన్ని గుర్తించిన అధికారులు యుద్ధప్రాతిపదికన ఆ ప్రాంతాన్ని పటిష్ఠపరిచే పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం +28 మీటర్ల వద్ద ఉంది. పైగా ఎగువనే నిర్మాణంలో వాడిన మెటీరియల్ మట్టి పడిపోయింది తప్ప దిగువ నుంచి ఎలాంటి సమస్య లేదు. దిగువన ఇప్పటికే బట్రస్ డ్యాం నిర్మాణం పూర్తి చేసినందువల్ల ఎగువ కాఫర్ డ్యాం కట్టడానికి వచ్చిన సమస్య ఏమీ లేదని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహామూర్తి తెలిపారు. ఆయనతో పాటు పోలవరం ఎస్‌ఈ రామచంద్రరావు ఆ ప్రాంతాన్ని సందర్శించినారు. మట్టి మెటీరియల్ జారినంత మేర పటిష్ఠపరిచే పనులు చేయించారు. ప్రధాన జలాశయం నిర్మాణమయ్యేలోపు నీటిని మళ్లించేందుకు వీలుగా నిర్మించిన తాత్కాలిక కట్టడమే ఇది. ఎగువ కాఫర్ డ్యాం కడుతారు. దీనికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే విదేశీ నిపుణుల బృందం సిఫార్సు మేరకు బట్రస్ డ్యాం నిర్మించారు. ఎగువ కాఫర్ డ్యాం పైనుంచి పోశమ్మ గండి వైపు (అల్లూరి సీతారామరాజు జిల్లా) నుంచి వాహనాలు కూడా ప్రయాణిస్తున్నాయి. 2022 ఆగస్టులో గోదావరికి భారీ వరదలు వచ్చాయి. అప్పట్లో మరింత పరద పెరుగుతుందేమోనన్న ఉద్దేశంతో ఎగువ కాఫర్ డ్యాం వెడల్పు 9 మీటర్లు ఉండేలా,ఎత్తు మరో 2 మీటర్ల మేర పటిష్టం చేశారు. అలా పైన పెంచిన ప్రాంతంలో మాత్రమే ఇప్పుడు కొద్దిగా జారిందని అధికారులు వివరించారు. మళ్లీ వాహనాల రాకపోకలు కూడా ప్రారంభమయ్యాయని, సమస్య ఏమీ లేదని తెలిపారు. నిరంతరం పర్యవేక్షణ ఏర్పాటు చేశామని వెల్లడించారు.

## వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కొల్లిపర,అగష్టు 16 ప్రభాతవార్త: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండలంలో కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని చివలూరు, పిడపర్రు, వల్లభాపురం, దావులూరు, అత్తోట యాదవపాలెంతో పాటు వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్దలతో శ్రీకృష్ణుడుని ప్రత్యేకంగా ఆలం కరించి పూజలు చేసారు. మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి దేవస్ధానంలో అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు పురస్కరించి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసారు.అదేవిధంగా శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు.



## రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

### -జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ హరిబాబు

కొల్లిపర,అగష్టు 16 ప్రభాతవార్త: రైతు శ్రేయస్సే లక్ష్యంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ హరిబాబు అన్నారు.శనివారం మండల పరిధిలోని అత్తోటలో రైతులతో ఆయన సమావేశాన్ని నిర్వహించి సమస్యలను అడిగి



తెలుసుకున్నారు.ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఎరువులు కొరత లేకుండా సకాలంలో అందించటమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.మండలంలో ఎరువుల స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేయటానికి అనువైన గోడౌన్లు పరిశీలిస్తున్నట్లు చెప్పారు.సమావేశంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి రంగారావు,బిజినెస్ మేనేజర్లు హరగోపాల్,శ్రీనివాస్,కూటమి నాయకులు కొఠారు ఆంజనేయులు,దాసరి నర్సయ్య,ముంగర బుల్లికోటయ్య పాల్గొన్నారు.

## వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు

తెనాలి టౌన్ ఆగస్టు 16 (ప్రభాతవార్త):శ్రీకృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకుని పట్టణంలో వాడవాడలా శ్రీక్రిష్ణజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని ఆర్‌ఆర్ కాలనీ ద్వారకానగర్ లోని శ్రీక్రిష్ణ మందిరం వద్ద నాలుగో సంవత్సరం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా, మాజీ కౌన్సిలర్ నల్లగొర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున భక్తులు శ్రీకృష్ణుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు,శైలజ భక్తబృందం చే కోలాట ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సుమారు నాలుగువేల మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగిరేకుల ప్రసాద్ బాబు,దొండపాటి కోటేశ్వరరావు,అన్నపరెడ్డి ప్రభాకర్ రెడ్డి,బీటీవీఎస్ నారాయణ,పి.సోములు,పి.శ్రీను,తదితరులు పాల్గొన్నారు.



## కొల్లూరు ఎస్‌బిఐ మేనేజర్ శ్రీనివాసరావుకు సన్మానం



కొల్లూరు, ఆగస్టు 16 (ప్రభాతవార్త) : స్వతంత్ర వేడుకలు సందర్భంగా మండల కేంద్రమైన కొల్లూరులోని స్టేట్ బ్యాంక్ ఇండియా శాఖ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ టి.భాస్కర్, సిబ్బందిని దుశ్శాలవాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, కుర్ర సత్యనారాయణ, గోగినేని చంద్రశేఖర్, గొరికపూడి ప్రసాద్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్, డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ తదితరులున్నారు.

## దొంగతనం కేసులో ముద్దాయికి 7నెలల జైలు

కొల్లూరు, ఆగస్టు 16 (ప్రభాతవార్త) : జనవరిలో చోరీ చేసిన వ్యక్తికి 7నెలలు జైలు శిక్ష విధించినట్లు కొల్లూరు ఎస్సై అమరవర్ధన్ తెలిపారు. చిలుమూరు కృష్ణానది ఒడ్డున కనకదుర్గమ్మ దేవి శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి గుడిలో పూజారి పూజలు ముగించుకుని రాత్రి గుడికి తాళాలు వేసి వెళ్ళారు. మరుసటి రోజు ఉదయాన్నే పూజాది కేశవరావు వచ్చి చూడగా తాళాలు పగలకొట్టి ఉన్నాయని, అమ్మవారి నగలు మరియు హుండీలో కానుకలు పోయాయని గుర్తించి ధర్మకర్త యార్లగడ్డ సుబ్బారావుకి తెలియజేయగా కొల్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై జి.ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా జనవరి 20వ తేదిన చిలుమూరు కరకట్టపై బస్సు షెల్టర్ వద్ద దొంగతనం చేసిన వ్యక్తి మోపిదేవి మణికంఠ ఏలియాస్ పొట్టినీ విచారించగా గుడిలో చోరీ చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడని అతని దగ్గర నుండి నగలు, రూ.50వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నేరం రుజువు కావడంతో తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జిజ పవన్‌కుమార్ 7నెలలు జైలు శిక్ష విధించారు. ఈ కేసును సీనియర్ ఏపీపీ పరిశ పోగు సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

# కిస్త్‌వాడ్ క్లౌడ్‌బరస్ట్ భయానక ఘటన విడియో సోషల్ మీడియాలో వైరల్

### మేఘ విస్ఫోటనం ఇంత భయానకంగా ఉంటుందా?

### ఆందోళనతో యాత్రికులు వాహనాలను వదిలి పరుగులు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని కిస్త్‌వాడ్ జిల్లా చిషోటి గ్రామంలో గురువారం ఉదయం పెనువిధ్వంసానికి కారణమైన భారీ మేఘ విస్ఫోటనం (క్లౌడ్ బరస్ట్) తాలుకు వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో క్లౌడ్ బరస్ట్ సంభవించిన సమయంలో తలెత్తిన పరిస్థితులు, అక్కడికి సమీపంలో గల మచ్చైల్ మాత ఆలయానికి వచ్చిన భక్తులు తమ వాహనాలను వదిలి చెల్లాచెదురుగా పారిపోతుండడం స్పష్టంగా వుంది. క్లౌడ్ బరస్ట్ సమయంలో చిషోటి గ్రామంలో సుమారు వెయ్యి మంది వరకు యాత్రికులు, గ్రామస్తులు ఉండగా ఈ సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడ్డ వరదల వల్ల ఇళ్లతో పాటు తాత్కాలిక నిర్మాణాలు, వాహనాలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 60 మందికి పైగా మరణించగా వంద మందికి పైగా గల్లంతయ్యారు. మరో 200 మంది వరకు గాయపడ్డారు. ఒక్కసారిగా పోటెత్తిన వరద ఉధృతి కారణంగా అక్కడ వున్న యాత్రికులు, గ్రామస్తులు ప్రాణాలు కాపాడుకోవడానికి హాహాకారాలు చేయడం, భయంతో అరుస్తూ పరుగెత్త డం విడియోలో స్పష్టంగా కపిపించింది. ఇదే విడియోలో వరద ఉధృతి మరింత దగ్గరగా రావడం కనిపించింది. నదులు, వాగులు, ఉప్పొంగి ప్రవ హిస్తూ పలు నిర్మాణాలను, చెట్లను పెకిలించుకు పోవడం కనిపించింది. వరద నీటి ధాటికి బండరాళ్లు, చెట్లు కొట్టుకుపోగా వాటి కింద అనేక మంది కూరుకుపోయి వుంటారని స్థానికులు చెబుతున్నారు. మృతుల్లో భద్రతా బలగాలకు చెందిన వారు కూడా వున్నారు. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన అవు ట్‌లెట్ జమ్మూ లింక్స్ ఈ వీడియో పోస్ట్ చేసింది. వరద ప్రారం భమైన తరువాత నిలిపివున్న వాహనాల్లో కొన్ని ఒక్కసారిగా నీటిలో మునిగి పోవడం, మరికొన్ని కొట్టుకు పోవడం ఈ వీడియోలో కనిపించింది.

కాగా శిధిలాల్లో చిక్కుకుపోయిన వారిని ఆసుపత్రికి తరలించగా వీరిలో 40 మంది పరిస్థితి తీవ్రంగా వుందని వైద్యులు తెలిపారు.

## అవయవదాత కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి ఆగస్టు 16 (ప్రభాతవార్త): రూరల్ మండల గ్రామం సోమసుందరపాలెం కి చెందిన కంచెర్ల సుబ్బరాజు బ్రెయిన్ డెడ్ కావటంతో,అతని అవయవాలను దానం చేసిన కుటుంబసభ్యులను పరామర్శించి,అవయవదాత సుబ్బరాజు భౌతికకాయానికి నివాళి అర్పించిన



మాజీమంత్రి,శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కంచెర్ల సుబ్బరాజు మరణానంతరం అతని అవయవాలను దానం చేసి ఏడుగురికి ప్రాణదానం చేసి మానవత్వం చాటుకుని సహకరించిన కుటుంబసభ్యులు అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు.ప్రభుత్వం నుంచి,తెలుగుదేశం పార్టీ నుంచి సుబ్బరాజు కుటుంబానికి అన్నిరకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

17-08pg10 12 VJA PG_17-08pg10.qxd 8/16/2025 10:23 PM Page 1



# ఆసియా కప్‌లో సెంచరీల హీరోస్



## నంబర్ 1 గా శ్రీలంక జయసూర్య









**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 ప్రారంభం కావడానికి ఇక నెల కంటే తక్కువ సమయమే ఉంది. సెప్టెంబర్ 9న ఈ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఇది ఆసియా కప్‌కు 17వ ఎడిషన్. గతంలో చాలాసార్లు వన్డే ఫార్మాట్‌లో జరగగా ఈసారి టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఆసియా కప్ చరిత్రలో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాళ్ల రికార్డును శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్య పేరు మీద ఉంది. ఈ జాబితాలో టాప్5లో ఒక భారతీయ స్టార్ ఆటగాడి పేరు కూడా ఉంది. శ్రీలంక మాజీ డాషింగ్ బ్యాట్స్‌మెన్ సనత్ జయసూర్య ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. ఆయన ఆసియా కప్‌లో ఆడిన 25 మ్యాచ్‌లలో 6 సెంచరీలు సాధించాడు. ఈ క్రమంలో 53.04 సగటుతో 1220 పరుగులు చేశాడు. జయసూర్య దూకుడుగా ఆడే తన శైలితో శ్రీలంకకు చాలా విజయాలను అందించాడు. అలాగే భారత్ స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ ఆసియా కప్‌లో ఆడిన 16 మ్యాచ్‌లలో 4 సెంచరీలు సాధించాడు. ఈ సెంచరీలు 61.83 అద్భుతమైన సగటుతో 742 పరుగులుగా నమోదయ్యాయి. ఇందులో పాకిస్తాన్‌పై 183 పరుగుల ఇన్నింగ్స్ సాధించిన రికార్డు కూడా ఉంది. అలాగే శ్రీలంక మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ కుమార్ సంగక్కర ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. సంగక్కర 24 మ్యాచ్‌లలో 4 సెంచరీలు చేసి 48.86 సగటుతో 1075 పరుగులు సాధించారు. పాకిస్తాన్ ఆల్‌రౌండర్ షోయబ్ మాలిక్ ఈ జాబితాలో నాలుగో స్థానంలో ఉన్నాడు. మాలిక్ 17 మ్యాచ్‌లలో 3 సెంచరీలు చేసి, 65.50 మంచి సగటుతో 786 పరుగులు చేశారు. శ్రీలంక బ్యాట్స్‌మెన్ లహిరు తిరిమన్నే ఐదో స్థానంలో ఉన్నాడు. తిరిమన్నే కేవలం 8 మ్యాచ్‌లలోనే 2 సెంచరీలు సాధించి, 45.37 సగటుతో 363 పరుగులు చేశాడు. కాగా టీ20 ఫార్మాట్‌లో సెంచరీలు కొట్టడం కష్టమే అయింది. ఆసియా కప్ గతంలో 2016, 2022లో టీ20 ఫార్మాట్‌లో జరిగింది. ఈ ఫార్మాట్‌లో కేవలం ఇద్దరు ఆటగాళ్లు మాత్రమే సెంచరీలు సాధించారు. హాంకాంగ్ కు చెందిన బాబర్ హయత్ 5 మ్యాచ్‌లలో ఒక సెంచరీ, 47 సగటుతో 122 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లీ 10మ్యాచులు ఆడి ఒక సెంచరీ, 85.80 సగటుతో 429 పరుగులు చేశాడు.

## డబ్ల్యుటిటి వియంటియాన్
# ఛాంపియన్‌గా జ్ఞానశేఖరన్



**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిటి ఫీడర్ వియంటియాన్ ఛాంపియన్‌గా భారత్ టేబుల్ టెన్నిస్ స్టార్ సత్యన్ జ్ఞానశేఖరన్ నిలిచాడు. టోర్నమెంట్‌లో రెండవ సీడ్ అయిన జ్ఞానశేఖరన్, ఫీడర్ వియంటియాన్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా అద్భుతమైన ఫామ్‌లోకి వచ్చాడు. జపాన్‌కు చెందిన టాప్ సీడ్ రియోచి యోషియామాతో శనివారం జరిగిన పోరులో, సాథియన్ ఫైనల్‌లో ఆధిపత్య ప్రదర్శన ఇచ్చాడు. తన ప్రత్యర్థిని 3-0 (11-4, 11-6, 12-10) తేడాతో ఓడించి అద్భుతమైన విజయం సాధించాడు. ఈ టోర్నమెంట్ ఆగస్టు 11-15, 2025 వరకు లావోస్‌లోని వియంటియాన్‌లోని ఐటిఇసిసి మాల్‌లో జరిగింది. ఈ విజయం అతనికి ఛాంపియన్‌షిప్‌ను ఖరారు చేయడమే కాకుండా కీలకమైన ర్యాంకింగ్ పాయింట్లు మరియు 30,000 ఈవెంట్ నుండి ప్రైజ్ మనీని కూడా అందించింది. కాగా ఈ తాజా విజయం సత్యన్ సాధించిన మరో ముఖ్యమైన విజయానికి దగ్గరగా ఉంది. కొన్ని వారాల క్రితం, అతను ఆకాష్ పాల్‌తో కలిసి డబ్ల్యూటిటి కాంటెండర్ లాగోస్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 3-0 స్కోరుతో బలమైన ఫ్రెంచ్ ద్వయం జూల్స్ రోలాండ్ మరియు లియో డి నోడ్రెస్ట్‌పై వారి విజయం సత్యన్ యొక్క బహుముఖ ప్రజ్ఞ మరియు నైపుణ్యాన్ని ప్రదర్శించింది, సింగిల్స్ మరియు డబుల్స్ ఫార్మాట్లలో రాణించగల అతని సామర్థ్యాన్ని ఈ ఛాంపియన్‌షిప్ హైలైట్ చేసింది.




## సిన్సినాటి ఓపెన్‌లో..
# సబలెంకా ఓటమి
### ప్రతీకారం తీర్చుకున్న రైబాకినా

**న్యూఢిల్లీ:** సిన్సినాటి ఓపెన్ 2025లో ప్రపంచ నెంబర్ వన్ క్రీడాకారిణి, టాప్ సీడ్ సబలెంకా సంచలన ఓటమి చవిచూసింది. 2022 వింబుల్డన్ విజేత రైబాకినా సబలెంకాను ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. దీంతో తన 12 మ్యాచ్‌ల వ్యక్తిగత పోటీలో ఐదవ విజయాన్ని సాధించినట్లయింది. రెండు నెలల క్రితం బెర్లిన్‌గ్రాస్‌లో సబలెంకా చేతిలో జరిగిన ఓటమికి ఈ విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. శనివారం జరిగిన డబ్ల్యూటిఎ మరియు ఎటిపి సిన్సినాటి ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఎలెనా రైబాకినా 6-1, 6-4 తేడాతో టాప్ సీడ్ అరినా డిఫెండింగ్ ఛాంపియన్ సబలెంకాను ఓడించింది. రైబాకినా 11 ఏస్‌లు కొట్టి సబలెంకాను చిత్తు చేసి తన తొలి సిన్సినాటి సెమీఫైనల్‌ను సాధించింది. ఈ సీజన్‌లో ఆడిన చివరి మూడు మ్యాచ్‌ల్లో స్వియాటెక్‌ను గెలుచుకుంది. ఆమె రెండవ సెట్‌లో కజకిస్తాన్‌పై తన పట్టును నిలుపుకుంది, సబలెంకా రెండు గేమ్‌లు ఆడింది, రైబాకినా ఏస్‌లతో రెండు బ్రేక్ పాయింట్లను సేవ్ చేసి సెట్ మరియు 53 ఆధిక్యంలో ఉంది. ఇక 34వ ర్యాంక్‌లో ఉన్న మాజీ ప్రపంచ నంబర్ వన్ కాలిన్స్‌కయా చివరి ఆటలో నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్న తర్వాత, చివరకు సిన్సినాటి ఫైనల్ ఫోర్‌లోకి ప్రవేశించింది. అయితే ఆమెను ఓడించడానికి స్వియాటెక్‌కు 93 నిమిషాల ఐదు మ్యాచ్ పాయింట్లు అవసరం అయ్యాయి. కానీ మూడవ సీడ్ స్వియాటెక్, 30 సెల్సియస్ ఉష్ణోగ్రతలను తట్టుకుని, చివరకు విజయం సాధించి ఈ సీజన్‌లో తన నాల్గవ 1000స్థాయి సెమీఫైనల్‌కు చేరుకుంది.

# చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో టైబ్రేక్‌లో అర్జున్ ఓటమి
## రెండో రన్నరప్‌తో సరి



**న్యూఢిల్లీ:** చెన్నై గ్రాండ్ మాస్టర్స్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగేసి అర్జున్ రెండవ రన్నరప్‌గా నిలిచాడు. సూపర్ బిలీ టోర్నమెంట్, చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నమెంట్ చివరి రౌండ్‌లో డ్రా చేసుకోవడంతో అర్జున్ ఏకైక రెండవ స్థానంలో నిలిచే అవకాశాన్ని కోల్పోయాడు. అతను ఫామ్‌లో ఉన్న కార్తికేయన్ మురళితో 49-మూవ్‌ల డ్రా ఆడి, తొమ్మిది ఆటల్లో 5 పాయింట్లతో నెదర్లాండ్స్‌కు చెందిన కార్తికేయన్, అనిష్ గిరితో కలిసి రెండవ స్థానంలో నిలిచాడు. ఎనిమిది వరుస మ్యాచ్‌ల డ్రాలకు ముగింపు పలికిన అనిష్, తన తోటి దేశస్థుడు జోర్డెన్ వాన్ ఫారెస్ట్‌తో జరిగిన చివరి రౌండ్‌లో ఘన విజయం సాధించి, రెండవ స్థానంలో ఉన్న ఇద్దరు భారతీయ ఆటగాళ్లతో జతకట్టాడు. అయితే, డచ్ నంబర్ 1 ఆటగాడు టైబ్రేక్‌లలో అర్జున్ మరియు మురళి ఇద్దరినీ ఓడించి, మాస్టర్స్ విభాగంలో రన్నరప్ స్థానాన్ని దక్కించుకున్నాడు, దీంతో అర్జున్ అదే టైబ్రేక్ నియమం ఆధారంగా తోటి భారతీయుడి కంటే ముందు మూడవ స్థానంలో నిలిచాడు. ఇక ఇతర మ్యాచ్‌లలో, నిహాల్ సరిన్ ప్రణవ్ జు పై క్లినికల్ విజయాన్ని నమోదు చేసి 4.5/9 పాయింట్లతో టోర్నమెంట్‌ను టాప్ 5లో ముగించాడు. అయితే విదిత్ గుజరాతీ 4/9 పాయింట్లతో 7వ స్థానంలో నిలిచాడు. ఛాలెంజర్ టైటిల్ గెలుచుకున్న ఎం ప్రాణేష్ ఛాలెంజర్స్ విభాగంలో ఎం. ప్రాణేష్ తన చివరి రౌండ్ మ్యాచ్‌లో ఓటమిని ఎదుర్కొన్నప్పటికీ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు, అతని సమీప ప్రత్యర్థి అభిమన్యు పురాణిక్ కూడా తొమ్మిదవ రౌండ్‌లో ఓటమిని ఎదుర్కొని, టైగా రెండవ స్థానంలో నిలిచాడు.

## స్క్వాష్ బేగా ఓపెన్‌లో..
# ఫైనల్‌కు అనహత్




**న్యూఢిల్లీ:** ఎన్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బేగా ఓపెన్-2025లో భారత్ అథ్లెట్ అనహత్ సింగ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఐదు గేమ్‌ల సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆమె ఈజిప్ట్‌కు చెందిన నూర్ ఖఫాగీని ఓడించింది. ఆస్ట్రేలియాలో శనివారం జరిగిన పిఎస్ఎ టూర్ కాపర్ ఈవెంట్, ఎన్ఎస్‌డబ్ల్యూ బేగా ఓపెన్‌లో భారత ఏస్ స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్ ఈజిప్టుకు చెందిన నూర్ ఖఫాగీపై ఐదు గేమ్‌ల ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. 54 నిమిషాల పాటు సాగిన అలసిపోయిన సెమీఫైనల్ మ్యాచ్‌లో అనాహత్ ఒక గేమ్‌లో వెనుకబడిన తర్వాత బలంగా పుంజుకుని ఖఫాగీని 10-12, 11-5, 11-5, 10-12, 11-7తో ఓడించాడు. ఈజిప్షియన్ క్రీడాకారిణి మ్యాచ్‌ను స్వల్ప ఆధిక్యంతో ప్రారంభించింది, దానిని అనాహత్ నెమ్మదిగా వెనక్కి నెట్టి, ప్రారంభ గేమ్‌లో డ్యూస్‌ను బలవంతంగా కొట్టినా ఆమె దానిని కొనసాగించలేక నూర్ చేతిలో చివరి రెండు పాయింట్లను కోల్పోయింది. అయితే టాప్ సీడ్ అనహత్ బలంగా పుంజుకుని, తదుపరి రెండు గేమ్‌లను సౌకర్యవంతమైన తేడాతో గెలిచి మ్యాచ్‌లో తొలిసారి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ ఆ తర్వాత ఈజిప్టు ప్లేయర్ వరుసగా ఐదు పాయింట్లు గెలుచుకుంది. అదే సమయంలో మూడు మ్యాచ్ బంతులను ఆదా చేసే ప్రయత్నంలో నిర్ణయాత్మక ఆటలో భారత క్రీడాకారిణి మరో మూడు మ్యాచ్‌ల బంతి అవకాశాలను పొందింది, ఈసారి ఆమె ఖఫాగీకి తిరిగి వచ్చి మొదటి మ్యాచ్ బంతిని 11-7తో గోల్‌గా మార్చడానికి అవకాశం ఇవ్వలేదు.

# వాణిజ్యం




## అంతర్జాతీయ విపణికి 4 ఎస్‌యువిలు!

**ముంబయి, ఆగస్టు 16:** మహీంద్రా చివరకు తన నాలుగు కొత్త విజన్ కాన్సెప్ట్ ఎస్‌యువీలను ఆవిష్కరించింది. ఇవి బ్రాండ్ కొత్త ఎన్‌యూఐక్యూ మాడ్యులర్ మోనోకోక్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందించారు. ఈ ఎస్‌యువి ల ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న వెర్షన్లు 2027లో రావడం ప్రారంభిస్తాయి. ఆటోమేకర్ ఇంకా ప్రతి మోడల్ పూర్తి వివరాలను వెల్లడించనప్పటికీ, మహీంద్రా విజన్ ఎస్ కాన్సెప్ట్ స్కార్పియో కుటుంబంలో చేరే అవకాశం ఉంది. పంద్రాగస్టు సందర్భంగా కంపెనీ తన గ్లోబల్ విజన్ 2027ను ప్రదర్శించింది. దీని కింద ఎన్‌యు ఐక్యూ ప్లాట్‌ఫారమ్ ఆధారంగా నాలుగు కొత్త ఎస్‌యువిలు తయారు చేయనుంది కంపెనీ. అవి ప్రపంచ స్థాయి డిజైన్‌తో పాటు ఫీచర్లు, భద్రత ఫీచర్స్ ఉంటాయి. ఈ సందర్భంగా కంపెనీ విజన్‌ఎస్, విజన్‌టి, విజన్ ఎస్సెక్స్‌టి, విజన్ ఎక్స్ వంటి నాలుగు రాబోయే ఎస్‌యువిల కాన్సెప్ట్ మోడళ్లను కూడా ఆవిష్కరించింది. ఈ వాహనాలన్నీ కొత్త ఎన్‌యుఐక్యూ ప్లాట్‌ఫారమ్‌పై తయారు అవుతాయి. కంపెనీ వాటిని ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో పరిచయం చేస్తుంది. ఈ సందర్భంగా మహీంద్రా ఆటోమోటివ్ బిజినెస్ (నియమిత) ప్రెసిడెంట్, మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. వేలుస్వామి మాట్లాడుతూ ఎన్‌యుక్యూఐ అనేది ప్రపంచవ్యాప్తంగా మహీంద్రా ఎస్‌యువి భవిష్యత్తు కోసం రూపొందించిన ఒక వ్యూహాత్మక ప్రణాళిక. ఈ ప్లాట్‌ఫామ్ మాడ్యులర్, మల్టీఎనర్జీ నిర్మాణంతో రూపొందింది. అందుకే తాము వివిధ రకాల టాప్ హాట్స్, పవర్‌ట్రెయిన్లతో కొత్త ఆవిష్కరణలు చేయగలుగుతున్నామని చెప్పారు. అంతేకాకుండా, ఇది మహీంద్రా ఎస్‌యువిల స్వభావాన్ని నిలుపుకుంటుందని స్పష్టం చేశారు. ఎన్‌యుక్యూఐ ప్లాట్‌ఫామ్ భవిష్యత్ తరాల ఎస్‌యువిలకు పునాది అని, ఇది వినియోగదారులకు రాజీ పడాల్సిన అవసరం లేకుండా, కోరుకునే ప్రీమియం ఎస్‌యువిని అందిస్తుందని వివరించారు.

## దీపావళి నుంచి రెండు శ్లాబుల్లోనే
# 90% వస్తువులు!
### ఇక సామాన్యులకు అందుబాటులో నిత్యావసరాలు




**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** జీఎస్టీలో మార్పులు చేయడం ద్వారా సామాన్యులకు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు భారీగా ఉపశమనం కల్పించనున్నట్లు మోడీ తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో తెలిపారు. కేంద్రం తాజాగా జీఎస్టీలో రెండు శ్లాబుల విధానాన్ని ప్రతిపాదించింది. ఈ విధానంలో వస్తుసేవలను రెండు శ్లాబులుగా విభజించి 5 శాతం, 18 శాతం పన్నులు వసూలు చేయనున్నారు. ప్రస్తుతం 12% శ్లాబ్‌లో ఉన్న 99% వస్తువులు.. 5% పన్ను శ్రేణిలోకి, ప్రస్తుతం 28%పన్ను శ్లాబులో ఉన్న వస్తు సేవల్లో 90%. 18%పన్ను రేటుకు మారనున్నాయి. దీంతో వస్తుసేవల ధరలు తగ్గుతాయి. టూత్ పేస్ట్, టూత్ పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు, లిక్విడ్ సోప్స్, గొడుగులు, కుట్టు మెషీన్లు, ప్రాసెస్డ్ ఫుడ్, కండెన్స్‌డ్ మిల్క్, శీతలీకరించిన కూరగాయల వంటి ప్యాకేజ్డ్ ఫుడ్స్, ప్రెజర్ కుక్కర్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు(నాన్ ఎలక్ట్రానిక్) ఎలక్ట్రానిక్ ఐరన్స్, కంప్యూటర్లు, గీజర్లు, వాక్యూమ్ క్లీనర్లు (నాన్ కమర్షియల్), రెడీమేడ్ దుస్తులు, రూ.500-1000లోపు ఉన్న చెప్పులు, షూస్, పలు రకాల వ్యాక్సిన్లు, డయాగ్నోస్టిక్ కిట్లు, కొన్ని రకాల ఆయుర్వేద ఔషధాలు, జామెట్రీ బాక్సులు, మ్యాప్‌లు, గ్లోబ్‌లు, సోలార్ వాటర్ హీటర్లు, అల్యూమినియం, స్టీల్ వంటపాత్రలు, నాన్ కిరోసిన్ స్టవ్‌లు, సైకిళ్లు, ప్రజా రవాణా వాహనాలు, వ్యవసాయ పరికరాలు, వెండింగ్ మెషీన్లు, గ్లేజ్డ్ టైల్స్ (లగ్జరీ కానీ వేరియంట్లు), సిమెంట్, రెడీ మిక్స్ కాంక్రీట్, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, కార్లు, మోటార్ సైకిల్ సీట్లు, సైకిళ్లు, వ్యవసాయ వాహనాలకు వాడే రబ్బర్ టైర్లు, ప్లాస్టర్, ప్రొటీన్ సప్లిమెంట్లు, షుగర్ సిరప్‌లు, అరోమా కాఫీ, కాఫీ ఉత్పత్తులు, టాంపర్డ్ గ్లాస్, అల్యూమినియం ఫాయిల్, రేజర్లు, ప్రింటర్లు, మ్యానిక్యూర్/పెడిక్యూర్ కిట్లు, బీమా ప్రీమియం తగ్గనున్నాయి. ఇక, సేవల రంగంపై 18 శాతం జీఎస్టీ విధించే అవకాశం ఉంది.

# తొలిరోజే 1.4 లక్షల 'ఫాస్టాగ్'ల కొనుగోలు!




**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్‌ఏఐ విజయ వంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకు న్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగ దారులు ఎస్ఎమ్ఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వివరించింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్‌ఏఐ నిర్దేశించిన జాతీయ రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు. ఒకవేళ గరిష్ఠ పరిమితి 200 టోల్ క్రాసింగ్‌లు ఏడాదిలోపలే ముగిసిపోతే ఆటోమేటిక్‌గా సాధారణ విధానంలోకి ఫాస్టాగ్ మారి పోయి డబ్బు చెల్లించి టోల్ దాటవలసి ఉంటుంది. వార్షిక ఫాస్టాగ్ పాసు కొనేందుకు వాహనదారులు తమవాహన నంబరు, ఫాస్టాగ్ ఐడీ ఉపయోగించి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ/ఎంఒఆర్‌టీహెచ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. తమ ఫాస్టాగ్ యాక్టివ్‌గా, సక్రమంగా ఇన్‌స్టాల్ అయి ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 3,000 చెల్లించాలి. పాసు యాక్టివేట్ అవుతుంది. యూజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కన్ఫర్మేషన్ మెసేజ్ అందుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాసు ఇతరులకు బదిలీ కాదు. రిజిస్టర్డ్ వాహనానికి మాత్రమే పనిచేస్తుంది. అంతేగాక ఈ పాస్‌ను ఒకసారి కొనుగోలు చేస్తే మళ్లీ డబ్బు వాపసు వచ్చే అవకాశం ఉండదు.

# ఐపిఓకు వస్తున్న ఆర్ఎస్‌బి రిటైల్ ఇండియా!

**ముంబయి, ఆగస్టు 15:** ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పేర్లతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది.

ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తుచేసుకున్నది కూడా. ఈ ఐపీవో ద్వారా రూ.1,500 కోట్ల వరకు నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా ఈక్విటీలను జారీ చేయడంతో రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లకు చెందిన 2.98 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టింది. ఇలా సేకరించిన నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం, మరో రూ.118 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి వినియోగించనున్నది. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో 22 నగరాల్లో 73 స్టోర్లను నిర్వహిస్తున్నది.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్ఎస్ బ్రదర్స్, కాంచీపురం నారాయణి సిల్క్స్, డీఏ రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ పేర్లతో అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4 కోట్ల నికర లాభాన్ని గడించింది.

దేశీయ రిటైల్ రంగం అంచనాలకుమించి రాణిస్తున్నదని, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.92.6 లక్షల కోట్లుగా నమోదైంది. దీంట్లో దుస్తులు, యాక్సెసరీస్ రూ.6.90 లక్షల కోట్లుగా ఉన్నది.

# వడ్డీరేట్లు తగ్గించిన 3 బ్యాంకులు!




**ముంబయి, ఆగస్టు 16:** దేశంలోని ప్రముఖ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తమ కస్టమర్లకు గుడ్ న్యూస్ తెలిపాయి. ఎందుకంటే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును (ఎంసిఎల్ఆర్) తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో లోన్ తీసుకోవాలనుకుంటున్న వారికీ, ఇప్పటికే ఫ్లోటింగ్ రేట్ లోన్లు తీసుకున్న వారికీ ఇది శుభవార్త అని చెప్పవచ్చు. వడ్డీ రేట్లు తగ్గితే నెలవారీ ఈఎంఐల భారం కొంత తగ్గనుంది. ప్రధానంగా హౌసింగ్ లోన్, కార్ లోన్, పర్సనల్ లోన్ తీసుకునే వారికి ఇది ఎక్కువగా ఉపయోగపడుతుంది. అయితే ఈ కొత్త రేట్లు ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఎంసిఎల్ఆర్ అనేది బ్యాంకులు ఒక లోన్‌కు కనీసంగా వసూలు చేయగల వడ్డీ రేటు. దీన్ని బ్యాంకులు తమ ఖర్చులు, ఆర్బీఐ రెపో రేటు ఆధారంగా నిర్ణయిస్తాయి. ప్రధానంగా ఈ బ్యాంకుల్లోహోం లోన్ తీసుకుంటే ఎక్కువగా ఫ్లోటింగ్‌రేటు మీద ఆధారపడుతుంది. కాబట్టి ఇది 8.80% నుంచి 8.75%కి తగ్గడం మంచి పరిణామం. రీఫైనాన్స్ చేయాలంటే చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ మూడు ప్రధాన బ్యాంకులు వడ్డీరేట్లు తగ్గించాయంటే, మార్కెట్‌లో ఇతర బ్యాంకులు కూడా వడ్డీ రేట్లను క్రమంగా తగ్గించే అవకాశం ఉంది

# విదేశీ చిప్‌లపై ట్రంప్ ట్యారిఫ్ వడ్డన



**వాషింగ్టన్, ఆగస్టు 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెమీకండక్టర్ల దిగుమతులపై కఠిన వైఖరి అవలంబించనున్నారు. విదేశాల నుంచి వచ్చే చిప్‌లపై భారీ సుంకాలను విధించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన స్వయంగా వెల్లడించారు. వచ్చే వారం లేదా ఆ తర్వాత వారంలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, ఎస్కే హైనిక్స్ వంటి దక్షిణ కొరియా టెక్ దిగ్గజాలు అమెరికా విధానాలతో ఆందోళనలో పడ్డాయి. అమెరికాలో సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మొదట తక్కువ స్థాయిలోనే సుంకాలు ఉంటాయి. విదేశీ కంపెనీలు అమెరికాకు వచ్చి ఫ్యాక్టరీలు నిర్మించడానికి ఇది ఒక అవకాశం. నిర్దిష్ట గడువులోగా ఇక్కడ తయారీ ప్రారంభించకపోతే, ఆ తర్వాత చాలా ఎక్కువ మొత్తంలో సుంకం చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. గత వారం కూడా ట్రంప్ మాట్లాడుతూ, చిప్‌లపై దాదాపు 100 శాతం వరకు టారిఫ్ విధించే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భావించినప్పుడు, దిగుమతులను నియంత్రించేందుకు అధ్యక్షుడికి అధికారం కల్పించే ట్రేడ్ ఎక్స్‌ప్యాన్షన్ యాక్ట్ 1962 లోని సెక్షన్ 232ను ఉపయోగించి ఈ సుంకాలను విధించనున్నారు. అలాస్కాలోని యాంకరేజ్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ జరిపిన ఉన్నత స్థాయి సమావేశం ఎటువంటి ఒప్పందం లేకుండానే ముగిసింది. ఉక్రెయిన్‌లో సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు జరిగిన ఈ చర్చలు ఫలించలేదు. అయితే, భేటీ చాలా ఫలప్రదంగా, నిర్మాణాత్మకంగా జరిగిందని ఇరువురు నేతలు పేర్కొన్నారు. చాలా విషయాలపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ, కొన్ని కీలక అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. పూర్తి ఒప్పందం కుదిరే వరకు ఏదీ ఖరారైనట్లు కాదని ట్రంప్ సమావేశం అనంతరం వ్యాఖ్యానించారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన తర్వాత, యుద్ధాన్ని ఆపేందుకు జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాల్లో భాగంగా ఆరేళ్ల తర్వాత ట్రంప్, పుతిన్ సమావేశమవడం గమనార్హం.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14